thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 293 కరీంనగర్ మంగళవారం, 30 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఎస్ఐఆర్ సంస్కరణ కాదు, బలవంతపు అణచివేత

న్యూఢిల్లీ: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తీవ్రమైన పని ఒత్తిళ్ల కారణంగా పలువురు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలపై ఘాటుగా స్పందించారు. ఎస్ఐఆర్‌ను బలవంతపు అణిచివేతగా అభివర్ణించారు. ఈ ప్రక్రియ దేశ ప్రజలను వేధించేందుకు చేపట్టిన 'ఉద్దేశపూర్వక కుట్ర' అని ఆరోపించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ దేశంలో అలజడి రేపిందని, ప్రజాస్వామ్యానికి తిలోదకాలు వదిలి అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాసేందుకు ఉద్దేశించిన ప్రక్రియ అని రాహుల్ పేర్కొన్నారు. నిజమైన ఓటర్లను తప్పించడం ద్వారా ఎలక్టోరల్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా తారుమారు చేయడం, ఓట్ల చోరీని అప్రతిహతంగా కొనసాగించం ఎస్ఐఆర్ లక్ష్యమని ఆరోపించారు. 'ఎస్ఐఆర్ పేరుతో పౌరులను వేధించేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర జరిగింది. విపరీతమైన ఒత్తిడి బీఎల్ఓల మృతికి కారణమవుతోంది' అని తప్పుపట్టారు.






# మాధవీలతకు బిగ్ షాక్.. కేసు నమోదు

హైదరాబాద్, డిసెంబరు 29: ప్రముఖ సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారు పెట్టిన పోస్టు వల్ల ప్రజల భావోద్వేగాలకు నష్టం జరిగిందని ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. రేపు (మంగళవారం) ఉదయం 10 గంటలకు మాధవీలతతో పాటు మిగతా యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులోని ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో వారి సోషల్ మీడియా ఖాతాలపై నిఘా పెట్టినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ముగిసిన ఐబొమ్మ రవి కస్టడీ విచారణ.. కీలక వివరాలు సేకరించిన పోలీసులు..




ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కస్టడీ విచారణ పూర్తయింది. ఇమంది రవి కేసులో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కీలక వివరాలు సేకరించారు. ప్రహ్లాద్ వెల్లేల పేరిట రవి పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాడు. గతంలో ప్రహ్లాద్ తన రూమ్మేట్ అని రవి పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు బెంగళూరు నుంచి ప్రహ్లాద్‌ను పిలిపించి విచారించారు. కస్టడీలో ఉన్న ఇమంది రవి ఎదుటే ప్రహ్లాద్‌ను పోలీసులు ప్రశ్నించారు. ఇమంది రవి ఎవరో తనకు తెలీదని పోలీసులకు ప్రహ్లాద్ చెప్పాడు. తన పేరుతో రవి పాన్, లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసి షాక్‌కు గురయ్యానని ప్రహ్లాద్ అన్నాడు. ప్రహ్లాద్ డాక్యుమెంట్లు ఇమంది రవి దొంగలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇక, గతంలో చేసిన బ్యాంక్ ట్రాన్సక్షన్లను చూపించి రవిని పోలీసులు ప్రశ్నించారు.

లక్షల్లో లావాదేవీలు, డొమైన్ కొనుగోలు, ఐపీ మాస్క్ చేయడం గురించి రవిని పోలీసులు ప్రశ్నించారు. సర్వర్ లోడ్ కెపాసిటీ గురించి, ఎవరెవరు ఆ సర్వర్ మైంటైన్ చేస్తున్నారు అని కూడా పోలీసులు ఆరా తీశారు. త్వరలోనే పైరసి రాకెట్‌లో మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం కనబడుతోంది. కాగా, రవి 12 రోజుల కస్టడీ ఈ రోజుతో ముగిసింది. రవిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

## హరీశ్‌రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారు.. మంత్రి ఉత్తమ్ ఫైర్



హైదరాబాద్, డిసెంబరు 29 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు(సోమవారం) నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అంతా బయటపెడతామని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తాము 90టీఎంసీలు డిమాండ్ చేశామని చెప్పుకొచ్చారు. తాము 45 టీఎంసీలు మాత్రమే అడిగామని హరీశ్‌రావు దుష్ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోందని ఎద్దేవా చేశారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ.. అదే నిజం అవుతుందనుకుంటున్నారని మండిడ్డారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఓ పేరాగ్రాఫ్‌ను అవుటాఫ్ కాంటెక్స్ట్ తీసుకొస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా తానెందుకు లేఖ రాస్తా? అని ప్రశ్నించారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని.. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్‌కు తాము సిద్ధమని స్పష్టం చేశారు. మేడిగడ్డ పునర్నిర్మాణం పనులకు డెడ్‌లైన్ పెట్టామని పేర్కొన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ నేతల చేతకాని తనాన్ని తమపై రుద్దవద్దని హితవు పలికారు. వారు ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సాగునీటి జలాలపై డీపీఆర్‌ను కేంద్రానికి పంపడానికి ఏడేళ్ల సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. డీపీఆర్ పంపే సమయానికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు..అన్యాయం చేస్తున్నామంటూ బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. హరీశ్‌రావును చూసి గోబెల్స్ కూడా సిగ్గుతో తలదించుకుంటారని ఎద్దేవా చేశారు. పాలమూరు – రంగారెడ్డిలో 90 టీఎంసీలకు ప్రతిపాదించారని గుర్తుచేశారు. 45 టీఎంసీల మైనర్ ఇరిగేషన్, 45 టీఎంసీల గోదావరి డైవర్షన్ అని వాడారని చెప్పుకొచ్చారు. వాళ్లు ఇచ్చిన జీవోనే తాము ప్రస్తావిస్తూ లేఖ రాశామని స్పష్టం చేశారు. తొలుత మైనర్ ఇరిగేషన్‌ను క్లియర్ చేయమని అడిగామని అన్నారు. పేజ్ –1లో ఇన్షియల్‌గా చేయమని అడిగామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టులో 7 టీఎంసీలకు ఒప్పుకుని వచ్చారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తిచేయలేకపోయారని ప్రశ్నించారు. తాము మాత్రం పూర్తిచేసి పాలమూరు ప్రాంతానికి నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉండాలి: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్: గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే బావుంటుందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మన ఊరు–మన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

**సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి: కూనంనేని..** సింగరేణి కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. "సింగరేణి పెద్ద పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్. పూర్తిగా ప్రైవేటుపరం అయ్యే అవకాశం కనిపిస్తోంది. సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయ జోక్యం పెరుగుతోందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు అదే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించాయి. ప్రస్తుతం కూడా అవే కొనసాగుతున్నాయి. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరముంది" అని కూనంనేని సాంబశివరావు అన్నారు.




గార్ల: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలుగు యువతులు మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం 8 మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో టూర్‌కి బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో పడింది. దీంతో వారిద్దరూ మృతిచెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## తిరుమలకు ఫ్యామిలీతో సీఎం రేవంత్ రెడ్డి..



తిరుపతి, డిసెంబర్ 29: వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని తిరుమలలో కొలువు తీరిన శ్రీవెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం దర్శించుకోనున్నారు. అందుకోసం సోమవారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబంతో కలిసి తిరుమలకు చేరుకొన్నారు. మంగళవారం తెల్లవారుజామున వైకుంఠ ద్వారం ద్వారా దేవాలయంలోకి ప్రవేశించి.. ఆ దేవదేవుడిని సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులు దర్శించుకోనున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. మరోవైపు వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజా ప్రతినిధులు, న్యాయమూర్తులతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తిరుమల తరలి రానున్నారు. ఇక రాష్ట్రంలోని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, శానసమండలి చైర్మన్ మోషెన్ రాజు, మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డితోపాటు పలువురు మంత్రులు.. దాదాపు 80 మందికిపైగా ప్రముఖులు తిరుమల వస్తున్నట్లు ఇప్పటికే టీటీడీ అధికారులకు సమాచారం అందింది. ఇంకోవైపు సోమవారం అర్ధరాత్రి తిరుమలలోని శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. జనవరి 8వ తేదీ వరకు శ్రీవారి భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనాన్ని కల్పించేందుకు టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. దాంతో 10 రోజుల పాటు శ్రీవారి ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక దర్శనాలను సైతం టీటీడీ రద్దు చేసింది. మొదటి మూడు రోజులు కేవలం టోకెన్స్ ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వారా దర్శనాని టీటీడీ కల్పించనుంది. ఇక జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు టికెట్, టోకెన్స్ కలిగిన భక్తులతో పాటు సర్వ దర్శనం క్యూ లైన్ ద్వారా భక్తులను ఈ దర్శనానికి అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ రోజు అర్ధరాత్రి 12.05 నిమిషాలకు శ్రీవారి ఆలయాన్ని అర్చకులు తెరవనున్నారు. పూజది కైంకర్యాలు ముగిసిన అనంతరం వేకువజామున 1.30 గంటల నుంచి ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనానికి టీటీడీ అనుమతించనుంది. మంగళవారం ఉదయం 5 గంటలకు సర్వదర్శనం ద్వారా సామాన్య భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనాన్ని టీటీడీ కల్పించనుంది. ఉదయం 9 గంటలకు స్వర్ణ రథంపై ఆలయ తిరు విధుల్లో ఊరేగుతూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాహన మండపంలో భక్తులకు ఉత్సవ మూర్తులు దర్శనం ఇవ్వనున్నారు. అందుకోసం ఇప్పటికే టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

## సీఎం రేవంత్ తిట్లు నాకు దీవెనలు: కేటీఆర్



హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే దూషిస్తున్నారు. ఆయన తిట్లు నాకు దీవెనలు. నన్ను తిడితే పడతాను కానీ.. కేసీఆర్‌ను అంటే ఊరుకునేది లేదు. ఆయనకు మంచి పేరు వస్తుందనే పాలమూరు–రంగారెడ్డి పనులు చేయట్లేదు. కాల్వల కోసం పిలిచిన టెండర్లను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసింది. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారు" అని కేటీఆర్ అన్నారు.

**నేతల బలం లేకున్నా సర్పంచ్‌లను గెలిపించుకున్నాం...** పార్టీని వదిలి వెళ్లిన నేతలను మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదన్నది తన అభిప్రాయమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "బీఆర్ఎస్‌ను కాదని భాజపాలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారో చూశాం కదా! నేతల బలం లేకున్నా మా కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారు. 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని న్యాయస్థానంలో పోరాడుతున్నాం.. వారితో మాకేం సంబంధం?వారి విషయంలో సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి, సర్పంచ్ ఎన్నికల నాటికి పరిస్థితులు చాలా మారాయి. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ పరిస్థితి బాగోలేదు.

కడియం నా గురించి ఏం మాట్లాడతారు? వాస్తవాలు దాచలేరు కదా! పోచారం ఈ వయసులో ఏం సాధించారు? గౌరవం నిలబెట్టుకోవాలి కదా" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**కేసీఆర్ పట్ల గౌరవం ఉంటే చాలు..** మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పలకరించడంపై కేటీఆర్ స్పందించారు. "తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి గౌరవం ఉంది. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుంది. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదే" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## ఉద్యోగుల గురించి హరీశ్‌రావు వ్యాఖ్యలు విడ్డూరం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలపై మాజీ మంత్రి హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. మొత్తం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని కోరారు. పింఛన్ బకాయిలు రావట్లేదని 39 మంది విశ్రాంత ఉద్యోగులు మరణించారని హరీశ్‌రావు అన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉద్యోగుల గురించి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సభ్యుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు.. అసెంబ్లీలో దుమారం

హైదరాబాద్, డిసెంబర్ 29: తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శతో అసెంబ్లీలో అలజడి రేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు.

అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీనికి కొన్ని నెలల ముందు లక్షల కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లోని పలు పిల్లర్లు కుంగాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.




## ఫ్యూచర్ మార్కెట్‌లో వెండి ధర ఢమాల్.. గంటలో 21వేలు పతనం

ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన వెండి దూకుడుకు బ్రేక్ పడింది. ఫ్యూచర్ మార్కెట్‌లో ఒక్కసారిగా ఢమాల్‌మని కిందకు పడింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి కాంట్రాక్ట్ వెండి కిలో ధర గంటలోనే రూ.21 వేలు మేర తగ్గింది. సోమవారం ఇంట్రాడేలో రూ.2,54,174 వద్ద గరిష్ఠాన్ని తాకిన కిలో వెండి ధర రూ.2,33,120 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అటు స్పాట్ మార్కెట్‌లో కూడా వెండి ధర దిగి వచ్చింది. రూ.2.50 లక్షలు పైబడి పలికిన కేజీ వెండి ధర హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయానికి రూ.2.39 లక్షల స్థాయికి దిగి వచ్చింది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా ఇటీవల బంగారం, వెండికి ఎక్కడా లేని డిమాండ్ ఏర్పడింది. మరీ ముఖ్యంగా వెండి ఎన్నడూలేని రీతిలో దూసుకెళ్లింది. అంతర్జాతీయ మార్కెట్‌లో 50 డాలర్ల దిగువనే ట్రేడవుతూ వచ్చిన వెండి ఒక్కసారిగా ఇటీవల భారీగా దూసుకెళ్లింది. దీంతో సోమవారం ఓ దశలో 80 డాలర్లు పైకెగిసింది. గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా భారీగా దిగి వచ్చింది.

**కారణాలు ఇవీ..** రష్యా– ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో కీలక అడుగు పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ భేటీ అయ్యారు. శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు పుతిన్, జెలెన్స్కీ ఇద్దరూ పూర్తి సుముఖంగా ఉన్నట్లు ట్రంప్ ప్రకటించడం యుద్ధానికి తెరపడుతుందన్న అంచనాల వేళ వెండి ధర పతనం అయ్యింది. వెండి ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు 181శాతం మేర పెరిగింది. గరిష్ఠాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ వెండి ధర పతనానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వెండి 200డే మూవింగ్ యావరేజీ కంటే 89 శాతం పైనే ట్రేడవుతోంది. వెండిలో అమ్మకాల ఒత్తిడికి చికాగో మర్చంట్ ఎక్స్ఛేంజీ కూడా మరో కారణం. ఈ గ్రూప్‌లో ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌లను నిర్వహిస్తోంది. 2026 మార్చి ఫ్యూచర్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన మార్జిన్‌ను 20వేల డాలర్ల నుంచి 25వేల డాలర్లకు పెంచింది. దీంతో అధిక రిస్క్ తీసుకునే వారు వెనకడుగు వేయడంతో వెండిలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరగడానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు.

thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 293 కరీంనగర్ మంగళవారం, 30 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఎస్ఐఆర్ సంస్కరణ కాదు, బలవంతపు అణచివేత

న్యూఢిల్లీ: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తీవ్రమైన పని ఒత్తిళ్ల కారణంగా పలువురు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలపై ఘాటుగా స్పందించారు. ఎస్ఐఆర్‌ను బలవంతపు అణిచివేతగా అభివర్ణించారు. ఈ ప్రక్రియ దేశ ప్రజలను వేధించేందుకు చేపట్టిన 'ఉద్దేశపూర్వక కుట్ర' అని ఆరోపించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ దేశంలో అలజడి రేపిందని, ప్రజాస్వామ్యానికి తిలోదకాలు వదిలి అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాసేందుకు ఉద్దేశించిన ప్రక్రియ అని రాహుల్ పేర్కొన్నారు. నిజమైన ఓటర్లను తప్పించడం ద్వారా ఎలక్టోరల్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా తారుమారు చేయడం, ఓట్ల చోరీని అప్రతిహతంగా కొనసాగించం ఎస్ఐఆర్ లక్ష్యమని ఆరోపించారు. 'ఎస్ఐఆర్ పేరుతో పౌరులను వేధించేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర జరిగింది. విపరీతమైన ఒత్తిడి బీఎల్ఓల మృతికి కారణమవుతోంది' అని తప్పుపట్టారు.




# కేసీఆర్ గారూ.. బాగున్నారా?

## తెలంగాణ అసెంబ్లీ.. కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించిన రేవంత్

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి , ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేసీఆర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం, జీహెచ్ఎంసీ పరిధి పెరిగినందున వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ తదితర అంశాలకు చట్టబద్ధత కల్పించనున్నారు.



# ముహూర్తం ఫిక్స్..

## కొండగట్టుకు పవన్ కల్యాణ్.. ముహూర్తం ఫిక్స్..

జగిత్యాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఏపీ రాజకీయాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ ఇదే ఆలయం నుంచి ప్రకటన చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్న ఆలయానికి వస్తుండటంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొండగట్టుకు వచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవడం పవన్ కల్యాణ్ విశేషంగా భావిస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పవన్ కల్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతంలో భక్తులు, ఆయన అభిమానుల భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



## భూముల పరిరక్షణకు చర్యలు: మంత్రి పొంగులేటి

ప్రభుత్వ భూములు, ప్రజల ఆస్తుల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, శ్మశానవాటికలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోరబండ, ఎర్రగడ్డ, షేక్‌పేట్ ప్రాంతాల్లో దశాబ్దాలుగా మైనార్టీలు శ్మశానవాటికలు లేక ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యను వీలైనంత త్వరితగతిన రక్షణశాఖ, రెవెన్యూ, వక్ఫ్‌బోర్డ్ సమన్వయంతో అధిగమించాలని అధికారులకు సూచించారు.

**అవసరమైతే ఖాళీ చేయించండి..** అవసరమైన చోట రెవెన్యూ భూమిని రక్షణ శాఖకు బదలాయించి వారి నుంచి ప్రత్యామ్నాయంగా భూమి తీసుకోవాలని, రెవెన్యూ భూమిని వక్ఫ్ బోర్డుకు అప్పగించాలని సూచించారు. పేదల సంక్షేమం, ప్రజా అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం వినియోగించవలసిన ప్రభుత్వ భూములను కొద్ది మంది స్వార్థ ప్రయోజనాల కోసం కబ్జా పెట్టే ప్రయత్నాలు చేస్తుంటారని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

# అసెంబ్లీకి కేసీఆర్ : ఇలా వచ్చారు.. అలా వెళ్లిపోయారు..

## అసెంబ్లీలో జగన్ ను ఫాలో అయిన కేసీఆర్



నిన్నటి నుంచి ఒకటే హైప్.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేస్తున్నారహో అంటూ మీడియా అంతా ఊదరగొట్టింది. సోషల్ మీడియా అయితే మీమ్స్ , ట్రోల్స్ తో దద్దరిల్లిపోయింది. కొందరు కేసీఆర్ కు అనుకూలంగా.. మరికొందరు రేవంత్ వల్లే కేసీఆర్ సభకు వస్తున్నారంటూ వ్యతిరేకంగా వీడియోలు రూపొందించి హోరెత్తించారు. కేసీఆర్ సభకు వచ్చి ఏం చేస్తారు? ఎలా ముందుకెళుతారు అన్న ఉత్కంఠ అందరిలోనూ ఊపందుకుంది. అయితే అంత ఉత్తదే అయిపోయింది. కేసీఆర్ సభకు ఇలావచ్చారు. అసెంబ్లీ రిజిస్ట్రర్లో సంతకం చేశారు.. మధ్యలో రేవంత్ వస్తే షేక్ హ్యాండ్ ఇచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ఇదీ కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నారన్న హంగామాకు ఈరోజు తెరపడింది.అందరినీ నిట్టూర్చేలా చేసింది. తెలంగాణ రాజకీయాల్లో మనసులు మారిపోయారు. ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్ అసలు అసెంబ్లీకే రావడం లేదు. ప్రభుత్వంపై పోరాడడం లేదు. ఇటీవలే రెండేళ్లు ఎదురుచూశానని.. ఇక కాంగ్రెస్ సర్కార్ వెంట పడుతానంటూ ప్రెస్ మీట్ పెట్టి చీల్చిచెండాడాడు. ఈ క్రమంలోనే మరో షాకింగ్ నిర్ణయం తీసుకొని కేసీఆర్ ఆశ్చర్యపరిచాడు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి.. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు.. ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి చేరుకున్నారు. ఆయనకు పార్టీ ఎమ్మెల్యేలు స్వాగతం కూడా పలికారు. అనంతరం అసెంబ్లీలోకి కేసీఆర్ ను ఎమ్మెల్యేలు తోడుకొని వెళ్లారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకునపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించనుందని తెలుస్తోంది. అందుకోసం అస్త్రశస్త్రాలను ఆ పార్టీ సిద్ధంచేసుకుంది. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలతోపాటు నీటిపారుదల అంశాలు.. ప్రాజెక్టుల నిర్మాణంపై వాడివేడిగా చర్చ జరిగే అవకాశం ఉందని సమాచారం. ఈరోజు జరిగే బీఏసీ సమావేశంలో ఈ శీతాకాల సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే అంశంపై ఒక నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు విపక్షపార్టీల విమర్శలను సమర్ధవంతంగా తిప్పికొట్టేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం ఈరోజు సమావేశాలకు హాజరుకానున్నారు. 2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో పదేళ్ల పాటు తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీఆర్ఎస్అధినేత కేసీఆర్ ప్రతిపక్షనాయకుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఈ రెండేళ్లలో ఆయన కేవలం రెండు సార్లు మాత్రమే తెలంగాణ అసెంబ్లీలో అడుగుపెట్టారు. తెలంగాణలో ఓడిపోయాక కేసీఆర్ తన ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారు. ఇటీవల ప్రెస్ మీట్ పెట్టి రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దీనిపై రేవంత్ కూడా గట్టిగా స్పందించారు. అసెంబ్లీకి వస్తే అన్ని విషయాలు చర్చిద్దామంటూ కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి సూచించిన విషయం తెలిసిందే..ఈక్రమంలోనే అసెంబ్లీకి వచ్చారు. అయితే కేసీఆర్ ఇలా అసెంబ్లీకి వచ్చి అలా వెళ్లిపోయారు. అసెంబ్లీ అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకం చేసి బయటకు వెళ్లిపోయారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ మరణించిన ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండ లక్ష్మన్ రెడ్డికి అసెంబ్లీ సంతాపం తెలిపింది. స్పీకర్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన కాసేపటికే సభను వీడారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి.. సభకు వచ్చిన కేసీఆర్ కు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరాతీశారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ ను కలిశారు. అయితే, అటెండెన్స్ కోసం మాత్రమే అసెంబ్లీకి వచ్చే ట్రెండ్ ను ఏపీ మాజీ సీఎం జగన్ స్టార్ట్ చేశారని, అదే రీతిలో జగన్ ను కేసీఆర్ ఫాలో అయ్యారని సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



## శాసనమండలి భవన పునరుద్ధరణ పనులు పరిశీలించిన సీఎం రేవంత్

శాసన మండలి భవన పునరుద్ధరణ, మరమ్మతు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి మండలి సమావేశ మందిరంలో కొనసాగుతున్న పనులను పరిశీలించిన సీఎం, పనుల నాణ్యత, వేగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. సభ్యులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆధునిక సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, సోమవారం మూడో శాసనసభ ఏడవ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శాసనసభ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు, విప్‌లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి, శాసనసభల కార్యదర్శులు ఘనంగా స్వాగతం పలికారు. సభ ప్రారంభం అనంతరం ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడి స్థానానికి వెళ్లి కల్వకుంట్ల చంద్రశేఖర రావుని మర్యాదపూర్వకంగా పలకరించారు.

**సభ జనవరి 2కి వాయిదా..** సభ తొలి రోజున దివంగత సభ్యులు సూర్యాపేట మాజీ శాసనసభ్యుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, చేవెళ్ల మాజీ శాసనసభ్యుడు కొండా లక్ష్మారెడ్డిలకు శాసనసభ సంతాపం తెలియజేసింది. అనంతరం సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జీరో అవర్‌ను నిర్వహించారు. కార్యక్రమాలు పూర్తికావడంతో సభను జనవరి 2వ తేదీకి వాయిదా వేశారు.



## సభలో ప్రాజెక్టులపై పీపీటీకి అవకాశం ఇవ్వండి..

## స్పీకర్‌కు బీఆర్ఎస్ఎల్పీ వినతి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, నదీ జలాలకు సంబంధించిన అంశాలపై అసెంబ్లీలో నిర్వహించనున్న పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు తమకు కూడా అవకాశం కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ శాసనసభాపక్షం (బీఆర్ఎస్ఎల్పీ) స్పీకర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ మేరకు సోమవారం స్పీకర్ ఛాంబర్‌లో బీఆర్ఎస్ఎల్పీ నేతలు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి తదితర నేతలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ వినతిని స్పీకర్ పరిశీలనకు తీసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా సభలో బీఆర్ఎస్ శాసనసభ పక్షానికి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ (పీపీటీ)కి అవకాశం కల్పించాలని నేతలు కోరారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సహా నదీ జలాలకు సంబంధించిన అంశాలపై చర్చ సందర్భంగా ప్రభుత్వపరంగా ప్రెసెంటేషన్ ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిసిందన్నారు. ప్రభుత్వానికి పీపీటీ అవకాశం ఇచ్చినప్పుడు బీఆర్ఎస్‌కు కూడా ప్రెసెంటేషన్‌కు అనుమతిస్తేనే చర్చకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు నీళ్లకు సంబంధించిన నిజాలు తెలియాలంటే ఆధారాలను డాక్యుమెంట్లు, వీడియోల రూపంలో లోతుగా వివరించాల్సి ఉంటుందని విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులతో సీఎం భేటీ నిర్వహించారు. సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సమాయత్తం కావాలన్నారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని సూచించారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ముఖ్యం అన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతీ అంశానికి సమాధానం ఇవ్వాలన్నారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందన్నారు. మరోవైపు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం ప్రారంభమైంది. దీనికి మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, భాజపా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ హాజరయ్యారు. ఈ సమావేశంలో అసెంబ్లీ పని దినాలు, అజెండా ఖరారు చేయనున్నారు.

**అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలి:** కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. "ప్రతి సభ్యుడిని మేం గౌరవిస్తాం. కేసీఆర్‌ను ఇవాళే కాదు.. ఆస్పత్రిలో కూడా కలిశా. అసెంబ్లీ నుంచి వెంటనే ఎందుకు వెళ్లారో ఆయన్నే అడగాలి" అని రేవంత్ అన్నారు. ఇద్దరూ ఏం మాట్లాడుకున్నారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మేమిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతాం? అని సీఎం వ్యాఖ్యానించారు. శాసనసభ ప్రారంభమైన తర్వాత కేసీఆర్ వద్దకు రేవంత్ వెళ్లారు. కరచాలనం చేస్తూ బాగున్నారా అని సీఎం పలకరించారు.

చురకలు

## సంపాదకీయం

# ఇయర్ 2025.... మోడీ మార్క్ రివ్యూ.. !

మరో మూడు రోజులలో 2025 సంవత్సరం కాల గర్భంలో కలసిపోతుంది. ఈ నేపథ్యంలో పన్నెండు నెలల ఈ ఇయర్ ని ఒకసారి రివ్యూ చేసుకోవడం అంతా చేస్తున్న పని ఈ దేశాన్ని ఏలే ప్రధాని నరేంద్ర మోడీకి 2025 ని ఎలా రివ్యూ చేస్తారు అన్నది ఉత్కంఠ ఉంటుంది. ఆయన ప్రతీ నెలా చివరి ఆదివారం మన్ కీ బాత్ పేరుతో ఆకాశవాణి దూరదర్శన్ ద్వారా ప్రజలతో మాట్లాడుతారు. ఈ కార్యక్రమంలో భాగంగా మోడీ తనదైన శైలిలో 2025 ని నిర్వహించారు. ఈ ఏడాదిలో గుర్తుండిపోయే అంశాలను ఆయన మరో సారి అందరికి మననం చేస్తూ హైలెట్స్ ఏంటో చాటి చెప్పారు.


**ఆపరేషన్ సింధూర్ :** ఈ పేరు వింటే పాక్ గుండెల్లో వణుకు పుడుతుంది. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాక్ గుండెళ్ళో గునపాలు దించేసి భారత్ ప్రపంచానికి కూడా తాను చెప్పాలనుకున్నది చెప్పింది. ఆ విధంగా చూస్తే 2025 లో ఇది అతి పెద్ద హైలెట్. జాతీయ భద్రత విషయంలో ఎక్కడా రాజీపడమని స్పష్టం చేస్తూ కేంద్రం తీసుకున్న దృఢమైన నిర్ణయంగా దీనిని అంతా చూస్తున్నారు. అంతే కాదు ఈ ఏడాది క్రీడల నుంచి, సైన్స్ ప్రయోగశాలల నుండి మొదలెడితే ప్రపంచంలోని అతిపెద్ద వేదికల వరకు తన సత్తా చాటింది అని మోడీ చెప్పుకొచ్చారు. దాదాపుగా వీలైన ప్రతీ సందర్భంలో ఈ సంవత్సరం భారతదేశం ప్రతిచోటా తనదైన బలమైన ముద్ర వేసిందని నరేంద్ర మోడీ చెప్పడం విశేషం.

**గర్వపడేలా సాగింది :** ఇక 2025 సంవత్సరం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసే అనేక క్షణాలను అందించిందని మోడీ అభివర్ణించారు. ఆపరేషన్ సింధూర్ ప్రతి భారతీయుడికి గర్వానికి ప్రతీకగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ నాటి భారతదేశం తన భద్రత విషయంలో రాజీ పడదని ప్రపంచం స్పష్టంగా చూసిందని ఆయన అన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రజలు చూపిన అదే స్ఫూర్తిని ఉత్సాహాన్ని కొనసగించాలని ఆయన కోరడం గమనార్హం. క్రీడల పరంగా కూడా 2025 ఒక చిరస్మరణీయ సంవత్సరమని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. భారత పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. మహిళల క్రికెట్ జట్టు మొదటిసారిగా ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. మహిళల బ్లైండ్ టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం ద్వారా భారతదేశ బిడ్డలు గొప్ప చరిత్ర సృష్టించారని మోదీ కొనియాడారు. అలాగే ఆసియా కప్ టీ20లో కూడా త్రివర్ణ పతాకం గర్వంగా రెపరెపలాడిందని ఆయన అన్నారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అనేక పతకాలు సాధించిన పారా-అథ్లెట్లను కూడా ఇదే సందర్భంలో మోడీ ప్రశంసించారు.

**కుంభమేళా ఆశ్చర్యం :** మహా కుంభమేళా అన్నది ఒక్క భారత్ మాత్రమే నిర్వహించగలదు అన్నది ప్రపంచానికి చూపించిన ఘనత భారత్ ది నరేంద్ర మోడీ చెప్పారు. ఈ సంవత్సరం ప్రారంభంలో నిర్వహించిన ప్రయాగ్‌రాజ్ మహాకుంభం యావత్ ప్రపంచాన్ని అబ్బురపరచింది అని ఆయన చెప్పారు. అలాగే ఇదే ఏడాది చివరిలో అయోధ్యలోని రామ మందిరంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి భారతీయుడిని గర్వంతో నింపిందని ఆయన అన్నారు. కొత్త ఆలోచనలు, కొత్త పద్ధతులతో తరువాత తరం భారతీయ సంస్కృతి మూలాలను ముందుకు తీసుకుని వెళ్తున్న విధానం ఎంతో ఆనందకరమని మోడీ అన్నారు.

# సజీవ స్వరూపాలు... వడ్డాది పాపయ్య చిత్రాలు - డిసెంబర్ 30...వడ్డాది పాపయ్య వర్ధంతి





తెలుగు చిత్రకళా ప్రపంచంలో సాటిలేని ప్రతిభావంతుడు వడ్డాది పాపయ్య. తన అపురూప చిత్రాలతో తెలుగు ప్రజల మనసుల్లో నిలిచిపోయిన సహజ కళాకారుడు అనేక మంది స్ఫూర్తి ప్రదాత. ఆయన చిత్రాలు తెలుగు సాహిత్యం, పౌరాణిక కథానికలు, గ్రామీణ జీవనశైలిని చక్కగా ప్రతిబింబించేలా ఉంటాయి. వడ్డాది పాపయ్య 1921 సెప్టెంబర్ 10న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. తండ్రి రామమూర్తి డ్రాయింగ్ టీచర్ కావడంతో చిన్ననాటి నుంచే చిత్రకళ పట్ల ఆయనకు మక్కువ కలిగింది. పాపయ్య పెరిగిన వాతావరణంలో కుంచెలు, రంగులతో కలిసిపోయే కళాజీవితం ఉన్నది. ఇది ఆయనలోని సృజనాత్మకతను పెంచింది. పాపయ్య చిన్నప్పటినుంచి చిత్రకళ పట్ల ఆసక్తి చూపిస్తూ, వివిధ రూపాల్లో తన శైలిని అభివృద్ధి చేసుకున్నారు. చిన్ననాటి నుంచే గ్రామీణ జీవితం, ప్రకృతి దృశ్యాలు ఆయన చిత్రాలకు ప్రేరణగా నిలిచాయి. రాజా రవివర్మ, దామెర్ల రామారావు ల చిత్రకళా తపస్సును ఆదర్శంగా ఎంచుకున్న పాపయ్య, అడవి బాపిరాజు నుంచి గొప్ప భావుకతను అంది పుచ్చుకున్నారు. వడ్డాది పాపయ్య చిత్రకళలో ఒక కొత్త శైలికి నాంది పలికారు. ఆయన చిత్రం ప్రతి చిన్న విషయాన్ని స్వచ్ఛమైన, సహజమైన రూపంలో తీసుకు వస్తుంది. ఆయా చిత్రాలలో ప్రతీ రేఖ, ప్రతి రంగు చిత్రాన్ని మరింత ముద్రించే విధంగా ఉంటుంది. ఆయన చరిత్ర, పురాణ కథలు, సామాజిక అంశాలను అద్భుతంగా చిత్రించడంలో దిట్ట. వడ్డాది పాపయ్య రచించిన చిత్రాలలో రామాయణం, పంచతంత్రం, మహాభారతం వంటి పురాణ ఇతిహాసాలకు సంబంధించిన కథానికలు ముఖ్యంగా నిలిచాయి. ఎగురుతున్న హనుమంతుడు, గోపికాకృష్ణుల రాసలీల, పార్వతి, శకుంతల, లక్ష్మి, ధనలక్ష్మి, శివపార్వతులు, గంగావతరణం మొదలైన పౌరాణిక ఊహాత్మక బొమ్మలను గీచారు. ఆయన చిత్రాలు తెలుగు సాహిత్యానికి ఒక సజీవ రూపాన్ని సంతరింప చేశాయి. ప్రత్యేకించి పంచతంత్రం చిత్రాలు, పిల్లల హృదయాలను ఆకర్షించే విధంగా ఉంటాయి. పాపయ్య పురాణ గాథలను చిత్రించిన విధానం ద్వారా కథలు కళాత్మకంగా జీవింప జేయబడ్డాయి. వడ్డాది పాపయ్య చిత్రాలు చూడగానే ఆకర్షిస్తాయి. ఆయన చిత్రాలలోని రంగుల వాడకం, కాంతి-చాయా ప్రభావాలు చూపించే సామర్థ్యం అత్యద్భుతంగా ఉంటాయి. ప్రత్యేకంగా గ్రామీణ దృశ్యాల చిత్రణలో ఆయన చూపిన శైలి చక్కని నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి వ్యక్తి ముఖాల్లో భావాలను ప్రతిబింబించడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం, ప్రతి దృశ్యాన్ని సహజంగా చిత్రించడంలో ప్రతిఫలిస్తుంది. చిత్రకారుడిగా మాత్రమే కాకుండా, పాపయ్య పత్రికా రంగంలో కూడా తన ప్రతిభను చాటారు. తెలుగు పత్రికలు, మాసపత్రికలు ఆయన చిత్రాలతో అలంకరించ బడ్డాయి. ఈ పత్రికా బొమ్మలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన వాటిని తీర్చిదిద్దారు. పత్రికల్లోని ఆయన బొమ్మలు, ప్రత్యేకించి పౌరాణిక పాత్రలు, సాంప్రదాయ వస్త్రధారణ, ప్రాచీన జీవనశైలికి ఆయన విన్నూత్న రూపాన్ని అందించారు. రేరాణి, అభిసారిక, భారతి పత్రికలలో ప్రచురితమైన బొమ్మలలో ఒక సంచలన చిత్రకారుడుగా పత్రికా ప్రపంచానికి చేరువయ్యారు. తత్ఫలితంగా తెలుగు సినీ ప్రముఖుడు చక్రపాణి తమ సంస్థ ప్రచురణలైన చందమామ, యువ పత్రికలలో బొమ్మలు వేసే ఉద్యోగం ఇచ్చారు. ఒక్క "చందమామ" పత్రికలోనే దాదాపు మూడు దశాబ్దాల పర్యంతం తన సహజ శైలిలో బొమ్మలు చిత్రిస్తూ, ఒకే పత్రికలో కొనసాగటం తెలుగు పత్రికా రంగంలో ఒక పెద్ద రికార్డు. వడ్డాది పాపయ్య సాధారణంగా సరళమైన వ్యక్తిగా, స్నేహపూర్వక స్వభావంతో కళాభిమానులతో మెలిగేవారు. సరళమైన జీవిత శైలిని అనుసరించిన పాపయ్య, కళాభిమానులతో గడపడంలో ప్రత్యేక ఆనందం పొందేవారు. వడ్డాది పాపయ్యకు తెలుగు చిత్రకళాభిమానుల నుండి ఎల్లప్పుడూ ప్రశంసలు అందాయి. అతని చిత్రాలలో భావాలను స్పష్టంగా చూపించడం, ప్రతి చిన్న విషయాన్ని చిత్రంలో ప్రతిబింబించడంలో ఆయన ప్రతిభ అనన్యమైనది. అయితే కొందరు విమర్శకులు ఆయన చిత్రాల్లో మరింత లోతు ఉండాలని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, పాపయ్య దశాబ్దాలుగా చిత్రకళా రంగానికి అందించిన సాయానికి ప్రజలు ఎల్లప్పుడూ ఆయనను ప్రశంసిస్తూనే ఉంటారు. వడ్డాది పాపయ్య సృజనాత్మకతను ప్రతిబింబించే అనేక చిత్రాలు ఆయన కుంచె నుంచి వెలువడినవి. ఈ చిత్రాలు అందరికీ కళా సౌందర్యాన్ని అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. వడ్డాది పాపయ్య తెలుగు చిత్రకళలో ఒక అద్భుతమైన స్ఫూర్తి. ఆయన చిత్రాలు ఎల్లప్పుడూ కళాభిమానులకు స్ఫూర్తిగా నిలుస్తూ, తెలుగు చిత్రకళా రంగానికి సజీవ స్వరూపంగా నిలిచాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అంతరిక్ష రంగంలో భారత్ ముందంజ - డిసెంబర్ 30... విక్రం సారాభాయ్ వర్ధంతి సందర్భంగా



"విక్రం సారాభాయ్ ని భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడిగా" అభివర్ణిస్తారు. 1957లో రష్యా మొట్టమొదటి శాటిలైట్ అయిన స్పుత్నిక్‌ను ప్రయోగించి నపుడు శాటిలైట్ యొక్క ఆవశ్యకతను అప్పటి ప్రధాన మంత్రి అయిన నెహ్రూకు వివరించి, 1962లో, భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడయిన హోమీ భాభా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ ను ఏర్పరచాడు విక్రం సారాభాయ్. కేరళలో త్రివేంద్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరి తలాన్ని అధ్యయం చేయడం మొదలు పెట్టారు. అనతికాలంలోనే భారతదేశం స్వదేశీయంగా పూర్తి స్థాయి రాకెట్లను తయారు చేసి, ఉపరితల అధ్యయంలో పురోగతి సాధించింది. ఉపగ్రహాలను తయారు చేయడమే కాకుండా వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్, ఉపగ్రహ వాహకనౌక రూపకల్పన మొదలు పెట్టాడు. అలా తయారైనదే సెటిలైట్ లాంచ్ వెహికిల్ . ఇస్రో తయారు చేసిన తొలి పూర్తిస్థాయి ఉప గ్రహానికి భారత గణిత, ఖగోళ శాస్త్రవేత్త అయిన "ఆర్యభట్ట" పేరు పెటారు. భారత దేశపు మొట్ట మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను 1975 ఏప్రిల్ 19న అప్పటి సోవియట్ యూనియన్ నుండి విజయ వంతంగా ప్రయోగించారు. ఇన్‌శాట్ - INSAT లేదా భారత జాతీయ ఉపగ్రహ వ్యవస్థ అనేది సమాచారం, వాతావరణం, ప్రసారాలు మొదలయిన బహుళ ప్రయోజనాల కోసం ఇస్రో తయారు చేసిన ఉపగ్రహాల శ్రేణి. 1983లో మొదలయిన ఇన్‌శాట్, ఆసియా, పసిఫిక్ దేశాల్లో అతిపెద్ద ఉపగ్రహాల వ్యవస్థ. ప్రస్తుతం 199 ట్రాన్స్‌పాండర్లతో భారతదేశం లోని దాదాపు అన్ని టెలివిజన్, రేడియోలకు మాధ్యమంగా ఉన్న ఈ ఉపగ్రహాలను కర్నాటకలోని హస్సన్, భోపాల్ ల నుండి అనుక్షణం పర్యవేక్షిస్తుంటారు. తద్వారా అంతరిక్ష పరిశోధనల్లో మన దేశం ఎంతో ముందంజలో ఉందని కొనియాడారు. అంతరిక్ష ప్రయోగాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడతారని ప్రశ్నించే వారికి... దీపావళి పండుగ కోసం పటాసులు కాల్చడానికి దాదాపు 600 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తారనేది ఒక అంచనా ఉందని, అయితే మంగళయాన్ ప్రయోగం కోసం ఇస్రో కేవలం వెయ్యి కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి విజయం సాధించడం గొప్ప పరిణామమని ఆయన ధీటైన సమాధానం చెప్పారు. ప్రపంచ దేశాలు చేయలేని సాహసం ఇస్రో చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంగళయాన్ సక్సెస్‌తో భారత్ ప్రపంచ దేశాల సరసన చేరిందని వెల్లడించారు. అంతరిక్ష రంగంలో అధునాతన సామర్థ్యాలు కలిగి ఉన్న కొన్ని దేశాలలో భారత్ ఒకటి. భారత్ లో ప్రతిష్ఠాత్మక ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి...1.తుంబా: కేరళలో తిరువనంత పురం సమీపాన భూ అయస్కాంత రేఖకు దగ్గరలో ఉన్న తుంబాలో 1962లో మొదటి రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి శాస్త్రవేత్తలలో అబ్దుల్ కలాం ఒకరు. మొదట కేవలం రాకెట్ల ప్రయోగ కేంద్రముగా ఉన్న తుంబా నెమ్మదిగా రాకెట్లకు అవసర మయిన ప్రొపెల్లర్లు, ఇంజన్లు తయారు చేసి అమర్చ గలిగి పూర్తిస్థాయి రాకెట్ నిర్మాణ కేంద్రంగా తయారయింది. 2.శ్రీహరి కోట: భారత దేశంలో ఉపగ్రహాల ప్రయోగానికి అత్యంత అనువయిన ప్రదేశ మయిన శ్రీహరికోట నెల్లూరు జిల్లాలో సూళ్ళూరుపేట దగ్గర ఉంది. ఈ అంతరిక్ష కేంద్రం పేరు "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం". దీనినే "షార్" అని కూడా పిలుస్తారు. ఇది భారతదేశం లోని ఉపగ్రహ ప్రయోగ కేంద్రం. ఇక్కడనుండి ఎన్నో పి.ఎస్ ఎల్. విబీ జి.ఎస్.ఎల్.వి ఉప గ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. ప్రస్తుతం ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్‌లు ఉన్నాయి. ఈ రెండిటి వల్ల ప్రతి ఏడాది 6 శాటిలైట్లను ప్రయోగించే వీలు ఉంది. 3.బలేశ్వర్ ఒరిస్సాలో ఉంది. శ్రీహరికోటలో ఉన్నట్లు ఇక్కడ శాటిలైట్ల ప్రయోగానికి సౌకర్యాలు లేకున్నా, దీనిని ప్రధానంగా క్షిపణులను ప్రయోగించుటకు ఉపయోగిస్తారు. 2005లో రెండవ లాంచి ప్యాడు ఆపరేషను, 2008 లో చంద్రయాన్, 2014లో మంగళ్ యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలి పరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం - అప్పటికి ఇది ఇస్రో రికార్డు, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగం - ఇది ప్రపంచ రికార్డుబీ 2017 - జిఎస్ఎల్వి మార్క్ 3 ప్రయోగం, దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజను విజయ వంతమైంది. ప్రసిద్ధమైన ఇస్రో సంస్థ దేశాభివృద్ధి లక్ష్యంగా అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏర్పాటై, ప్రస్తుతం ప్రపంచంలోని అంతరిక్ష రంగ సంస్థల్లో ఒకటిగా పేరొందింది. బెంగుళూరు కేంద్రంగా ఏర్పాటైన ఇస్రో, దేశంలోని వివిధ ప్రదేశాల్లో పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలు కలిగి ఉంది. ఇస్రో భారత ప్రభుత్వపు అంతరిక్ష శాఖకు అనుబంధంగా ఉంది. అంతరిక్ష శాఖ ప్రధాన మంత్రి, అంతరిక్ష కమిషన్ అధీనంలో ఉంటుంది. ఇస్రో కింది విభాగాలను, సంస్థలను నిర్వహిస్తుంది. అంతరిక్ష కార్యకలాపాల లోకి ప్రయివేటు రంగాల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ అంతరిక్ష రంగంలో చాలా కీలకమైన సంస్కరణలకు ఆమోదం తెలిపింది. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నిర్ణయంతో మన అంతరిక్ష విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించునే సామర్థ్య మరింతగా పెరుగుతుంది. మన అంతరిక్ష రంగం త్వరిత గతిన అభివృద్ధి చెందటమే కాకుండా.. అంతరిక్ష ఆర్థిక వ్యవహారాల్లో భారత్ అంతర్జాతీయంగా కీలక పాత్ర పోషించేందుకు వీలవుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సిద్ధి పొందిన తాపసి రమణ మహర్షి - డిసెంబర్ 30 . . . భగవాన్ శ్రీరమణుల జయంతి



ఆది 1879వ సంవత్సరం డిసెంబర్ 29వ తేదీ. దక్షిణ భారతావని లోని తమిళనాట తిరుచ్చుళీ క్షేత్రం. శివుని పంచమూర్తులలో నటరాజ ఆనందమూర్తి ఆవిర్భావాన్ని పురస్కరించుకుని, జరుపుకున్న ఆరుద్ర దర్శనం' అనే ఉత్సవ సందర్భం. శ్రీభూమినాథేశ్వర ఆలయ సంబంధ ఆలంకృత ఉత్సవ మూర్తులను రథంపై వీధుల గుండా ఊరేగించిన ఉత్సవ సమయం. కొనసాగుతున్న ఉత్సవ క్రమంలో ఆర్ధరాత్రి దాటాక డిసెంబర్ 30నాటి తొలి గంటలో కోవెలను ఆనుకుని ఉన్న ఇంటిలో ఒక మగ శిశువు జన్మించాడు. సుందరం అయ్యర్, ఆళగమ్మ దంపతులకు కలిగిన ఆ బాలునికి .. "వేంకటేశ్వరన్" అని పేరు పెట్టారు. ఆ బాలుడే తర్వాతి కాలాన "భగవాన్ రమణ మహర్షి" అని ఖ్యాతి గడించాడు. బాలుని బాల్యం సాధారణంగా సాగింది. తండ్రి మందలింపు తో ఒకమారు పక్క గుడిలో జగన్మాత విగ్రహం వెనుక దాగి ఉన్నాడు. తెలియని వయసులో ప్రాపంచిక సంకటాల నుండి ఉపశమన లక్ష్యంతో దైవసన్నిధిని ఆశ్రయించడం భవిష్యత్ జీవితానికి సంకేతం. అద్భుత జ్ఞాపక శక్తి కారణంగా పాఠశాలలో విన్నవన్ని వెంటనే అప్పచెప్పేవాడు. యువకునిగా పెరియ పురాణం (శివభక్త విలాసం) గ్రంథాన్ని పఠించారు. శివునికి ధన ప్రాణమానాలను సమర్పించిన 63 నాయనార్ల గాథల పట్ల దివ్యావేశానికి లోనై, త్యాగభరితమై సాయుజ్యానికి దారితీసే గాథలకు పరవశుడై, సాధుమార్గ అన్వేశి అయినారు. నాటినుండి ఆయనలో దివ్య ప్రేరణ కలిగింది. రామస్వామి అనే వ్యక్తిని ఎక్కడనుండి వస్తున్నారని ప్రశ్నించి ," ఆరుణా చలం" , నుండి అని సమాధానం పొందగా, ఆయన ఎదో తెలియని అనుభూతికి లోనైనారు. నాటి నుండి ప్రాపంచిక విషయాల పట్ల విముఖులు కావడం ప్రారంభమైంది. 1896 ఆగస్టు 29న చదువుల పట్ల నిరాసక్తత కలిగి, ఇల్లు వదిలి స్కూల్ ఫీజు కు 5రూపాయలు అన్న వద్ద తీసుకుని, ఉదాత్తమైన ఆశయ సాధనకోసం వెళుతున్నానని 3 రూపాయలు మాత్రమే వెంట ఉంచుకుని, లేఖ వదిలి వెళ్ళి, దైవ మార్గ నిర్దేశత్వంతో, కష్ట నష్టాలకులకు ఓర్చి, సుదీర్ఘ ప్రయాణానంతరం సెప్టెంబర్ 1న ఆరుణోదయ వేళలో . . . ఆరుణాచలంలో మంగళ ప్రద మంగళవారం మంచి ఘడియలో పాదం మోపి, ప్రాకార ద్వారాలు, గర్భాలయం సహా బార్ల తెరిచి ఉన్న శ్రీఆరుణాచలేశ్వర ఆలయ ప్రవేశం చేశారు. మహాలింగాలింగనం ద్వారా ఆత్మ సమర్పణం చేసుకున్నారు. నాటి అరుణాచల ఆగమనం నుండి నేటి రమణాశ్రమంగా రూపు దిద్దుకున్న గిరి దక్షిణ పాదంలో స్థిరపడి, 1950 , ఎప్రిల్ 14 మహా నిర్యాణం వరకు 54 ఏళ్ళు, బ్రాహ్మణ స్వామిగా చిరపరిచితులై, తమకు ప్రియమైన అరుణగిరి పొలిమేర దాటనే లేదు. స్వామి ఉనికిని గురించి తెలుసుకున్న తల్లి అళగమ్మ, ఇంటికి వెళదామని అర్థించ గా,.. "కర్త వారివారి ప్రారబ్ధానుసారం జీవులనా డించును. జరుగనిది ఎంత ప్రయత్నించినను జరుగదు. జరుగునది ఎవరెంత యడ్డు కున్నను జరుగనే జరుగును. ఇది సత్యము. కనుక మౌనముగ ఉండుటయే ఉత్తమము"... అని కాగితంపై రాయగా , ఆమె ఖిన్నవదనయై వెనుతిరుగారు. రమణులు గిరిపై విరూపాక్ష గుహలోనే 17 ఏళ్ళ వాసాన్ని గడిపారు. 1916లో రమణులు విరూపాక్ష నుండి స్కందాశ్రమానికి మారారు. తల్లి అక్కడున్న అందరికీ వండి పెట్టగా , ఆమెకు అనుక్షణం వైరాగ్యాన్ని బోధించారు. 1920లో తల్లి ఆరోగ్యం క్షీణించగా , ఆమను కంటికి రెప్పలా కాపాడుతూ, 22లో రమణుల హస్త మస్తక సంయోగ దీక్ష ద్వారా అళగమ్మకు దేహ విముక్తి కలిగించారు . ఆమెకు స్పృహ ఉన్నంత వరకు వేదాంత బోధ చేస్తూ, చివరగా తమ కుడి చేతిని ఆమె హృదయం పైన, ఎడమ చేతిని శిరస్సుపైన ఉంచి, తదేక దృష్టితో వీక్షిస్తూ, మోక్షాన్ని ప్రసాదించారు . ఆమె పార్థివ శరీరాన్ని దహనం చేయకుండా, గిరి దక్షిణ పాదంలో సమాధి చేశారు . ఆ సమాధి చుట్టూ నిర్మాణాల సమాహారమే నేటి శ్రీరమణాశ్రమం. 1949లో మహర్షుల ఎడమ మోచేతిపై సార్కమా ( క్యాన్సర్) రాగా 1950, ఏప్రిల్ 14 న స్వామి అంతిమ ఘడియలు సమీపించాయని గ్రహించిన భకులు "ఆరుణాచల శివ" అంటూ రమణ మహర్షి విరచితాలను నినదించగా, రా త్రి 8 .47 గంటల సమయాన దక్షిణాకాశంలో ఒకపెద్ద కాంతి గోళం మెరసి, ఈశాన్యం వైపు పయనించి, ఆరుణాచల శిఖరా న అంతర్హితమైంది. రమణుల ఆధ్యాత్మిక శక్తి వికాసం ఆయన దేహయా త్ర అనంతరం నానాటికీ మహోజ్వలంగా బాసిస్తునే ఉన్నది .

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఘంటసాల కంఠాన్ని పరిచయం చేసిన పేకేటి

## - తెలుగు సినీ విజ్ఞాన సర్వస్వం పేకేటి - డిసెంబర్ 30... పేకేటి శివరాం వర్ధంతి



ఒక అవకాశం మనిషి జీవితాన్నే మార్చేస్తుంది. అలాంటి పోయిందనుకున్న అవకాశం ఘంటసాల మాస్టారుకు దొరికి ఆయనను మహా గాయకునిగా చిత్రసీమ నేపథ్య మకుటం లేని మహారాజుగా నిలిపింది. అలాంటి అవకాశాన్ని ఘంటసాలకు కల్పించింది నాటి నటునిగా పరిచితులైన పేకేటి శివరాం. 1944లో ఘంటసాల సినిమాలో పాటలు పాడాలని మద్రాసు వచ్చి ప్రతిభా పిక్చర్స్ సంస్థ అధిపతి ఘంటసాల బలరామయ్య వద్ద చేరి 'సీతారామజననం' చిత్రంలో వేషాలు వేసేందుకు నెలజీతంపై ఒప్పందం చేసుకుని, హెచ్.ఎం.వి లో రికార్డులు పాడాలని ప్రయత్నాలు చేశారు. అయితే లంకా కామేశ్వరరావు అనే అధికారి ఆయనకు ఆడిషన్ నిర్వహించి, గొంతు మైకుకు పనికిరాదని పంపి వేయడం జరిగింది. కానీ ఆ కంఠం పేకేటికి నచ్చింది. ఘంటసాల కంఠాన్ని తిరస్కరించిన కామేశ్వరరావు సెలవులో వెళ్ళినపుడు పేకేటి ఘంటసాలను పిలిపించి "నగుమోమునకు నిశానాథ బింబము" అనే చాటు పద్యాన్ని, రతన్ రావు రచించిన "గాలిలో నా బ్రతుకు తేలిపోయిన దోయ్" అనే పాటను పాడించి రికార్డు చేసి విడుదల చేశారు. శివరాం అంచనాను నిజంచేస్తూ ఆ రికార్డు అద్భుతంగా అమ్ముడు పోయింది. తన ప్రతిభను గుర్తించిన పేకేటికి ఘంటసాల ఎప్పుడూ పేకేటి కృతజ్ఞతలు తెలియజేస్తూ వుండేవారు. ఘంటసాల గొంతు రికార్డింగు కు సరిపోదని పంపించిన తరుణంలో...ఆనాడు పేకేటి సంచలన నిర్ణయం తీసుకుని, ఘంటసాల చేత హెచ్ ఎం వి సంస్థ లో రికార్డు స్వయంగా చేయించి, ప్రచారం చేయించక పోతే నేడు ఘంటసాల గళం వినే అవకాశం ఉండేది కాదు. పేకేటి శివరాంను తెలుగు సినీ విజ్ఞాన సర్వస్వం అని అంటుంటారు. పేకేటి కి సినిమా నిర్మాణం మీద వివిధ విభాగాల, అంశాల మీద లోతైన పరిజ్ఞాన ముంది. తెలుగు చిత్రసీమలో అగ్రగనులైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు లకు అత్యంత సన్నిహిత మిత్రుడుగా, సలహాదారుగా పేకేటి మన్ననలు పొందారు. తెగించి ఘంటసాల చేత పాడించిన రికార్డులకు విశేష ప్రచారమిచ్చి, సినీ నేపథ్య గాయకుడిగా నిలదొక్కు కునేందుకు కృషిచేసిన స్నేహశీలి పేకేటి. కన్నడ కంఠీరవుడు రాజకుమార్ కు కూడా అత్యంత ప్రీతిపాత్రుడైన దర్శకుడు పేకేటి. నటుడుగా రాశిలో తక్కువ చిత్రాలలో నటించినా తనదైన 'మార్కు'ని ఎప్పుడూ నిలబెట్టు కుంటూనే వచ్చారు. పేకేటి శివరాం అసలుపేరు పేకేటి శివరామ సుబ్బారావు. పుట్టింది అక్టోబర్ 8, 1918న భీమవరం దగ్గరలోని పేకేరు గ్రామంలో. ఆయన తల్లిదండ్రులు రాజేశ్వరమ్మ, కృష్ణమోహన్. కాలేజీలో చదివే రోజుల్లోనే పత్రికలకు శివరాం వ్యాసాలు రాసేవారు. ఆయన రాసిన వ్యాసాలు 'నెరజాణ', 'మాధురి' వంటి పత్రికల్లో ప్రచురితమయ్యేవి. శివరాం మంచి క్రీడాకారుడు కూడా. కాలేజీలో ఆయన ఫుట్ బాల్ ఛాంపియన్. సంగీతం మీద మక్కువ యెక్కువ కావడంతో హార్మోనియం, జలతరంగిణి వంటి వాద్యాలను వాయించడంలో తర్ఫీదు పొందారు. పద్యాలు బాగా పాడేవారు. నాటకాలు వేసేవారు. శ్రమజీవి అనే పత్రిక సంపాదకుడు జైలుకు వెళితే ఆపద్ధర్మంగా ఆ పత్రిక సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. అందులో సినిమాల మీద రాసే సమీక్షలు నిష్కర్షగా, విమర్శనాత్మకంగానూ ఉండేవి. ఇంటూరి వెంకటేశ్వరరావు ఆ పత్రికా నిర్వహణ బాధ్యతలు చూస్తుండేవారు. ఇంటూరి తప్పుకున్న తరవాత ఆ పత్రికా సంపాదకత్వ బాధ్యతలను పేకేటి నిర్వహిస్తూ వచ్చారు. బెంగుళూరు కేంద్రంగా 'సినిమా ఫ్లేష్' అనే సినీ పత్రిక విడుదలయ్యేది. ఆ పత్రికకు మద్రాసు ప్రతినిధిగా పేకేటి పనిచేశారు. పేకేటి రాసే సినీ సమీక్షలు అందరినీ ఆకర్షించేవి. ఆరోజుల్లో డిటెక్టివ్ నవలలకు కూడా మంచి డిమాండ్ వుండేది. పేకేటి 'భగవాన్' అనే డిటెక్టివ్ పేరుతో పద్దెనిమిది నవలలు రాశారు. బెంగుళూరు సినీ పత్రికకు పనిచేస్తున్నప్పుడే పేకేటికి 'హిస్ మాస్టర్స్ వాయిస్' (హెచ్.ఎం.వి) గ్రామఫోను సంస్థలో తెలుగు విభాగం ఆర్టిస్ట్ ఇన్ చార్జి గా ఉ ద్యోగం వచ్చింది. వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో 'శాంతి' (1952) చిత్రం నిర్మించినపుడు అందులో పేకేటికి 'టామ్ టామ్' అనే జర్నలిస్టు పాత్రను పోషించే అవకాశం వచ్చింది.1953లో దర్శక నిర్మాత కె.ఎస్. ప్రకాశరావు ప్రకాష్ ఆర్ట్స్ సంస్థ మీద నిర్మించిన 'కన్నతల్లి' చిత్రంలో పేకేటి 'శర్మ' పాత్రను పోషించారు. సంగీత దర్శకుడు పెండ్యాల ఇందులో 'పెరుమాళ్ళు' అనే పాత్ర పోషించడం విశేషం. అలాగే యక్షగానం లో నృత్యం చేసిన రాజసులోచనకు, గాయని సుశీలకు కూడా ఇది తొలి చిత్రమే. 'దేవదాసు' చిత్రం విడుదలైంది. అందులో అక్కినేనికి స్నేహితుడు 'భగవాన్' గా పేకేటి అపూర్వంగా నటించారు. 'వద్దంటే డబ్బు' చిత్రంలో పేకేటి ఎన్.టి. రామారావు ప్రాణమిత్రుడు 'రామ్' అనే కవి పాత్ర పోషించారు. జమున పేకేటికి జంటగా నటించింది. 'కన్యాశుల్కం' (1955)లో పోలీసు కానిస్టేబుల్ గాబీ అదే సంస్థ నిర్మించిన 'చిరంజీవులు' చిత్రంలో 'రత్నం' అనే విలన్ పాత్రలోను నటించి తన ప్రతిభను చాటుకున్నారు. అంజలీ పిక్చర్స్ వారు వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో నిర్మించిన 'అనార్కలి' చిత్రంలో, 'సువర్ణసుందరి' లోకూడా పేకేటి హాస్యపాత్రలో నటించారు. చిత్తజల్లు పుల్లయ్య దర్శకత్వం వహించిన సోషియో ఫాంటసీ చిత్రం 'దేవాంతకుడు' లో పేకేటి (వి)చిత్రగుప్తుడు పాత్ర పోషించి మెప్పించారు. 'భీష్మ' (1962) చిత్రంలో విచిత్ర వీర్యుడుగా నటించారు. భాగ్యరేఖ, పాండురంగ మహత్యం, పెళ్లినాటి ప్రమాణాలు, ఇల్లరికం, జయభేరి, గులేబకావళి కథ, గాలిమేడలు, బబ్రువాహన, మురళీకృష్ణ, వెలుగునీడలు వంటి చిత్రాలలో మంచి పాత్రలు పోషించారు. తరవాత పేకేటి శివరాం కన్నడ సినిమాలలో బిజీ అయిపోయారు. తెలుగు, కన్నడ, తమిళ చిత్రాలలోఅటు హాస్యనటుడి గా, ఇటు క్యారక్టర్ నటుడిగా వంద సినిమాలకు పైగా నటించారు. 'చుట్టరికాలు' (1968) పేరుతో పునర్నిర్మించిన చిత్రానికి కూడా పేకేటి శివరాం స్క్రీన్ ప్లే సమకూర్చి దర్శకత్వం వహించారు.1969లో 'పునర్జన్మ' అనే చిత్రాన్ని నిర్మించగా, ఆ చిత్రానికి కూడా పేకేటి దర్శకత్వం వహించారు. ఎన్.టి. రామారావు ఎన్.ఎ.టి బ్యానర్ మీద 1972లో 'కులగౌరవం' పేరుతో తెలుగులో పునర్నిర్మించగా, ఆ చిత్రానికి పేకేటి శివరాం దర్శకత్వం వహించారు. పేకేటి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రాల్లో ఏడు సినిమాలు సిల్వర్ జూబిలీలు, గోల్డెన్ జూబిలీలు జరుపుకున్నాయి. అలాగే తెలుగులో 'భలే అబ్బాయిలు' చిత్రానికి కూడా పేకేటి దర్శకత్వం వహించారు. పేకేటి 2006 డిసెంబర్ 30 తేదీన చెన్నైలో మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఉద్యోగ రంగంలో అన్యాయాలపై సుదీర్ఘ పోరాటాలు

## - డిసెంబర్ 30...610 జీ ఓ జారీ అయిన రోజు





తెలంగాణ ప్రాంతీయులకు ఉద్యోగ రంగంలో దశాబ్దాలుగా జరిగిన అన్యాయాన్ని సవరించి చక్క దిద్దేందుకు నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 610 జీ.ఓ. (G.O.Ms.No.610 GA (SPF-A)Dept., Dt:30-12-1985) జారీ చేసిన రోజు డిసెంబర్ 30.. తెలంగాణ స్థానికులకు జరిగిన అన్యాయం ఏమిటి? అది ఎలా జరిగింది? సవరింపులు, చక్కదిద్దడాలు జరిగాయా? ముల్కి నిబంధనలు, ఆరు సూత్రాల పథకం, పెద్దమనుషుల ఒప్పందం, రాష్ట్రపతి ఉత్తర్వులు, 610 ఉత్తర్వులు, గిర్గ్లానీ నివేదికలు, తెలంగాణ వాసులకు జరిగిన అన్యాయాన్ని నిలువరించ లేక పోయాయి. ఇందుకు సంబంధించి 610 ఉత్తర్వుల జారీ పూర్వాపరాల గురించి తెలిపే ప్రయత్నం ఇది. ఆంగ్ల భాష రాదన్న సాకుతో, నిజాం పాలనలో ఉత్తరాది వారికే ఉద్యోగాలు అధికంగా దక్కగా, చాలాకాలం అనంతరం ఉవ్వెత్తున లేచిన ఉద్యమ ఫలితంగా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1919లో ప్రవేశ పెట్టిన ముల్కి నిబంధనల ప్రకారం తెలంగాణలోని ఉద్యోగాలన్నీ స్థానికులకే చెందాల్సి ఉండెను. దీని ప్రకారం 15 సంవత్సరాల కనీస నివాస యోగ్యతగా స్థానికత్వ నిర్ధారణ జరగాల్సి ఉండెడిది. అంతేకాక ఉద్యోగ విమణ తర్వాత కూడా తెలంగాణలోనే ఉండాలనే షర్తులు విధించ బడినాయి. తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగం పొందటానికి నివాస నిబంధన 12 సంవతరాలు ఉండాలని సవరించి, నిర్ణయించ బడింది. 1973 సెప్టెంబర్ 23న జారీ అయిన ఆరు సూత్రాల పథకంలో భాగంగా 1975 అక్టోబర్ 18న రాష్ట్రపతి ఉత్త ర్వులు 674 (ప్రెసిడెన్షియల్ ఆర్డర్)(G.O.Ms.No.674, GA (SPF-A) Dept., Dt: 20-10-1975) జారీ అయి రాష్ట్రాన్ని 1,2,3 కోస్తాంధ్ర, 4 రాయలసీమ మరియు 5,6 తెలంగాణ జోన్లుగా విభజించారు. ఈ ఉత్తర్వులోని పేరా 14 ప్రకారం కొన్నింటిని స్థానిక రిజర్వేషన్ల పరిధి నుండి తప్పించడం జరిగింది. హైదరాబాద్ లోని మినహాయించిన ఆఫీసులకు కాకుండా మిగిలిన అన్ని ప్రభుత్వ ఆఫీసులలో లోకల్ రిజర్వేషన్ పాటించాల్సిందని పేరా 20 సూచించింది. అలాగే పేరా 9 ప్రకారం 10వ తరగతి నుండి కింది స్థాయి 4వ తరగతి వరకు చదివిన విద్యా సంస్థ జిల్లా పరిధిగా, ఆ జిల్లాలో సంవత్సరాలు చదువును స్థానికంగా వివరించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం జిల్లాస్థాయి కేడర్లలో 80%, జోనల్ స్థాయిలో 60% స్థానికులకు ఉద్యోగాలు రిజర్వు చేయ బడినాయి. రిజర్వు చేయబడినవి పోగా మిగిలినవి ఓపెన్ కాంపిటీషన్ ద్వారా భర్తీ చేయాలి. వాటిని స్థానికేతరులకు రిజర్వు చేయరాదని ఉత్తర్వులు స్పష్టంగా పేర్కొన్నాయి. 1919 నుండి అమలులోనున్న నివాస యోగ్యతను 15 నుండి12 కు (1958లో) అనంతరం 1975లో 4సంవత్సరాలకు తగ్గించగా, వివక్షత కొనసాగింది. రాష్ట్రపతి ఉ త్తర్వులలో పేర్కొన్న విధంగా జోనల్ వారీ విధానాన్ని సైతం తుంగలో తొక్కి, స్వార్ధమే పరమార్ధంగా పాలన కొనసాగించడం జరిగింది. నాటి ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు నియమిం చిన జయభారత్ రెడ్డి, కమల నాథన్, ఉమాపతి తో కూడిన సీనియర్ ఐఎఎస్ అధికారుల త్రిసభ్య కమిటీ, 1975 నుండి 1984 మధ్య కాలంలో జరిగిన ఉద్యోగ నియామకాలను పరిశీలించి సమర్పించిన 36 పేజీల 1981 జూన్ నాటి నివేదికలో, జోన్ల రిజర్వేషన్లకు విరుద్ధంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన 1,2,3లకు చెందిన వారు తెలంగాణకు చెందిన 5,6 జోన్లలో 58,986 మంది నిబంధనలకు విరుద్ధంగా నియ మింప బడినట్లు పేర్కొనడం జరిగింది. ఈ నివేదికను పరిశీలించిన నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 1985 డిసెంబర్ 30న 610 జీవోను జారీ చేశారు. గత పాలకులు చేసిన తప్పులను దిద్దుకునే క్రమంలో 1986 మార్చి 30కల్లా 610 జీవోను అమలు పరిచి, తెలంగాణలో ఉన్న ఆంధ్ర ఉద్యోగులందరినీ ఎవరి జోన్లకు వారిని పంపుతామని ఎన్టీఆర్ ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో రాయల సీమ ప్రాంతంలో నియుక్తులైన స్థానికేతర ఉద్యోగులను కోస్తాంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు పంపిం చాలన్న "జీ.ఓ. 564, తేది: 05-12-1985" మాత్రం వెంటనే అమలయింది. ఎన్టీఆర్ ను గద్దె దింపి, ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి గిర్గ్లానీ ఏకసభ్య కమిషన్ ను పునః పరిశీలనకై నియ మించగా, నివేదిక సమర్పించిన గిర్గ్లానీ స్థానికేతరులను నిర్ధారించ గల సంపూర్ణ సమాచారం పొంద కుండానే, సమర్పిత నివేదికలో రాష్ట్రపతి ఉత్తర్వులను 128 పద్దతులలో ఉల్లంఘించడం జరిగిం దని వివరించి, వాటిని 18రకాలుగా వర్గీకరించి, పరిష్కార మార్గాలను సూచించడం జరిగింది. ఉద్యోగ నియామకాలన్నీ జోనల్ నిబంధ నలను అనుసరించి జరగాల్సి ఉండగా, జోనల్ ఆఫీసులను రాష్ట్ర స్థాయి కార్యాలయాలుగా మార్చి ఇష్టారాజ్యంగా బదిలీలు చేయడం జరిగిందని, ఈ బదిలీలు తప్పని కమిషన్ అభిప్రాయ పడ్డది. గిర్గ్లానీ నివేదిక ప్రకారం సగం మంది స్థానికేతరులు ఉన్నారని స్పష్టం అయింది. తెలంగాణ స్వరాష్ట్ర ప్రభుత్వ పాలనలో సదరు అన్యాయానికి అడ్డుకట్ట వేసేందుకు చర్యకు తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉ ద్యమానికి అంకురార్పణ జరిగింది సదరు వివక్షత కారణం ప్రధానం కాగా, అట్టి వివక్షత రూపు మాపేందుకు, సిఎం కేసిఆర్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించి, 7జోన్లు, 2 మల్టీ జోన్లను 31 జిల్లాలను కలిపి ఖరారు చేశారు. తర్వాత 33 జిల్లాలతో కలిపి తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్ - 2018ను అమల్లోకి తెచ్చారు. దీనికి అనుగుణంగా 33 జిల్లాలకు ఉద్యోగులను విభజించే ప్రక్రియ చేపట్టారు. 33 జిల్లాలతో రాష్ట్రపతి ఆమోదించిన కొత్త జోనల్ వ్యవస్థ-2018కి అను గుణంగా ప్రభుత్వం ఈ మార్గదర్శ కాలను రూపొందించింది. కొత్త జోనల్ వ్యవస్థలో స్థానిక కోటా కింద 95 శాతం, ఓపెన్ కోటా కింద 5 శాతం చొప్పున జరిగే నియామకాల్లో పూర్తిగా 100 శాతం ఉద్యోగాలు తెలంగాణ నిరుద్యోగులకే చెందేలా, ఓపెన్ కోటాలోని 5 శాతం ఉద్యోగాలకు కూడా తెలంగాణ నిరుద్యోగులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు కొత్త జోనల్ వ్యవస్థ అవకాశం కలిగించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# భక్తుల కోరికలు నెరవేర్చే యాదగిరి లక్ష్మీనరసిం హుడు

## వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సర్వం సిద్ధం



తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండజిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో డిసెంబర్ 30న స్వామివారి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరి భక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు. ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదు గానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీ హరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్ధించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాద మహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీ నరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందట. అప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి గా లోక కళ్యాణార్ధం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట. రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృ దేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం .. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు ఋష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మి సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మి నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండి పోయాడు.కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూపాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు. అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. వైకుంఠ ఏకాదశి ఉత్సవం డిసెంబర్ 30న వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు ప్రధానాలయంలో శ్రీస్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు. పాతగుట్ట లక్ష్మీనారసింహస్వామి ఉత్తర రాజగోపురం గుండా 6.45 నుంచి 7.30 గంటలకు వైకుంఠనాథుడిగా దర్శనం ఇవ్వనున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి బ్రేక్ దర్శనం ఉదయం ఉదయం 10.30 నుంచి 11.30 గంటలకు ఉంటుందని దేవస్థానం ఈఓ వెంకట్ రావు వెల్లడించారు. 30న ప్రారంభమయ్యే స్వామివారి ఆధ్యయనోత్సవాలు జనవరి 8వ తేదీవరకు కొనసాగనున్నాయి. అధ్యయనోత్సవాల్లో భక్తులచే నిర్వహించే సుదర్శన నారసింహహోమం, నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవాలను రద్దు చేసినట్టు ఈవో వెల్లడించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పరమ పవిత్రం... వైకుంఠ ఏకాదశి పర్వదినం



ధనుర్మాసము సౌరమానము యొక్క ప్రామాణికాను సారము కాగా, శుక్ల ఏకాదశి చాంద్రమానమైన తిథి. ప్రతి మాసమునందలి ఏకాదశులు ఎంతో పవిత్రమైనవి. "గృహస్థో బ్రహ్మచారీ చ ఆహితాగ్నిస్థ థైవచబీ ఏకాదశ్యాంశ భుంజిత పక్షయోరు భయోరపి" అని అగ్ని పురాణాదులు వివరిస్తున్నాయి. గృహస్తులకు, బ్రహ్మచారులకు, నిత్యాగ్ని హోత్రులకు నైమిత్తిక కర్మగా ఉపవాసాద్యాచరణము విధించ బడినది. ఇట్టి ఏకాదశి విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన దివసము కావునే ఏకాదశి హరి వాసరముగా కొనియాడ బడుచు న్నది. అందు సౌరమానము నందలి ప్రశస్తమైన ధనుర్మాసంలో వచ్చే శుక్ల పక్ష ఏకాదశి (మార్గశీర్షము లేక పుష్య మాసం) "వైకుంఠ ఏకాదశి"గా పిలువ బడుచు న్నది. సూర్య చంద్రులు నేత్రములుగా కలిగిన వైకుంఠ వాసునుకి సౌర, చాంద్ర మానాలలో ప్రశస్తమైన ధనుర్మా శుక్ల పక్ష ఏకాదశి అత్యంత ప్రీతికరమైనది. ధనూరాశి స్థితే సూర్యే శుక్ల ఏకాదశి తిథౌబీ త్రింషత్ కోటి సురైః సాకం బ్రహ్మ వైకుంఠ మాగత: పాలస్త్యేనని పీడితా: సురగణాః వైకుంఠలోకం యయు:బీ ద్వారే తత్ర విషాదభావ మనసా సూక్తైర్ హరిం తుష్టువు: శుక్తై: శ్రీహరి వాసరే ప్రభాత సమయే భానౌ ధనుః సంస్థితే, తేభ్యోదాత్ సుఖ దర్శనం కరుణయా నారాయణో మాధవ:" రావణుని బాధలను తాళలేని దేవతలు బ్రహ్మను ఆశ్రయింపగా...ఆ దేవుడు ధనుర్మాస శుక్ల ఏకాదశి దినమున దేవతలందరితో వైకుంఠము నుచేరి, హరి వాసరమునందు దేవతలు విషాద భావ మనస్కులై శ్రీహరిని వేదోక్తంగా స్తుతించగా, వారికి శ్రీహరి సుఖ దర్శనమును కలుగజేసెనని వివరించ బడినది. శ్రీప్రశ్న సంహిత (ఐదవ అధ్యాయము) నందు గల ఐతిహ్యము ననుసరించి మధు కైటభులను భగవానుడు సంహరించినపుడు వారు దివ్యరూపధారులై దివ్య జ్ఞానము పొందగా, బ్రహ్మాదులెవరైనను నీలోకము వంటి మందిరమును నిర్మించి, ఏకాదశి దినోత్సవమును గావించి, నిన్ను నమస్కరించి ఉత్తర ద్వార మార్గమున సమీపింతురో, వారికి వైకుంఠ ప్రాప్తి కలుగునట్లు దీనిని మోక్ష ఉత్సవ దినముగా వరమిచ్చినట్లు తెలియు చున్నది. ముక్కోటి దేవతల బాధలను నివారించినందున 'ముక్కోటి ఏకాదశి'గాను, వైకుంఠ దర్శనము కలిగించునది కనుక 'వైకుంఠ ఏకాదశి'గాను, భగవద్దర్శనము చేయు పవిత్ర దినమైనందున భగవదవలోక దివసము'గ కొనియాడ బడుచున్నది. ధనుర్మాస ఏకాదశి కొన్నిసార్లు మార్గశిర మాసమందు, మరికొన్ని మారులు పుష్యమాసమందు రావడం చేత రెండు మాసాల శుక్ల ఏకాదశులు ప్రశస్తములైనవే. మార్గశిరమాస ఏకాదశిని మోక్షైకాదశి అని, పుష్యమాస ఏకాదశిని పుత్రదైకాదశి, రైవత మన్వాది దినమని పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి అనే పేరులో వైకుంఠ, ఏకాదశి అని రెండు పదాలున్నాయి. వైకుంఠ శబ్దం ఆకారాంత పుంలింగం. ఇది విష్ణువునూ, విష్ణువుండే స్థానాన్ని కూడా సూచిస్తుంది. చాక్షుస మన్వంతరంలో వికుంఠ అనే ఆమె నుండి అవతరించి నందున విష్ణువు "వైకుంఠః" (వైకుంఠుడు) అయ్యాడు. అదేకాక జీవులకు నియంత, జీవులకు సాక్షి, భూతముల స్వేచ్ఛావిహారాన్ని అణచేవాడు - అని అర్థాలున్నాయి. సూర్యుడు ధనురాశిపై నుండగా వచ్చిన తొలి ఏకాదశి (వైకుంఠ) పుణ్యదినాన తన దివ్యమంగళ రూపంతో వైకుంఠ ద్వారంవద్ద దేవతలకు శ్రీమహా విష్ణువు దివ్యదర్శనం గావించిన సంద ర్భంగా, కోటి తేజోమూర్తిని దర్శించిన బ్రహ్మాదిదేవతలు, సనక సనందాది మునులు, 'పశ్యన్ నిముష మాత్రేన కోటి యజ్ఞంఫలం లభేత్' అని వచించినట్లు బ్రహ్మాండ పురాణంలో వర్ణించ బడింది. ఈ పవిత్ర దినాన వైష్ణవ సంబంధ ఆలయాలలో, ఉత్తర ద్వారం వద్ద సూర్యోదయానికి పూర్వమే స్వామి దర్శనం చేసికోవడం అనాదిగా ఆచరిస్తున్న సత్సాంప్రదాయం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# విడివిడిగా.. వడివడిగా ఇసుక దోపిడీ!

అశ్వాపురం : అశ్వాపురం మండలం చింతిర్యాల రేవు వద్ద ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతి లేదు. అయినా నిత్యం ట్రాక్టర్ల ద్వారా పగలూరాత్రీ అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందిన రెండు వర్గాలు పక్కపక్కనే జాతీయ రహదారుల స్థాయిలో ఇసుక రేవు మార్గాలను వేర్వేరుగా ఏర్పాటుచేసుకుని గోదావరిలో ఇసుకను తోడేస్తుండటం గమనార్హం.



**ఇందిరమ్మ ఇళ్ల పేరిట..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలిస్తున్నామని చెబుతున్నా.. ఇదంతా దళారులు, ఇతరులకు చేరుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాములపల్లిలో అధికారిక ఇసుక రేవు ఉంది. ట్రాక్టర్ లోడుకు రూ.2వేల వరకు ధర పలుకుతోంది. చింతిర్యాల రేవు వద్ద ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతులు లేకున్నా అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ లోడుకు రూ.1,000 నుంచి రూ.1,500వసూలు చేస్తున్నట్లు సమాచారం. అయినా అధికారులు పట్టించుకోవటం లేదు. 'చింతిర్యాల రేవు నుంచి అనధికారికంగా ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నట్లు మాదృష్టికి వచ్చింది. కొన్ని ఇసుక ట్రాక్టర్లను స్వాధీనపరచుకున్నాం. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఇసుక రేవు మార్గాలకు అడ్డుగా ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తాం' అని అశ్వాపురం తహసీల్దారు ఎ.మణిధర్‌కు తెలిపారు.

# సింగరేణి X జెన్కో

మణుగూరు : మణుగూరు ఏరియా పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను వేలం ద్వారా పొందేందుకు జెన్కో, సింగరేణి సంస్థలు పోటీపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం.. దేశంలోని 17 బొగ్గు బ్లాకులను వేలం వేస్తుండగా అందులో పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ ఒకటి. దీనిని పొందేందుకు బిడ్ వేసే గడువు ఈనెల 22తో ముగిసింది. రాష్ట్రానికి చెందిన రెండు ప్రభుత్వ రంగ సంస్థలు బిడ్ వేశాయి. ఈ రెండు కంపెనీలు జనవరి మొదటి వారంలో బ్లాక్‌ను పొందేందుకు వేలంలో పాల్గొననున్నాయి.

**సమన్వయం అవసరం..**

బొగ్గు బ్లాకులను వేలంలో పొందేందుకు జెన్కో, సింగరేణి సంస్థల మధ్య సమన్వయం అవసరమని భావిస్తున్నారు. తాడిచర్ల-1 బ్లాక్‌ను జెన్కో పొందింది. భవిష్యత్తులో తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం వేలం వేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కాకుండా జెన్కో పొందితే.. దీనిని సింగరేణికి ఇచ్చి,



భవిష్యత్తులో వేలం వేసే తాడిచర్ల-2 బ్లాక్‌ను జెన్కో పొందేలా సర్దుబాటు అవసరం. అందుకు రెండు సంస్థల ఉన్నతాధికారులు, ప్రభుత్వం చర్చలు జరపాల్సిన అవసరం ఉంది.

**పాల్గొనని ప్రైవేటు కంపెనీలు..**

పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ కోసం ప్రైవేటు కంపెనీలు బిడ్ వేయలేదు. తద్వారా ఈ బ్లాక్ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ జెన్కో పొందితే ప్రైవేటు వారికి ఇవ్వకుండా సింగరేణి సంస్థకు అప్పగిస్తే ప్రయోజనం చేకూరుతుంది. గతంలో తాడిచర్ల బ్లాక్‌ను వేలంలో జెన్కో పొంది బొగ్గు తవ్వకాన్ని ప్రైవేటు కంపెనీకి అప్పగించింది. ఈసారి కూడా ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను వేలంలో జెన్కో పొందితే ప్రైవేటు కంపెనీకి ఇవ్వకుండా సింగరేణికి అప్పగించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# 'వెల్'నెస్ కేంద్రాలు

హైదరాబాద్: గ్రేటర్‌లో వెల్‌నెస్ కేంద్రాలు సూపర్ స్పెషాలిటీ ఓపీ కేంద్రాలుగా మారనున్నాయి. పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించనున్నారు. తాజాగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ దీనిపై అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఖైరతాబాద్, కూకట్‌పల్లి, వనస్థలిపురం లాంటి వెల్‌నెస్ కేంద్రాల్లో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో అన్నింటిలో విశ్రాంతి ఉద్యోగులు ఇతరులకు అన్ని రకాల పరీక్షలతో పాటు అక్కడే మందులు పంపిణీ చేసేవారు. తర్వాత ఈ కేంద్రాల పనితీరు నానాటికి అధ్వానంగా మారింది. ఇక్కడ నుంచి ల్యాబ్‌లను ఎత్తివేసి నారాయణగూడ తెలంగాణ డయోగ్నొస్టిక్స్‌కు అనుసంధానం చేశారు. కేవలం ఇక్కడ శాంపిళ్లు మాత్రమే సేకరించి పరీక్షల కోసం అక్కడ పంపడంతో ఫలితాలు వచ్చే సరికి తీవ్ర జాప్యం జరిగేది. మందులు సరఫరా కూడా తగ్గించేశారు. తాజాగా దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

**నిమ్స్‌తో అనుసంధానం..**

తొలుత ఖైరతాబాద్, కూకట్‌పల్లి కేంద్రాలకు నిమ్స్ నుంచి డాక్టర్లను పంపాలని నిర్ణయించింది. వనస్థలిపురం కేంద్రాన్ని స్థానిక జిల్లా ఆసుపత్రితో అనుసంధాం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిమ్స్ ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన వైద్యులు ఆయా కేంద్రాల్లో ఓపీ సేవలను నిర్వహించనున్నారు. అవసరమైన పరీక్షలు అక్కడే చేయనున్నారు.

ప్రస్తుతం అందుతున్నవి

జనరల్ మెడిసిన్

డెంటల్

ఫిజియోథెరపీ ఆర్థోపెడిక్ అందుబాటులోకి రానున్నవి

జనరల్ సర్జరీ కార్డియాలజీ నెఫ్రాలజీ

పీడియాట్రిక్స్‌జి

న్యూరాలజీ

డెర్మటాలజీ

# బండకు.. అండాదండా




సూర్యాపేట : నివాస గృహాలకు వినియోగించే గ్యాస్‌ను కొందరు అక్రమార్కులు కాసులకు కక్కుర్తి పడి హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. సాధారణంగా 14.2 కేజీల వంట గ్యాస్ రూ.926 విక్రయించాల్సి ఉంది. కానీ వారికి అధికంగా రూ.1100 విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అమాయకులకు సబ్సిడీ, మరికొందరికి ఒక్కో సిలిండర్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు ఆశ చూపి.. వారి వద్ద నుంచి గ్యాస్ పుస్తకాలు తీసుకుని బుకింగ్ ద్వారా సిలిండర్లను తరలిస్తున్నారు. ఈ తతంగం వెనుక కొందరు ఏజెన్సీలు పాత్ర వహిస్తుండగా.. వారికి కొందరు అధికారులు సైతం సహకరిస్తున్నట్లు సమాచారం.

**రూ.లక్షల్లో వ్యాపారం**

ప్రతి హోటల్‌లో 19 కేజీల వాణిజ్య సిలిండర్‌ను వినియోగించాల్సి ఉంది. ఒక్క బండకు రూ.1836 చెల్లించాల్సి ఉంది. ఆ ధరకే 14.2 కేజీలుండే రెండు వంట గ్యాస్ బండలు అదనకు రూ.300 చెల్లిస్తే లభిస్తున్నాయి. దీంతో వ్యాపారులు వీటికే మొగ్గు చూపుతున్నారు. సగటున చిన్న హోటళ్లలో మూడు రోజులకు ఒకటి, పెద్ద హోటళ్లలో రోజుకు రెండు, పాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో రెండు రోజులకు ఒకటి చొప్పున వంట గ్యాస్ సిలిండర్ వినియోగిస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.లక్షల్లో గ్యాస్ సిలిండర్ల దందా సాగుతున్నట్లు తెలుస్తోంది.

**అనుమతులు శూన్యం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 450 వరకు పెద్ద తరహా హోటళు ,, 1210 వరకు మధ్య, చిన్న తరహా హోటళ్లు, 1720 వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. వీటికి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఆ సమయంలో వంట గ్యాస్ వివరాలను కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు వీటిని ఉల్లంఘిస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు మామూలుగా వ్యవహరిస్తున్నారు.

**వారానికి ఒకసారి తనిఖీలు**

జిల్లా పాలనాధికారి ఆదేశానుసారం వారానికి ఒకసారి హోటళ్లలో తప్పనిసరిగా తనిఖీలు చేపడతాం. మూడుసార్లు వంట గ్యాస్ సిలిండర్లు లభిస్తే కేసులు నమోదు చేసి హోటల్‌ను సీజ్ చేస్తాం. గ్యాస్‌కు సంబంధించిన ఏజెన్సీలపై సైతం చర్యలు తీసుకుంటాం. ఈ వ్యాపారంలో పాలుపంచుకునే అధికారులపైనా ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం.

మోహన్‌బాబు, డీఎస్‌వో, సూర్యాపేట

# మార్పులకు శ్రీకారం.. భవితకు ఆకారం



గరిడేపల్లి : విద్యారంగంలో వినూత్న మార్పులకు ఈ ఏడాది బీజం పడింది. ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు అనేక కోర్టు కేసులు ఉన్నా వాటిని అధిగమించి పదోన్నతులను భర్తీ చేయగలిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి మే నెలలోనే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టి సుమారు 45 వేల మంది విద్యార్థులను నమోదు చేయగలిగారు. ఐదు రోజుల శిక్షణ ఇచ్చి కొత్త పద్ధతుల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి బోధన ఆరంభించారు. ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. కొత్తగా పీఎంశ్రీ పాఠశాలలకు అన్ని హంగులు, సౌకర్యాలు కల్పించి మార్పులకు శ్రీకారం చుట్టారు. చిన్నారులను ఆకర్షించేందుకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రి మెట్రిక్ స్కూల్స్ ప్రారంభించారు. చతుర్విధ ప్రక్రియలను విద్యార్థులకు సంపూర్ణంగా వచ్చేలా నిత్యం ఎంఈవోలతో మానిటరింగ్ చేయించారు.

**స్కాలర్‌షిప్‌లు.. కమిటీలు..**

ఈ విద్యాసంవత్సరం ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ప్రవేశపెట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఎస్సీ, బీసీ విద్యార్థులకు ఇది వర్తింపచేస్తున్నారు. దీని దరఖాస్తుకు ఈ నెల చివరి వరకు గడువు ఇచ్చారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థుల కమిటీలు ఏర్పాటు చేశారు. పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ మొక్కల పెంపకంపై దృష్టి సారించారు. 5.0 కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లోని పాతసామగ్రి, శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలిగించడానికి అనుమతినిచ్చారు.

**ఆరంభం నుంచి..**విద్యాసంవత్సరం ఆరంభం నుంచి పుస్తకాల పంపిణీ, రాతపుస్తకాలు, ఏకరూప దుస్తులు సకాలంలో అందించగలిగారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా విద్యాశాఖ పర్యవేక్షిస్తుండటంతో అధికారుల్లో, ఉపాధ్యాయుల్లో సేవాభావం పెరిగింది. కొత్తగా పదో తరగతి వార్షిక పరీక్షలకు నెల రోజుల సమయం కేటాయించారు. ఒక్కో నియోజకవర్గంలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది ఇదే ఒరవడి కొనసాగిస్తూ మరింత విద్యాభివృద్ధి సాగించడానికి కొత్త కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

# హస్తకళా మేళా.. భళా!



మాదాపూర్: వారంతా వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చిన చేనేత హస్త కళాకారులు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన కళను నమ్ముకొని జీవిస్తున్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఉత్పత్తులతో కళల గొప్పదనాన్ని చాటుతున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆయా రాష్ట్రాల హస్త కళాకృతులకు మాదాపూర్ శిల్పారామం వేదికైంది. కళాకారులే నేరుగా ఉత్పత్తులు విక్రయించుకునేందుకు వీలుగా 450 స్టాల్స్‌తో అఖిల భారత హస్త కళా మేళా నడుస్తోంది.

**అన్ని రకాల ఉత్పత్తులు** మగువలు మెచ్చే సంప్రదాయ చీరలు, దుస్తులే కాకుండా చూడముచ్చటైన కొండపల్లి బొమ్మలు, మట్టి, పింగాణీ పాత్రలు, అందమైన పెయింటింగ్స్, దేవతామూర్తుల విగ్రహాలు, కొయ్య, టెర్రకోట బొమ్మలు, బ్రాస్ మెటల్ వస్తువులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. బిహార్ కళాకారులు రూపొందించిన మధుబన్ పెయింటింగ్స్ కనువిందు చేస్తున్నాయి. తిరుపతి కళాకారులు రూపొందించిన దేవతామూర్తుల కొయ్య బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ కళాకారులు తయారుచేసిన రాధాకృష్ణులు, వినాయకుడు, బాలాజీ ఇత్తడి బొమ్మలు శిల్పకళా నైపుణ్యానికి చాటుతున్నాయి. అనంతపురం జిల్లా నిమ్మలకుంటకు చెందిన ప్రకాశ్.. మేక, గొర్రె తోలుతో తయారుచేసిన అందమైన బొమ్మలు, బెడ్ ల్యాంప్‌లు ఆకట్టుకుంటున్నాయి. జమ్దాని, కాంత వర్క్ చీరలు, పటోలాపట్టు చీరలు, కోసా సిల్క్ చీరలు, మంగళగిరి, పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట చేనేత చీరలు, కశ్మీర్ శాలువాలు, సరికొత్త డిజైన్ల బెడ్ షీట్లు ఆకట్టుకుంటున్నాయి.

జనవరి 5వరకు ప్రదర్శన.. ఈ మేళా జనవరి 5వరకు కొనసాగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉంటుంది. సందర్శకులు భారతీయ చేనేత హస్త కళా వైభవంతోపాటు సాయంత్రం నిర్వహించే విభిన్న సంప్రదాయ, జానపద నృత్య కళా ప్రదర్శనలు వీక్షించొచ్చు.

# కలుషిత ముప్పు.. కలగాలి కనువిప్పు

సూర్యాపేట : ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండటంతో చలికాలం వానాకాలన్ని తలపిస్తోంది. పొద్దున ఎండ, సాయంత్రం వర్షం కురవడం.. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో మిషన్ భగీరథ పథకంతో పాటు స్థానిక సంస్థల ద్వారా చాలా గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. జలాశయాలు, ట్యాంకులు, నల్లాల వద్ద నీటి నమూనాలను సేకరించి తప్పనిసరిగా పరీక్షలు చేయాల్సి ఉంది. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలి. గ్రామాల నుంచి నగరాల వరకు అనేక చోట్ల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రజా కుళాయిల నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచారన్న విమర్శలున్నాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

గ్రామ పంచాయతీ సంబంధిత సిబ్బందితో ఏటా నీటి నాణ్యత నిర్ధారణ పరీక్షలు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ అధికారులు పరీక్షలు నిర్వహించాలి.

నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి. వివరాలు నమోదు చేయాలి.

ఫిల్టర్ బెడ్‌లు, గృహాల వద్ద ఉండే నల్లాల నుంచి నమూనాలు సేకరించాలి. మంచినీటిని సరఫరా చేసే పైపులకు లీకేజీ సమస్యలు ఉంటే తక్షణ మరమ్మతు చేపట్టాలి. ప్రతిరోజు క్లోరిన్ కిట్లద్వారా నీటి పరీక్షలు నిర్వహించాలి. నీరు కలుషితం కాకుండా చర్యలు

యాదగిరి, జిల్లా పంచాయతీ అధికారి గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రణాళిక రూపొందించి స్థానిక నీటి వనరుల్లో పరీక్షలు చేయడం, ట్యాంకులను శుభ్రం చేయించడం, క్లోరినేషన్ వంటి ప్రక్రియ చేపట్టనున్నాం. అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్, ఇతర రసాయాలను సిద్ధంగా ఉంచాం. పైపులైన్లకు లీకేజీ ఏర్పడిన వెంటనే గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది సమన్వయంతో మరమ్మతులు చేస్తున్నాం.

# శునకం వణికిస్తోంది..!

సూర్యాపేట : రోజురోజుకూ వీధి కుక్కలు పెరుగుతున్నా.. వాటి సంతతి నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కడో ఒకచోట వీటి బారినపడి బాధితులు చికిత్స పొందుతూనే ఉన్నారు. వీటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టాలని రెండేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. క్షేత్రస్థాయిలో అధికారులు నేటికీ సరైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో కుక్కకాటు బాధితులు ఏటా పెరుగుతున్నారు. శునకాల నియంత్రణ విషయంలో అధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించక పోవడంతో నానాటికీ వీటి బారిన పడుతున్న వారు అధికమవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 32,168 మంది శునకాల బారిన పడి గాయాలపాలయ్యారు. ఎవరూ మృత్యువాత పడలేదు. ఈ లెక్కన చూసుకుంటే నల్గొండ జిల్లాలో రోజుకు 55 మంది, సూర్యాపేట-57, యాదాద్రి జిల్లాలో 4 చొప్పున గాయపడుతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధులపై ఎక్కడో ఒకచోట వీధి కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లాలో అధికంగా బాధితులు ఉన్నారు. వీధి కుక్కల నియంత్రణ విషయంలో చర్యలు చేపట్టాలని కోర్టులు ఆదేశాలు జారీ చేస్తున్నా.. చాలాచోట్ల అమలు కావడం లేదు.



సంతతి పెరగకుండా శునకాలకు చికిత్స చేయాల్సి ఉండగా.. కొన్ని రోజులకే పరిమితమవుతోంది. కొన్ని శునకాలకు చికిత్స చేసి మిగతా వాటిని వదిలేస్తున్నారు. వీధుల్లో గుంపులుగా ఉంటున్న కుక్కలు ఒంటరిగా వెళుతున్న చిన్నారులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఈ కారణంగా చిన్నారులను ఒంటరిగా బయటకు పంపాలంటే వారి కుటుంబ సభ్యులు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. మాంసం విక్రయదారులు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను పడేయడంతో వాటిని తినేందుకు కుక్కలు రోడ్లపై గుంపులుగా చేరుతున్నాయి. ఆ మార్గంలో ద్విచక్ర వాహనదారులు వెళితే వెంటపడుతున్నాయి. వీటి బారినుంచి రక్షించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ఎంతోమంది గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.

రాత్రి సమయంలో గుంపులుగా స్వైర విహారం చేస్తున్న శునకాలు ఆ మార్గంలో ఎవరైనా వస్తే దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయంలో వీధుల్లో ఒంటరిగా కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణాల్లో కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటామని పుర అధికారులుకు తెలిపారు.

# తేమ తగ్గితే బంగారమే..!

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 78.31 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు 41 జిన్నింగు మిల్లులను ఎంపిక చేశారు. నుంచి తెల్ల బంగారం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులే సీసీఐకి విక్రయించాలి. యాప్ గురించి పత్తి రైతులకు రైతువేదికల్లో ఏఈవోలు అవగాహన కల్పిస్తున్నారు.

తేమను బట్టి ధర: 8శాతం కాకుండా 9, 10, 11, 12శాతం తేమ ఉంటే సీసీఐ నిర్ణయించిన పింజ రకాలు, పొడవునుబట్టి ధర తగ్గుతూ వస్తుంది. పింజపొడవు (గింజ నుంచి పత్తిని వేరు చేసినప్పుడు వచ్చే దూది పొడవు)

మైక్రోనీర్ (గింజ నుంచి లాగినప్పుడు కనిపించే పత్తి సాంద్రత)

ప్రభుత్వం పత్తి కొనుగోలు సంబంధిత సేవలను పొందడానికి టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. సందేహాలున్న రైతులు 1800 599 5779 నెంబరుకు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

జిల్లాలో 9 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తెలిపారు. తిప్పర్తి మండలం రామలింగాలగూడెం సత్యనారాయణ కాటన్ ఇండస్ట్రీ, చండూరు బాలాజీ కాటన్ ఇండస్ట్రీ, చిట్యాల వరలక్ష్మి కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్-ఏ శ్రీలక్ష్మి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీ, మాల్-బి శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి-ఏ శివ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి-బి తిరుమల కాటన్ జిన్నింగ్ ప్రాసెసింగ్ మిల్, నకిరేకల్ శ్రీనాథ్ కాటన్ ఫైబర్, శాలిగౌరారం టీఆర్ఆర్ కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోలు జరుపుతారు.

చురకలు



## నీటి'బొట్టు'... జల'సిరి'కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రైయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

## ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి , మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850

ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20

యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు

చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

## రెండుచోట్ల తాగునీరు కలుషితం..

ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీ క్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# కన్నేసి.. కలిపేసి




హైదరాబాద్ :దుకాణ సముదాయాలకు కలిసొస్తుందని.. కొందరు అక్రమార్కులు దుండిగల్‌లో ఎస్టీ విద్యార్థులకు కేటాయించిన వసతిగృహ భూముల హద్దులు మార్చేశారు. రహదారికి సమీపంలో వాణిజ్య సముదాయాలుంటే కలిసొస్తుందన్న అంచనాతో ఎకరం భూమిని అక్రమించారు. కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది సాయంతో రోడ్డువైపున్న వసతిగృహం భూములు వెనక్కి జరిపారు. కొద్దిరోజుల క్రితం నాలుగు వైపులా ప్రహరీ నిర్మించారు. వారు కబ్జా చేసిన భూమి విలువ రూ.20 కోట్ల పైమాటే. ఎకరం స్థలంలో రోడ్డు వైపు 18 దుకాణాలు నిర్మించేందుకు వారు సన్నాహాలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భూమిలో గోడ నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**ఇలా తెలుసుకొని..**

గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ వైపు వెళ్లే మార్గంలో సర్వే నంబరు 120లో 158.23 ఎకరాల ప్రభుత్వ భూమిని దశాబ్దాల క్రితం మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధిత కుటుంబాలకు ఇచ్చారు. 91 ఎకరాలను పేదలకు ఇవ్వగా.. సాగుచేసుకోని కారణంగా 45 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో 2.25ఎకరాల భూమిని ఎస్టీ వసతి గృహం కోసం కేటాయించారు. నిధులు విడుదల కాకపోవడంతో స్థలం ఖాళీగా ఉంది. రోడ్డుకు సమీపంలో ఉండడంతో కొందరు కబ్జా చేసేందుకు నాలుగేళ్ల క్రితం ప్రయత్నాలు చేశారు. సాధ్యం కాకపోవడంతో రోడ్డుకు సమీపంలో నోటరీ పట్టాలున్న వ్యక్తులను కలిశారు. భూమిని ఇప్పిస్తామంటూ వారికి చెప్పారు. వారి స్థలాలను కొనుగోలు చేసినట్టు పత్రాలు సృష్టించారు. **అటూ.. ఇటూ మార్చారు..**

ఎస్టీ వసతి గృహానికి ప్రభుత్వం కేటాయించిన స్థలం రోడ్డువైపు ఉంది. రికార్డుల్లోనూ సర్వే నంబరు 120/11లో హద్దులు ఉన్నాయి. రోడ్డువైపు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రైవేటు వ్యక్తులు రెవెన్యూ అధికారులను సంప్రదించారు. హద్దులు మార్చితే ప్రతిఫలం ఇస్తామంటూ మాట్లాడుకున్నారు. నోటరీ దస్తావేజులున్న వారి అభ్యర్థన మేరకు కిందిస్థాయి రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది సర్వే చేశారు. భూమి హద్దులను గుట్టుచప్పుడు కాకుండా మార్చేశారు. రోడ్డు వైపున్న ఎకరం భూమిని తీసుకుని ప్రహరీ నిర్మించారు. ఎస్టీ సంక్షేమ అధికారులు వసతి గృహం నిర్మించేందుకు ముందుకొస్తే.. సర్వేనంబరు ప్రకారం 1.25 ఎకరాల భూమి మాత్రమే ఉంటుంది.

# కొంత మార్పు.. కొత్త రూపు




హైదరాబాద్: బృహత్‌నగరం డివిజన్ల పునర్విభజన గురువారం అధికారికంగా పూర్తయింది. డివిజన్ల హద్దులు, పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడంతో.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ గురువారం తుది నోటిఫికేషన్ ఇచ్చారు. దాంతోపాటు.. జోన్లు, సర్కిళ్ల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేస్తూ.. 12 జోన్లు, 60 సర్కిళు, వాటి పరిధిలోని డివిజన్ల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం జివో.ఎంఎస్.నెం.292ను విడుదల చేసింది. దాంతో.. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన డివిజన్ల పునర్విభజన, పరిపాలన సౌలభ్యం కోసం నూతన జోన్లు, సర్కిళ్ల ఏర్పాటు ప్రక్రియ అధికారికంగా పూర్తయినట్లయింది.

**మారిన పరిపాలన పటం**

పాత జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎల్బీనగర్, చార్మినార్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ పేర్లతో ఆరు జోన్లు ఉండగా.. పునర్విభజనలో పరిపాలన సౌలభ్యం కోసం.. కొత్తగా మల్కాజిగిరి, ఉప్పల్, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, కుత్బుల్లాపూర్ జోన్లను ఏర్పాటు చేశారు. కొన్ని పాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పేర్లను మార్చి.. ఆయా స్థానిక సంస్థల పరిధిలో ఏర్పాటైన డివిజన్లను కొత్త సర్కిళ్లుగా ఏర్పాటు చేశారు. కొత్త జోన్లలో కనిష్ఠంగా 4 సర్కిళ్లు, గరిష్ఠంగా ఏడు సర్కిళ్లు ఉన్నాయి.

జడ్సీలు వచ్చేశారు..

డివిజన్ల పునర్విభజన, జోన్లు, సర్కిళ్ల పునర్ వ్యవస్థీకరణను ఎంత వేగంగా పూర్తి చేశారో.. అంతే వేగంగా కొత్త జోన్లకు రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను జోనల్ కమిషనర్లు(జడ్సీ)గా నియమిస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

**యథాతథంగా పాలన**

కొత్త జోనల్ కమిషనర్లు వెంటనే బాధ్యతలు తీసుకుంటారని, పరిపాలన స్తంభించకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ 'ఈనాడు'తో తెలిపారు.

అభ్యంతరాలు పరిశీలించి

డివిజన్ల పునర్విభజనపై సుమారు రెండు వారాల పాటు జీహెచ్‌ఎంసీ అభ్యంతరాలు స్వీకరించింది. వాటిని పరిశీలించి.. పలు డివిజన్ల హద్దులు, పేర్లను సవరించింది.

ప్రస్తుత జీహెచ్‌ఎంసీ పరిధిలో పూర్తిగా, స్వల్పంగా భాగమైన జిల్లాలు 5, మండలాలు 47, గ్రామాలు 311, పార్లమెంటు స్థానాలు 6, అసెంబ్లీ స్థానాలు 28

పేరు మారిన డివిజన్లు: 30

హద్దులు మారినవి: 104

జోన్లవారీగా సర్కిళ్లు..

మల్కాజిగిరి: కీసర, అల్వాల్, బోయినపల్లి, మౌలాలి, మల్కాజిగిరి

ఉప్పల్: ఘట్‌కేసర్, కాప్రా, నాచారం, ఉప్పల్, బోడుప్పల్

ఎల్బీనగర్: నాగోల్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్

శంషాబాద్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్

చార్మినార్: సంతోష్‌నగర్, యాకుత్‌పుర, మలక్‌పేట్, చార్మినార్, మూసారాంబాగ్

గోల్కొండ: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్

ఖైరతాబాద్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్

సికింద్రాబాద్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

శేరిలింగంపల్లి: నార్సింగి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, మియాపూర్, శేరిలింగంపల్లి

కూకట్‌పల్లి: మాదాపూర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్

కుత్బుల్లాపూర్: చింతల్, జీడిమెట్ల, కొంపల్లి, గాజులరామారం, నిజాంపేట్, దుండిగల్, మేడ్చల్

# బుల్కాపూర్ నాలా భారీగా పూడ్చివేత



రాయదుర్గం : మణికొండ సరిహద్దుల్లో బుల్కాపూర్ నాలా.. నగరంలోని వివిధ ప్రాంతాలను ముంపు నుంచి కాపాడుతోంది. అలాంటి కీలక నాలాను సంరక్షించాల్సిన నీటి పారుదల శాఖ అధికారులే మట్టి పోసి చదును చేస్తున్నారు. అధికారుల అనాలోచిత చర్యలతో భవిష్యత్తులో ముంపు సమస్యలు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి నుంచి ఎక్కడికంటే.. శంకర్‌పల్లి బుల్కాపూర్ చెరువు నుంచి ప్రారంభమై గండిపేట కోకాపేట, మణికొండ, రాయదుర్గం, షేక్‌పేట హకీంపేట, ఫస్ట్ లాన్సర్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్‌సాగర్ వరకు నాలా ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రాంతాల్లో కబ్జాకు గురైంది. రాయదుర్గం, మణికొండ సరిహద్దులో కిలోమీటరు పొడవునా 50అడుగుల వెడల్పు ఉంటుంది. తాజాగా ఇక్కడే భారీగా మట్టి పోసి, చదును చేసి పది అడుగులకు తగ్గించారు. ఇక్కడ బాక్స్ డ్రైన్ నిర్మించాలని నిర్ణయించారు. ఓ చోట అడ్డంగా పైపులు వేసి మట్టిపోసి దారి ఏర్పాటుచేశారు. సమీపంలో ప్రైవేటు వెంచర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఇలా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పెరగనున్న ముంపు ముప్పు..

ఇప్పటికే భారీ వర్షాల సమయంలో నాలా పొంగి దిగువ ఉన్న పంచవటి కాలనీ ముంపునకు గురవుతోంది. పది అడుగులకు కుదిస్తే ముంపు ముప్పు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. విషయాన్ని నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నాలా పరిస్థితిని పరిశీలిస్తామన్నారు.

## ఇళ్లకు ఇసుక తిప్పలు

సూర్యాపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇసుక కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకం జిల్లాలో అమలు కావడం లేదు. లబ్ధిదారులకు సమాచారం అందించడంలో అధికారులు విఫలం అవుతున్నారు.జిల్లాలో 8,112 మందికి ఇందిరమ్మ ప్రొసీడింగ్‌లు అందించగా.. ఇప్పటి వరకు 6,892 మంది ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఒకేసారి పెద్ద మొత్తంలో నిర్మాణం ప్రారంభించడంతో ఇసుక కూడా అంతే మొత్తం అవసరం పడుతోంది. వీరితో పాటు ఇతరులు కూడా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. లబ్ధిదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, దూరభారాన్నిబట్టి ట్రాక్టర్ ఇసుకకు రూ.6500 నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. మరీ అత్యవసరమైతే రూ.10 వేలు తీసుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత తీర్చేందుకు మండలానికి ఓ ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. ఆ దిశగా అడుగులు పడటం లేదు. ప్రస్తుతం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, నాగారం, టేకుమట్ల నుంచి సరఫరా అవుతోంది. మిగతా ప్రాంతాల్లో తక్కువ ధరకు సరఫరా చేస్తున్నా...గోడల నిర్మాణానికి అది ఉపయోగపడటం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు.

సూర్యాపేటకు చెందిన ఓ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. రెండు నెలల క్రితం ఇంటి పనులను మొదలుపెట్టగా ప్రస్తుతం గోడల



వరకు పూర్తయింది. ఇప్పటి వరకు ట్రాక్టరుతో అయిదు ట్రిప్పుల ఇసుకను తోలించాడు. మొదట్లో కొరత పేరుతో ట్రిప్పునకు రూ.8 వేలు వెచ్చించాడు. ప్రస్తుతం సులువుగా లభిస్తుండటంతో రూ.6 వేల చొప్పున తోలిస్తున్నాడు. ఇప్పటి వరకు ఇసుకకే రూ.40 వేలు ఖర్చు చేశాడు. నిరీ?త స్థలంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి 35 మెట్రిక్ టన్నుల ఇసుక పరిమాణం అవసరమని అధికారులు అంచనా వేశారు. అందుకోసం ఒక్కో ఇంటికి పునాది, పిల్లర్లు, స్లాబు, గోడల నిర్మాణ దశల్లో ఎనిమిది ట్రాక్టర్ల ఇసుక సరఫరా చేయాలని నిర?యించారు. రీచ్‌ల వద్ద సొసైటీలకు నిరీ?త రుసుము, కిలో మీటరుకు రూ.5 చొప్పున లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది. ఉచిత ఇసుక కోసం మన ఇసుక-మన వాహనం యాప్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేయడం లేదా గృహ నిర్మాణ శాఖ ఏఈలకు ఇండెంట్ ద్వారా నిరీ?త సమయంలో ఇసుక సరఫరా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇళ్ల మంజూరు : 8112

పనులు ప్రారంభం: 4273

పునాదుల దశలో: 1980

ప్రహరీ: 762

స్లాబు: 924

పూర్తయ్యింది: 154

## వచ్చే సారథులు.. ఇదిగో వనరులు

రాజపేట : గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకుంది. మొదటి విడత ప్రచారం ముగియగా.. రెండు, మూడో విడతల్లో జరిగే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారం ముమ్మరం చేశారు. మరి కొద్ది రోజుల్లో పంచాయతీలకు నూతన పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. విజేతలైన వారికి పంచాయతీలకు అందుబాటులో ఉండే ఆర్థిక వనరులు ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండటం సహజం. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులే ప్రధానం. వీటితో పాటు సొంతంగా సేకరించే సాధారణ నిధులతో గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుంది.

**కేంద్ర ఆర్థిక సంఘం**

పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేస్తుంది. గ్రామ పంచాయతీలోని ఒక్కో వ్యక్తికి నెలకు రూ.80 నుంచి రూ.90 చొప్పున కేటాయిస్తుంది. ప్రతి మూడు మాసాలకు ఒకసారి, ఏడాదిలో నాలుగు విడతలుగా నిధులను అందజేస్తుంది.

**రాష్ట్ర ఆర్థిక సంఘం**

రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సైతం క్రమం తప్పకుండా మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇవి కూడా పంచాయతీలోని జనాభా




ప్రాతిపదికన ఇస్తారు. కొన్నాళ్లుగా ఇవి విడుదల కావడం లేదు. దీనికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు, విద్యుత్తు బిల్లులు చెల్లిస్తుండటం గమనార్హం.

**ఉపాధిహామీ పథకం ద్వారా**

గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. కూలీలు చేసే పనులకు 60 శాతం, మరో 40 శాతం నిధులు మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరు చేస్తారు. వీటితో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఇంకుడుగుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

**సాధారణ నిధులు**

గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే వాటిని సాధారణ నిధులకింద గుర్తిస్తారు. ఈ నిధులు పెంచుకోవడానికి పంచాయతీలు ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాల్సి ఉంటుంది.

**జిల్లా సమాచారం..**

మొత్తం గ్రామ పంచాయతీలు : 427

వార్డుల సంఖ్య : 3704

మొత్తం ఓటర్లు : 5,32,240

మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాలు : ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, ఆత్మకూర్(ఎం) బొమ్మలరామారం, తుర్కపల్లి

చురకలు


# అవిలాల.. నీటితో నింపాల

తిరుపతి : చెరువుల ఆధునికీకరణతో పర్యాటకులను ఆకర్షించడానికి తుడా శ్రీకారం చుట్టింది. తిరుపతి పరిసరాల్లోని 19, గూడూరులో మరో చెరువు అభివృద్ధి నిమిత్తం రూ.89 కోట్లతో ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది. ముందుగా అవిలాల చెరువును అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు.
రూ.50 కోట్లతో పనులు: చెరువును నీటితో నింపేందుకు 2.40 కి.మీ. నిడివితో 14 మీటర్లకు పైగా వెడల్పు, నాలుగు మీటర్లకు పైగా ఎత్తు ట్యాంక్‌బండ్ నిర్మించాలి. ఇందుకు ఇప్పటికే రూ.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. అయినా సప్లయ్ ఛానళ్లు పూడిపోవడం, అన్యాక్రాంతం కావడంతో నీరు చేరడం అసాధ్యంగా మారింది. సప్లై ఛానళ్లను మరమ్మతుకు రూ.కోటి ఖర్చవుతుందని అంచనా.




**అడ్డంకులు ఇలా..**
నగరాన్ని ఆనుకుని 200 ఎకరాల్లో విస్తరించిన చెరువులో ఇప్పటికే 20 ఎకరాలు అన్యాక్రాంతమైంది. ఆక్రమణలతోడు జాతీయ రహదారి నిర్మాణంతో 180 ఎకరాలే మిగిలింది. రెండు దశాబ్దాలుగా చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు చేస్తున్న యత్నాలు జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో అవి బెడిసి కొడుతున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న తుడా అందుకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనితాజాగా నిర్ణయించింది.

**శాశ్వత పరిష్కారం దిశగా..**
డా.ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, తుడా కార్యదర్శి
అవిలాల, పేరూరు చెరువులు నిండితే తిరుపతిలోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. సప్లయ్ ఛానళ్లను పునరుద్ధరిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అవిలాల ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది.

# ఆశయం వ్యర్థం.. తప్పదు అనర్థం

పుత్తూరు : ఈ-వ్యర్థాలు సేకరించి సురక్షిత పద్ధతిలో రీసైక్లింగ్ చేసేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ-వ్యర్థాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ కార్యక్రమం కోసం నగరాలు, పట్టణాల్లో అట్టహాసంగా ప్రారంభించిన సేకరణ కేంద్రాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు.. గతంలో సేకరించిన వ్యర్థాలను సైతం తీసుకెళ్లకుండా వదిలేశారు. దీంతో ఈ మహత్తర కార్యక్రమం ఆరంభ శూరత్వంగా మారింది. ఈ-వ్యర్థాల్లోని కాడ్మియం, క్రోమియం, లెడ్, ప్లాస్టిక్ సేకరించి సంపద సృష్టించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అందరి ఇళ్లలో ఈ- వ్యర్థాల ఉత్పత్తి పెరిగిపోయింది. అవి కాలుష్య కారకంగా మారడమే కాక వాటిలో విష కీటకాలు చేరి సమస్యలు నెలకొంటున్నాయి. ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేలా సేకరించి వాటిని రీసైక్లింగ్ చేసేందుకు కొన్ని ప్రైవేటు సంస్థలు ముందుకొచ్చాయి. ఈ క్రమంలో జిల్లాలోని నగర పాలికలు,



మున్సిపాలిటీల్లో వీటిని ఏర్పాటు చేశారు.


**తొలుత అక్కడక్కడ మెరుగ్గానే..**
ఈ కార్యక్రమం ఆరంభంలో నగర, పురపాలికలల్లో పాడైన టీవీలు, మిక్సీలు, కంప్యూటర్లు, చరవాణుల ఛార్జర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ కేంద్రాలకు అందజేశారు. కొద్దిరోజుల తర్వాత పౌరులు వాటిని తీసుకురావటం మానేశారు. యంత్రాంగం శ్రద్ధ చూపకపోవడంతో చెత్త సేకరణ సమయంలో వాటిని ఆ వాహనాల్లో వేసి డంపింగ్ యార్డులో వేస్తున్నారు. సరైన ప్రచారం లేక ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర మొక్కుబడిగా మారడంతో మంచి కార్యక్రమం నీరుగారింది. తిరుపతి జిల్లాలో ఇలా: తిరుపతి నగరపాలిక, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట ఇప్పటివరకు సేకరించిన ఈ-వ్యర్థాలు: నాలుగు టన్నులు

# చలించని యంత్రాంగం

తిరుపతి : రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు చలికి వణుకుతున్నారు. పాత భవనం.. గాలి, వెలుతురు నిమిత్తం ఏర్పాటు చేసిన కిటికీల నుంచి చొచ్చుకొచ్చే చల్లని గాలులతో రోగులు అల్లాడిపోతున్నారు. ఇనుప చువ్వలతో ఏర్పాటు చేసిన కిటికీలకు అద్దాల తెరలు కొన్ని చోట్ల లేకపోవడంతో చలిగాలి లోపలికి వచ్చేస్తోంది. ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి
రుయా ఆస్పత్రిలో సుమారు 1,200 మంది రోగులు ఇన్‌పేషంట్లుగా వైద్యం పొందుతున్నారు. వారికి తగ్గట్టుగా వైద్యం, పడకలు ఉన్నప్పటికీ.. మౌలిక వసతులు మాత్రం పురాతనమైనవి. మేల్, ఫిమేల్ సర్జరీ వార్డులు, ఎంఎం వార్డు, జనరల్ సర్జరీ వార్డులు, ఈఎస్‌టీ వార్డులకు ఇరువైపులా పైన వెంటిలేటర్లు ఉన్నాయి. అందులో నుంచి చల్లగాలి వస్తుండటంతో గజగజ వణుకుతున్నారు. ఎముకల విభాగం వార్డు వరండాలో మరో యూనిట్ ఏర్పాటు చేసి పడకలు వేశారు. అక్కడున్న ఇనుప చువ్వల కిటికీలకు అద్దాల తెరలు లేక చల్లని గాలి చొచ్చుకొస్తోంది. రెండో అంతస్తులో ఉన్న వార్డులోని రోగులు చలికి వణుకుతున్నారు. శ్వాసకోశ వ్యాధుల విభాగం వార్డు ప్రాంగణంలో ప్రత్యేకంగా ఉంటుంది. అసలే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న రోగులు చల్లని గాలులు పీల్చలేక మరింత అవస్థలు పడుతున్నారు. రోగుల సహాయకుల కోసం భవనం లేక ఆరు బయట చలిలో గడుపుతున్నారు. చిన్నపిల్లల విభాగం ఐసీయూ వార్డుల వెలుపల చిన్నారుల తల్లులు, బాలింతల పరిస్థితి దయనీయంగా ఉంది. బయట వరండాలో వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇటీవల భవనం పైకప్పు అమర్చినప్పటికీ.. చుట్టూ వచ్చే చల్లని గాలులతో ఇబ్బంది పడుతున్నారు. ప్రసూతి ఆస్పత్రి ఆరు బయట రోగుల సహాయకులు చలికి..వర్షానికి వణికిపోతున్నారు.

# మహా ఆశలు..చర్చంతా గ్రేటర్ తిరుపతిపైనే..



తిరుపతి : తిరుపతి మహానగరం దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయి. సీఎం చంద్రబాబు ఆదేశాలతో నగరపాలక కౌన్సిల్ ఆమోదించిన గ్రేటర్ ప్రతిపాదనలను ఈనెల 4న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం అమరావతికి దస్త్రం వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రేటర్ ఆలోచన ఆలస్యమైందని, ముఖ్యమంత్రి చొరవతో త్వరగా గ్రేటర్ ప్రకటన వెలువడాలన్న ఆశ జిల్లా వాసుల్లో కనిపిస్తోంది.

**అభివృద్ధి అవకాశాలు**
ఆధ్యాత్మిక నగరంగా ఉన్న తిరుపతిని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీగా ప్రకటించి చేయూతనిస్తుండటంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. వ్యాపార, వాణిజ్య, విద్య, ఉద్యోగ, ఉపాధి, పారిశ్రామిక, పర్యాటక, అధ్యాత్మిక అవకాశాలు అపారం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో వలసజీవుల సంఖ్య నానాటికీ పెరిగి ఇది మరింత పెరగనుంది. నగరంలో ఇళ్లు, ఇంటి స్థలాల లభ్యత కష్టతరంగా మారడంతో ఇప్పటికే 30 శాతం మంది శివారు, నగర పొలిమేరల్లోని పంచాయతీలకు తరలివెళ్తున్నారు. శివారు పంచాయతీల్లోని 95 శాతం మంది తిరుపతిలో వృత్తి, వ్యాపారం, ఉద్యోగం చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో యాత్రికుల సంఖ్య లక్షన్నరకు చేరనున్న నేపథ్యంలో 'గ్రేటర్' వసతులు తప్పనిసరి.

**ప్రతిపాదనలు ఇలా..**
ఇరుకు రోడ్లు, భవనాలతో నగర పరిధి విస్తరణే శరణ్యం అవుతోంది. తాజాగా తిరుపతి గ్రామీణ, రేణిగుంట, చంద్రగిరి, ఏర్పేడు, రామచంద్రాపురం మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలను కలుపుతూ 284 చ.కి.మీ. విస్తరణకు ప్రతిపాదించారు. హంద్రీనీవా, బాలాజీ రిజర్వాయర్, మల్లెమడుగు నీటి సరఫరా ఆలోచనలు కలిసిరానున్నాయి.

# చిక్కులకు చికిత్స.. వైద్యానికి రక్ష



ఆదోని : పశ్చిమ పల్లెలకు అత్యవసర చికిత్స అందాలంటే చిక్కులే. అపాయం తప్పించాలంటే.. వంద కి.మీ. ప్రయాణించాల్సిందే. ఆసుపత్రికి చేరుకునేలోగా దారిలోనే పలువురు మృత్యుఒడికి చేరిన ఘటనలెన్నో. ఇలాంటి చిక్కుముడులు విప్పేస్తూ.. ఆటంకాలను తప్పిస్తూ.. వైద్యవిద్య కళాశాల భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

**ప్రస్తుతం వంద కి.మీ. వెళ్లాల్సిందే**
ఆదోని డివిజన్ పరిధిలోని 17 మండలాలు.. 14 లక్షల మందికి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రే ఆధారం. వైద్యాలయంలో రోజువారీ ఓపీ 700-800, ఐపీ 30 వరకు ఉంటుంది. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, మెదడు, కాలేయ వ్యాధుల బారిన పడిన వారితోపాటు రహదారి, అగ్నిప్రమాదాలు, పురుగు మందు, పాము కాటు ప్రభావిత తదితర కేసులు.. నిత్యం 10-15 వస్తుంటాయి. వైద్య నిపుణుల కొరతతో పలువురిని ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు.
ఇక్కడి నుంచి మరో వంద కి.మీ. దూరంలోని కర్నూలు, 80 కి.మీ. దూరంలోని బళ్లారికి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో పలువురి ప్రాణాలు పోయిన ఘటనలున్నాయి.

**ఆధునిక సేవలు అందించేలా..**వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. పీపీపీ (పబ్లిక్-ప్రైవేటు-పార్ట్‌నర్) విధానంలో పనులు చేపట్టాలని భావించింది. హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ సంస్థ ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులు దక్కించుకుంది.
త్వరలో సంస్థ బృందాలు ఆదోనిలో పర్యటించి పనులు ముమ్మరం చేసే అవకాశం ఉంది.

**ఆర్భాటం చేసి వదిలేసిన వైకాపా**
వైద్య కళాశాల నిర్మాణానికి ఆదోని మండలం ఆరేకల్ గ్రామ సమీపంలో 167వ జాతీయ రహదారి పక్కనే 58.44 ఎకరాలను గత వైకాపా ప్రభుత్వం సేకరించింది. ఇందులో రూ.355.59 కోట్లతో ఎన్నికల ముందు హడావుడిగా ఆస్పత్రి, పరిపాలన విభాగం, వైద్య కళాశాల, విద్యార్థి, వైద్యుల వసతిగృహాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఏడాదిన్నరగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, రాష్ట్ర వాటా సర్దుబాటు చేయకపోవడం, ఇచ్చిన నిధులు ఇతరత్రా వాటికి మళ్లించడంతో వైద్య కళాశాల నిర్మాణంపై ప్రభావం చూపింది. భవన నిర్మాణం పూర్తికాక మునుపే వైద్య కళాశాలకు ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లను గత ప్రభుత్వం నియమించింది. వీరికి వసతి లేకపోవడంతో స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిని జీజీహెచ్‌గా మార్చి అందులోని గదులు కేటాయించింది. ఏడాదిపాటు తరగతులు లేకుండానే రూ.లక్షల జీతాలు చెల్లించింది. మరోవైపు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం ఆదోని కళాశాలను సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేసింది.

# పుర భవనం 14 ఏళ్ల కిందట పునాది



ఆళ్లగడ్డ : జిల్లాలో 14 ఏళ్ల కిందట అయిదు కొత్త పురపాలికలు ఏర్పాటు కాగా, వాటికి ఎక్కడా సొంత భవనాలు లేవు. దశాబ్దాలుగా పాత, అద్దె కార్యాలయాల్లోనే కొనసాగుతున్నాయి. ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, గూడూరు మున్సిపాలిటీలు 2011లో.. బేతంచెర్ల నగర పంచాయతీ 2020లో ఏర్పాటైంది. ఏదైనా పురపాలక సంఘాన్ని కొత్తగా ప్రకటిస్తే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. స్టార్టప్ గ్రాంట్స్ కింద ఒక్కో పురపాలి కకు రూ.2 కోట్లు మంజూరు చేస్తారు. ఇవి మంజూరైనా జిల్లాలో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలకు కొత్త భవనాలు నిర్మించలేదు. వేల జనాభాకు ప్రాతినిధ్యం వహించే పురపాలక సంఘాలు ఏళ్లు గడుస్తున్నా అసౌకర్యాలతో కొట్టుమిట్టాడు తున్నాయి.
సిబ్బందికి ఇబ్బందిఆళ్లగడ్డలో కొత్త భవనానికి 2017లో ప్రతిపాదనలు సిద్ధం చేయగా రూ.2.25 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేస్తే.. అంత మొత్తాన్ని ఇవ్వలేమని అప్పటి అధికారులు తేల్చి చెప్పేశారు. దీంతో కొత్త భవన నిర్మాణం ప్రతిపాదన మూలకు చేరింది. ఆళ్లగడ్డలో కౌన్సిల్ సమావేశ గది 9 అడుగుల వెడల్పు 20 అడుగుల పొడవుతో ఉంది. ఇక్కడ 27 మంది కౌన్సిల్ సభ్యులు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు, కమిషనర్, ఆరుగురు పురపాలక సిబ్బంది.. ఇలా కనీసం 10 నుంచి 20 మంది వరకు ఇతరులు హాజరవుతుంటారు. ఇంత చిన్న గదిలోనే అంతమంది కూడా ఇబ్బందిగా కూర్చొనే పరిస్థితులు నెలకొన్నాయి.
నందికొట్కూరులో కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. గూడూరులో కొత్త భవన నిర్మాణం ప్రారంభించినా అసంపూర్తిగా నిలిచిపోయింది.
కొరవడిన సమన్వయం
మేజరు పంచాయతీల నుంచి పురపాలికగా మారిన వెంటనే కొత్త శాఖలు అందుబాటులోకి వస్తాయి. రెవెన్యూ, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య, వీధి దీపాలు, మెప్మా, పట్టణ ప్రణాళిక, తాగునీరు, గృహ నిర్మాణం ఇలా పలు విభాగాలు ఉంటాయి.
ఇవేవీ లేకపోవడంతో పాత కార్యాలయాల్లోనే ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. స్టార్టప్ గ్రాంట్లలో వచ్చిన రూ.2 కోట్లలో రూ.50 లక్షలతో కొత్త కార్యాలయం నిర్మించాలి. 14 ఏళ్ల కిందట విడుదలైన ఈ డబ్బులకు ప్రస్తుతం కొత్త భవనం నిర్మించడం సాధ్యం కాదు. కనీసం రూ.4 కోట్లు నుంచి రూ.5 కోట్ల నిధుల అవసరం ఉంది.

# మంగలేటీ.. 'భూ'తాల లూటీ

నంద్యాల : రెండు కార్ల పంటలకు సాగునీటిని అందించే కాల్వ ఆక్రమణకు గురైంది. ఏళ్లుగా కొద్దికొద్దిగా ఆక్రమణలకు గురవుతూ రావడంతో చివరకు కాల్వ రూపు కోల్పోయే దుస్థితి నెలకొంది. భారీ వర్షం వస్తే కాల్వ పొంగిపొర్లి పొలాలను ముంచడంతోపాటు ఏకంగా గ్రామమే మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది.

**200 ఎకరాల ఆక్రమణ**
నారాయణపురం పరిధిలో 605, 606, 608, 612, 614, 615 తదితర సర్వే నంబర్లలో 17 మీటర్ల వెడల్పుతో మంగలేటి కాల్వ ఉంది. 1996 నుంచి వెలుగోడు రిజర్వాయరు ద్వారా తెలుగుగంగ కాల్వలకు నీటి విడుదల ప్రారంభమైంది. దీంతో పంట పొలాలకు 'కళ' వచ్చింది. మంగలేటి కాల్వకు కూడా అప్పటి నుంచే సాగునీటి విడుదల జరగ్గా.. కాల్వ ఆక్రమణకు గురవుతూ వచ్చింది. ప్రస్తుతం కాల్వ వెడల్పు మూడు మీటర్లు మాత్రమే ఉంది. దీంతో నిర్దేశిత పరిమాణంలో నీటిని తీసుకోలేకపోతోంది. 5 కి.మీ.ల పొడవునా కాల్వ వెంట ఆక్రమిత భూమి విస్తీర్ణం 200 ఎకరాల వరకు ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

**9 కి.మీ. పొడవునా..**
తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి బండిఆత్మకూరు మండలం నారాయణపురం, సంతజూటూరు, చిన్నదేవళాపురం తదితర గ్రామాలకు 'కృష్ణా' వెనుక జలాలను అందించేందుకు 'మంగలేటి కాల్వ' ఉంది. టీజీపీ ప్రధాన కాల్వ నుంచి సంతజూటూరు వరకు 9 కి.మీ. పొడవునా ఈ



కాల్వ ఉంది. ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం గ్రామం వరకు 5 కి.మీ.ల పొడవునా కాల్వ ఆక్రమణకు గురైంది.

**నారాయణపురం జల దిగ్బంధం**
మంగలేటి కాల్వ ఆక్రమణలతో సాగునీరు విడుదల సమయంలో కాల్వ పొంగి పొర్లుతుంది. ఇదే సమయంలో భారీ వర్షం కురిసినా.. తుపాను సమయంలో కాల్వ పోటెత్తి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. సమీపంలోని నారాయణపురం గ్రామాన్ని దిగ్బంధం చేస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. తాగునీరు కలుషితం అవుతుంది. ఇక్కడి ప్రజలు ఇలా ఇబ్బందులు పడడం రెండు దశాబ్దాలుగా సాధారణంగా మారిపోయింది.

**పొలాలకూ దెబ్బ**
తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం మీదుగా సంతజూటూరు వరకు 9 కి.మీ.ల పొడవునా మంగలేటి కాల్వ ప్రవాహం ఉంది. నారాయణపురంతోపాటు సమీప గ్రామ పొలాలు దెబ్బతింటున్నాయి. గ్రామానికి చెందిన 300 ఎకరాల పంట పొలాలు భారీ వర్షాల సమయంలో మునిగి రైతులు నష్టపోతున్నారు. గతనెల మొంథా తుపానుతో గ్రామంతోపాటు పొలాలు మునిగాయి.

# జామాయిల్ సాగు.. లాభాలు బాగు

తాళ్లూరు : రైతులు ఎంతో ఆశతో సాగు చేపట్టిన జామాయిల్ పంట ప్రస్తుతం కనక వర్షం కురిపిస్తోంది. నీటి వసతి తక్కువగా ఉండడం, పెట్టుబడులు పెట్టి పంట సాగుకోసం అధిక శ్రమను చేయలేని రైతులు జామాయిల్ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

**జిల్లా పరిధి గ్రామాల రైతులు కూడా..**
తాళ్లూరు, విఠలాపురం, కొత్తపాలెం, బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం, తదితర గ్రామాల రైతులతోపాటు జిల్లా పరిధిలోని చీమకుర్తి, మద్దిపాడు, ముండ్లమూరు, దర్శి, టంగుటూరు, జరుగుమల్లి, సంతనూతలపాడు, తదితర మండ లాల పరిధిలో విస్తారంగా సాగులో ఉంది. పెట్టుబడులు చాలా తక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు పట్ల అసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లా పరిధిలో సుమారు నలభైవేల ఎకరాల్లో సాగవుతోంది. తొలి ఏడాదిలో కేవలం రూ.20వేలు వంతునే పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. తదుపరి రెండేళ్లలో అవసరమైనమేర శ్రమతో పంటను కాపాడుకోవడంతో ప్రస్తుతం కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కో ఎకరాలో సాగు ఖర్చులు, కౌలు, ఇతరత్రా పెట్టుబడులన్నీ కలిపి మొత్తం రూ. 50వేలమేరకు రైతులు ఖర్చు చేశారు. గత రెండు, మూడేళ్ల కాలంలో గిట్టుబాటు ధరలు దక్కక రైతులు ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం ఊహించిన రీతిలో పుష్కలంగా లాభాలు వస్తుండడంతో ఆనందంగా ఉన్నారు.

**భూముల స్థితిగతుల ఆధారంగా..**
ఒక్కో ఎకరాలో రైతుల భూముల స్థితిగతులు ఆధారంగా 25 నుంచి 40 టన్నుల వరకూ దిగుబడులు వస్తున్నాయి. సరాసరిగా 25 టన్నుల మేరకు అధిక మంది రైతులు దిగుబడులు సాధించ గలిగారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు టన్ను ధర రూ.ఐదువేల వంతున రైతులకు చెల్లిస్తున్నారు. కూలీలకు అవుతున్న ఖర్చులు, వాహనాల బాడుగలు, ఇతరత్రా ఖర్చులు పోగానే ఆమేర ధరలు దక్కుతున్నాయి. దీంతో ఎకరాలో రూ. 1,25,000ల వరకూ వస్తుండగా పెట్టుబడులు పోగా నికరాదాయం రూ. 75 వేలుపైగా దక్కుతోంది. ఇతర పంటలు దెబ్బతిని నష్టాలను చవిచూసి ఆందోళనలో ఉన్న రైతాంగానికి సుబాబుల్ పంట బాగా ఊరటనిస్తోంది.

# బిందు సేద్యం.. మొక్కకు ప్రాణం

కంభం : సాగును ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను రాయితీపై అందజేస్తోంది.

**రాయితీలు ఇలా...**ఎస్సీ, ఎస్టీల్లో 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు వంద శాతం, ఇతర చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలు కలిగిన మధ్య తరగతి రైతులు 90 శాతం, 10 నుంచి 12.5 ఎకరాలు కలిగిన పెద్ద రైతులకు 50 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి భూమి పత్రాలు (పాస్ పుస్తకాలు), ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో, బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ నంబర్‌తో సంప్రదించాలి. రైతు వాటా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయినప్పటికీ, అర్హులైన రైతులు ముందుకు వస్తే ఏడాది పొడవునా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు మంజూరు చేస్తామని గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారి శ్వేత తెలిపారు. లక్ష్యం... 10 వేల హెక్టార్లు జిల్లా వ్యాప్తంగా 2025-26 ఏడాదికి 10 వేల హెక్టార్లలో బిందు సేద్య పరికరాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటి వరకూ సగం లక్ష్యం కూడా పూర్తి చేయలేదు. 4805 హెక్టార్లకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. మరో 5194 హెక్టార్లకు బిందు సేద్యం పరికరాలు అందజేయాల్సి ఉంది. నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు.

# సర్కారు భూమిపై కబ్జాదారుల కన్ను

కదిరి : కదిరి పట్టణ పరిధిలో భూముల ధరలు అమాంతం పెరగడంతో కబ్జాదారుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి. కదిరి రెవెన్యూగ్రామం బేరిపల్లికాలనీ సమీపంలోని సర్వేనంబరు 268లో దాదాపు 15సెంట్ల స్థలాన్ని అక్రమార్కులు రాత్రికి రాత్రే చదును చేశారు. బాహ్యవలయ రహదారికి ఆనుకుని ఉన్న ఈస్థలం మీదుగా దేవరచెరువు నుంచి పంట పొలాలకు నీరందించే కాలువను గట్లను ధ్వంసం చేసి భూమిని చదును చేసేశారు. జాతీయ రహదారి 42కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో సెంటు భూమి ధర 10 లక్షల వరకు పలుకుతోంది. పదిహేనుసెంట్ల భూమి కోటిన్నర రూపాయల పైమాటే. పట్టణానికి సమీపంలోనే ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నా రెవెన్యూ అధికారులు దృష్టికి రాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణదారుల పట్ల అధికారులు కఠినచర్యలు తీసుకోని కారణంగానే పెట్రేగిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. బేరిపల్లి వద్ద పొలాలకు



వెళ్లేదారి నుంచి ఉన్న నీటికాలువ వరకు ఉన్న స్థలంపై కన్నేసిన కబ్జాదారులు రాత్రివేళల్లో పొక్లెయిన్ సాయంతో చదును చేసేశారు.

**తగిన చర్యలు తీసుకుంటాం: మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి**

ప్రభుత్వభూమిని చదును చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులను గుర్తించాలని గ్రామ రెవెన్యూ అధికారికి సూచించా. భూమి అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి.. తగిన చర్యలు తీసుకుంటాం.

# ఇరుకు గదుల్లో.. పసిమొగ్గలు మగ్గిపోవాలా?

పాలకొల్లు మండలం వాలమర్రులో 159వ నంబరు అంగన్‌వాడీ కేంద్రం ఇది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణం చేపట్టగా తరువాత వచ్చిన వైకాపా సర్కారు పనులను పూర్తి చేయడంలో వివక్ష చూపింది. దీంతో అసంపూర్తి భవనంలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.మార్టేరు, అత్తిలి, పాలకొల్లు గ్రామీణ, పోడూరు, బాలల సమగ్ర వికాసానికి బాటలు వేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు వైకాపా పాలనలో ప్రాభవం కోల్పోయాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను విస్మరించడంతో పాటు కొత్తగా ప్రారంభించిన పనులకు సైతం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక శాతం కేంద్రాలు అద్దె గదుల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

రూ.13.5 లక్షల అంచనా వ్యయంతో మూడేళ్ల క్రితం చేపట్టిన పెనుమంట్ర-3 అంగన్‌వాడీ భవన నిర్మాణం ఇలా అసంపూర్తిగా మిగిలింది. 2023 జూన్‌లో ఈ నిర్మాణాన్ని పరిశీలించిన అప్పటి కలెక్టర్ ప్రశాంతి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోవడంతో చిట్టడవిని తలపిస్తోంది.

**ఇదీ పరిస్థితి..**

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,626 కేంద్రాలు ఉండగా వీటిలో 600 వరకు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. వీటికి పట్టణ పరిధిలో నెలకు రూ.6 వేలు, గ్రామాల్లో అయితే రూ. 2 వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. గతంలో తెదేపా, వైకాపా ప్రభుత్వాల హయాంలో చేపట్టిన 82 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. పెనుగొండ మండలం ములపర్రులో 166వ నంబరు కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నిధులను నిలిపేసింది. పెనుగొండలోని 135వ నంబరు కేంద్రానిదీ ఇదే పరిస్థితి. ఈ మండలంలో 71 కేంద్రాలకు గాను 25 అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి.అత్తిలి, ఇరగవరం మండల్లాలోని ఈడూరు, కంతేరు, ఏలేటిపాడు గ్రామాల్లో భవన నిర్మాణాలను నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే వదిలేశారు.

పోడూరు మండలం జిన్నూరు శివారు భూపయ్యచెరువులో నిర్మించిన భవనానికి గుమ్మాలు, పైపులైన్ల ఏర్పాటు, విద్యుదీకరణ పనులు చేయించాల్సి ఉంది. ఈ మండలంలో మూడు భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. భవన నిర్మాణాల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు.

# మూడున్నర కోట్లు మురగబెట్టారు


ఏలూరు: 17వ లోక్‌సభలో ఏలూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన వైకాపా ఎంపీ కోటగిరి శ్రీధర్ ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని, లోక్‌సభ రద్దయ్యే నాటికి కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులను పూర్తిగా వెచ్చించలేకపోయారు. నిధులు ఖర్చు చేసే విషయంలో ఆయన ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో మిగిలిపోయిన నిధులే అందుకు నిదర్శనం. ఖర్చుకాకుండా రూ.3.76 కోట్లు మిగిలిపోయాయి. ఈ నిధులను ప్రస్తుత 18వ లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేశ్‌కుమార్ వినియోగించొచ్చు.గ్రామాల్లో సామాజిక భవనాలు, పట్టణ, గ్రామీణంలో రహదారుల నిర్మాణాలు, క్రీడావసతుల కల్పనకు, మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు, ఆసుపత్రుల అభివృద్ధికి, పొలాల బాటలకు, కొల్లేరు గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణాలకు ఖర్చుపెట్టుకోవచ్చు. జిల్లాలో రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అయినా నిధులు ఖర్చు చేయలేదంటే ఎంపీకి చిత్తశుద్ధి కొరవడమే కారణమని చెప్పాలి. ఆయా పనులకు ఎంపీ ఆమోదం తెలపగానే జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో)కి ప్రతిపాదనలు పంపితే మంజూరు పత్రాలు జారీ చేస్తారు. అధికారులు టెండర్లు పిలిచి వాటిని పూర్తి చేయాలి. అయితే 52 పనులకు కనీసం టెండర్లు పిలవలేదు. వాటి విలువ రూ.3.76 కోట్లు. గతంలో ఎంపీ శ్రీధర్ ప్రతిపాదించిన ఈ పనులు రద్దయిపోయాయి. ప్రస్తుత ఎంపీ ప్రతిపాదిస్తేనే టెండర్లు పిలిచి ప్రారంభిస్తారు.

5 ఏళ్లలో రూ.22.66 కోట్ల పనులు..

కోటగిరి శ్రీధర్‌కు ఎంపీలాడ్స్ కింద మొత్తం 251 పనులకు రూ.22.66 కోట్లు కేటాయించగా ఈ ఏడాది నవంబరు నాటికి 193 పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాటి విలువ రూ.17.60 కోట్లు. ఈ బిల్లులు మంజూరు చేశారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. అవి పలు దశల్లో ఉన్నాయి. చింతలపూడి నియోజకవర్గంలో అత్యధిక పనులకు కేటాయింపులు జరిపారు. ఏలూరు నగరంతో సహా పలు చోట్ల నిర్మించిన సామాజిక భవనాల వ్యయం పెరిగి పనులు పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఎంపీ లాడ్స్ నిధులు రూ.22.66 కోట్లు
పనుల సంఖ్య: 251
పూర్తయినవి 193
వెచ్చించిన వ్యయం రూ.17.60 కోట్లు
ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు 6
వెచ్చించాల్సిన వ్యయం రూ.1.29 కోట్లు

# పునాదుల్లో వదిలేశారు.. పూర్తయ్యాక మేల్కొన్నారు..



తిరుపతి : తిరుపతిలోని న్యూ మారుతీనగర్‌లో ఇటీవల నిర్మిస్తున్న ఆరు అంతస్తుల భవనమిది. ఇంకా పనులు పూర్తి కాకముందే సున్నం వేసి నగరపాలిక రెవెన్యూ విభాగాన్ని సంప్రదించి పన్ను కూడా వేసుకున్నారు. ఇప్పుడు ప్రణాళిక విభాగం అధికారులు వచ్చి నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మించారని గోడలపై బీపీఎస్ అని రాశారు. ఇలా ఈ ఒక్క భవనమే కాదు.. నగరంలో సుమారు 3 వేల ఇళ్లను గుర్తించి బీపీఎస్ అని రాస్తున్నారు. నగరంలో ఎన్జీవో కాలనీలో ఓ భవనం అదనపు అంతస్తు నిర్మించారని ఇటీవల ప్రణాళిక విభాగపు అధికారులు గుర్తించారు. సిబ్బందితో వెళ్లి సెలవు రోజున పైఅంతస్తును కూల్చివేశారు. యజమాని బీపీఎస్ కోసం దరఖాస్తు చేసినా.. ఖాతరు చేయకుండా కూల్చేయడంతో ఆయన రూ.15లక్షల నష్టపోవాల్సి వచ్చింది. ఈ రెండు ఉదాహరణలే తిరుపతి నగరపాలిక పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుకు అద్దంపడుతున్నాయి. అక్రమ భవనాల విషయంలో తీసుకుంటున్న చర్యలు సరైనవే అయినా.. పునాదుల దశలో గుర్తించకుండా.. పూర్తయ్యాక రంగంలోకి దిగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమ భవనాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రభుత్వం వీటి విషయంలో కఠినంగా వ్యవహరిస్తుండటంతో ఇప్పుడు కూల్చివేతలు, బీపీఎస్ కోసం పరుగులు పెడుతున్నారు. అప్పుడు మామూళ్లు తీసుకొని.. ఇప్పుడు కూల్చివేతలు చేపట్టడంతో యజమానులు తలలు పట్టుకుంటున్నారు. పునాదుల దశలో భవన నిర్మాణదారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ములో 10 శాతం తమకు ఇస్తే నిరభ్యంతరంగా ఇళ్లు కట్టుకోవచ్చని ఏమార్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ఆ అధికారి కనుసన్నల్లోనే..**తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు, ఉద్యోగులు ఒక మాఫియాగా మారి దందాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరంలో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న భవనాలు, నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేయకుండానే అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య భవనాల నిర్మాణాలు శరవేగంగా జరిగిపోయాయి. అప్పటి నేతలు, కార్పొరేటర్ల అనుమతితో వేల సంఖ్యలో అనధికారిక భవనాలు వెలిశాయి. ఈ వ్యవహారంలో అప్పట్లో పనిచేసిన ఓ పట్టణ ప్రణాళికాధికారి మాఫియాకు సారథ్యం వహించినట్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనపై విచారణకు ఆదేశించి బదిలీ చేశారు. అయినా తన కంచుకోటను కాపాడుకోవడానికి తనకు అనుకూలంగా ఉన్న అధికారుల్ని నగరపాలికకు రప్పించుకుని సాగిస్తున్నట్లు చెబుతున్నారు.

# వంద ఎకరాల్లో దివ్య వృక్షాలు



తిరుమల : తితిదే ఆలయాలతో పాటు దేశవ్యాప్తంగా నిర్మించే ఆలయాలకు ధ్వజస్తంభాలు, రథాల నిర్మాణం కోసం అవసరమైన దివ్య వృక్షాలు పెంచడానికి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యులు ఈ ప్రాజెక్టును తీర్మానించి ఆమోదించారు. దేశంలో తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా దివ్య వృక్షాల పెంపకాన్ని తితిదే ప్రారంభించనుంది.

**పరీక్షలు చేసి**

పలమనేరులోని తితిదే గోశాల ప్రాంగణం ఐదు వందల ఎకరాలు ఉంది. ఈ ప్రాంతం వృక్షాలు పెంచడానికి అనువైందా? కాదా? అని గుర్తించేందుకు అటవీశాఖ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. అన్ని విధాలా ఇది అనుకూలమైనదని తేలడంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. మొదట వంద ఎకరాల్లో వీటిని నాటనున్నట్లు అధికారులు తెలిపారు.

**శాస్త్రీయంగా..**ప్రస్తుతం తితిదే పెంచనున్న దివ్య వృక్షాలను ఆధ్యాత్మిక, జ్యోతిష విధానాలకు అనుగుణంగా ఎంపిక చేస్తారు. ధ్వజస్తంభాల కోసం టేకు, అగిశ లేదా ఇండియన్ కినో, టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను పెంచుతారు.. ఇవి నిటారుగా, బలంగా, ఎక్కువ కాలం ఉండే స్వభావం కలిగి ఉంటాయి.

**తగ్గిపోతున్న వృక్ష సంపద**

ప్రస్తుతం అడవుల్లో ధ్వజస్తంభం ఏర్పాటు చేసేందుకు అవసరమైన వృక్షాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని అడవుల్లో ఉన్నా వాటిని తీసుకురావడం కష్టంగా ఉంది. పెరిగిన భవన నిర్మాణ అవసరాలకు వృక్షాలను పెద్దయెత్తున వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీవారి ఆలయంతో పాటు తితిదే పరిధిలోని 60కి పైగా ఉన్న ఆలయాల అవసరాలకు వీలుగా ఈ వృక్షాల పెంపకాన్ని చేపట్టనుంది.

# నగర వనాలతో ఆహ్లాదం.. ఆనందం



కదిరి : బడలికకు విశ్రాంతి.. ఒత్తిడికి ప్రశాంతత.. వారాంతాల్లో ఆనందంగా గడపటానికి ఆహ్లాదం ఎంతో అవసరం. అలాంటి వాతావారణాన్ని కల్పించేందుకు అటవీశాఖ నగరవనాలను (ఎకో పార్కులు) ఏర్పాటు చేస్తోంది. ఇందుకు నువైన ప్రదేశాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లాలో బుక్కపట్నం అటవీ రేంజీ పరిధి అమగొండపాళెంలో నగరవనం పూర్తయి అందుబాటులోకి తీసుకొచ్చారు. మరో నాలుగు నగరవనాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇందులో కదిరి సమీపంలోని బట్రేపల్లి జలపాతం వద్ద, పెనుకొండ, పరిసర ప్రదేశాల్లో మూడు చోట్ల ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.2 కోట్లతో వందల ఎకరాల్లో..**

జిల్లాలోని ఒక్కో నగరవనానికి (ఎకో పార్కు) రూ.2 కోట్లు అంచనా తయారు చేశారు. ఒక్కోదానికి రూ.1.40 కోట్లు విడుదల కాగా పనులు చేపట్టారు. బట్రేపల్లి అటవీ ప్రాంతంలో సుమారు 125 ఎకరాల విస్తీర్ణంలో పార్కు పనులు చేస్తున్నారు. అంతేస్థాయిలో పెనుకొండ ప్రాంతంలో నగరవనాలను తీర్చిదిద్దుతున్నారు. కదిరిలో శ్రీఖాద్రీశుడు వెలసిన ఆధ్యాత్మిక కేంద్రంతోపాటు యోగివేమన, తిమ్మమ్మమర్రిమాను, బట్రేపల్లి జలపాతం పరిసర ప్రాంతాలు చారిత్రక, పర్యాటక ప్రాంతాలుగా ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయల పాలనకు కేంద్రమైన పెనుకొండ చారిత్రక ప్రదేశం. ఇక్కడ నగర వనాలు యాత్రికులు, సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచనున్నాయి.

**వసతులివీ..**అటవీ ప్రాంతంలో చుట్టూ దట్టంగా పచ్చని వృక్షాలు. ఆకర్షణీయమైన స్వాగత ద్వారం నిర్మిస్తున్నారు. వనమంతా చూసేలా వ్యూ పాయింట్, వాచ్ టవర్, లోపలికి వెళితే చుట్టూ కంచెతో కొలనులో నీటి వసతి, కాటేజీలు, పగొడసాస్, ఫుడ్‌కోర్టులు, మలమూత్ర విసర్జనశాలలు, నడక దారులు, ఆకర్షించేలా అందమైన మొక్కలు, పిల్లలకు ఆటస్థలంతో ఆహ్లాదం, ఆనందం పొందేలా వసతులు కల్పిస్తున్నారు.**వేసవికల్లా అందుబాటులోకి తెస్తాం : చక్రపాణి, జిల్లా అటవీశాఖాధికారి**జిల్లావ్యాప్తంగా నాలుగు ఎకో పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే సుమారు 60 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. వేసవి ప్రారంభానికల్లా వాటిని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంతో అందరికీ అనందం పంచుతాం.

# పసివాళ్లు.. శుద్ధినీరందక వెక్కిళ్లు

ఆళ్లగడ్డ : అంగన్‌వాడీల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సురక్షిత జలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం శుద్ధజల యంత్రాలను(వాటర్ ప్యూరిఫయర్) అందించింది. వీటిలో కొన్ని పనిచేయక పోగా, మరికొన్ని నీటి వనరులు, పైప్‌లైన్ నిర్మాణం, నీటి ట్యాంకులు లేకపోవడంతో వృథాగా మారాయి. 'సక్షం' పథకంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సొంత భవనాలున్న 246 అంగన్‌వాడీ కేంద్రాలకు శుద్ధజల యంత్రాలను నాలుగు నెలల క్రితం మంజూరయ్యాయి. మరమ్మతులు, నిర్వహణ లోపించడంతో యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి.

**అనారోగ్యం పాలవకుండా..**

కలుషిత తాగునీటితో టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటరైటిస్, కామెర్లు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నీటిలో ప్రమాదకరమైన క్రిములను, అపరిశుభ్రతను దూరం చేసేందుకు శుద్ధజల యంత్రాలను వినియోగించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు బాలింతలు, గర్భిణులు శుద్ధజలం అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపై ఉంది. సక్షం పథకంలో భాగంగా నాణ్యమైన యంత్రాలు ఇచ్చినా నిరుపయోగంగా మారాయి.

**ముగింపు దశకు వచ్చినా..**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సక్షం పథకాన్ని 2021లో అమల్లోకి తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమం గడువు వచ్చే ఏడాదితో ముగియనుంది. గడువు ముగింపు దశకు వచ్చినా ఇప్పటికీ కనీసం



80 శాతం కేంద్రాల్లో యంత్రాలు పనిచేయక పోవడం గమనార్హం. దీతో లబ్ధిదారులకు సురక్షిత జలం అందని స్థితి నెలకొంది. సక్షం పరిధిలోని రాని కేంద్రాల్లో శుద్ధజలం ఎండమావిగానే మిగిలింది.

ఆళ్లగడ్డ మండలం జి.జంబులదిన్నెలో కేవలం ఒకటిన్నర సెంటు విస్తీర్ణం ఉన్న శిథిల భవనంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. శుద్ధజల యంత్రం, ఆండ్రాయిడ్ టీవీ, ఆట వస్తువులు మంజూరైనా వసతి సరిగా లేకపోవడతో పక్కన పెట్టేశారు.

ఆళ్లగడ్డ మండలం శాంతినగరం, ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నె, సర్వాయిపల్లె, అల్లూరు, మాయలూరు కేంద్రాలకు యంత్రాలు మంజూరైనా ట్యాంకులు లేకపోవడం, నీటి గొట్టాల కనెక్షన్ పూర్తి లేకపోవడంతో వీటి సేవలు అందడం లేదు. దొర్నిపాడులో మూడు కేంద్రాలు ఉన్నా తాగు నీటి సేవలు అందడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రాలు: 3,558
బాలింతలు, గర్భిణుల సంఖ్య: 70,766
చిన్నారులు: 2,33,921
సక్షం కేంద్రాలు: 246

# వృద్ధులంటే చౌక.. బియ్యం ఇవ్వకుండా ధోకా

కర్నూలు: 65 ఏళ్ల వయో వృద్ధులు.. దివ్యాంగులు.. నడవలేని వారికి రేషన్ సరకులు ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని ప్రభుత్వం చెబుతోంది. నెలనెలా డీలర్లు తమ పరిధిలోని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకొని బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలర్ల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత కారణంగా ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పండుటాకులకు కష్టాలు తప్పడం లేదు. నవంబరు ముగిసినా వీరిలో సగం మందికే రేషన్ పంపిణీ చేశారు. డిసెంబరు 1 నుంచి సాధారణ రేషన్ పంపిణీ మొదలైనా తమను మాత్రం పట్టించుకోవడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,437 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులైన కార్డుదారులు 1,02,015 మంది ఉన్నారు.

వీరికి ప్రతినెలా 25 నుంచి నెలాఖరు వరకు ఇంటి వద్దే సరకులు పంపిణీ చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఇది సవ్యంగా అమలు కావడం లేదు.డిసెంబరు 2వ తేదీ నాటికి ఉమ్మడి జిల్లాలో 58,278 మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేశారు. 43,737 మందికి ఇప్పటికీ ఇవ్వలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో గత్యంతరం లేక వృద్ధులే చౌకదుకాణాలకు వెళ్లి సరకులు తెచ్చుకుంటున్నారు.

నగదు అంటగడుతున్నారు



అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెల గడిచిపోయినా వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ ఇవ్వకుండా.. బియ్యానికి బదులు నగదు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చాలామంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకొని కిలోకు రూ.10 చొప్పున డబ్బులు ఇస్తున్నారు. మాకు డబ్బు వద్దు బియ్యమే కావాలంటే మాత్రం చౌకదుకాణాల వద్దకు రావాలని చెబుతున్నట్లు వృద్ధులు వాపోతున్నారు. కొందరు డీలర్లు ఒకటో తేదీ తర్వాతనే చౌకదుకాణాల వద్ద సరకులు పంపిణీ చేస్తున్నారు. అదీ రెండ్రోజులే. తర్వాత వెళ్తే బియ్యం అయిపోయాయని తిప్పి పంపుతున్నారు. వారికి రాజకీయ నేపథ్యం ఉండటంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు.సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన ఈ వృద్ధురాలి పేరు లక్ష్మీదేవమ్మ. రేషన్ కార్డులో ఈమె ఒక్కరే ఉన్నారు. ఒక్కనెల కూడా డీలరు తమ ఇంటి వద్దకు వచ్చి సరకులు ఇచ్చింది లేదని ఈమె చెబుతున్నారు. బియ్యం తెచ్చుకునేందుకు ఈమె అష్టకష్టాలు పడుతూ.. పాత సాయిబాబా థియేటర్ సమీపంలోని 87వ చౌకదుకాణానికి వెళ్లారు. ఈ-పోస్ యంత్రంలో వేలిముద్రలు వేశారు. ఈమెకు 5 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలరు మాత్రం బియ్యం లేవని చెప్పారని.. బియ్యానికి బదులుగా రూ.50 చేతికిచ్చారని ఈమె చెబుతున్నారు. అంతదూరం నుంచి ఉసూరుమంటూ తిరుగుముఖం పట్టారు.

# కదలని వరద.. వదలని బురద

పత్తికొండ : గుంతకల్లు-గుంటూరు రైల్వే లైను వెంట ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎల్‌సీ గేట్లు తొలగించారు. వాటి స్థానంలో అండర్ పాస్‌లు నిర్మించారు. గుత్తేదారులు నిబంధనలు పాటించలేదు. వరద నీరు వెళ్లడానికి కాల్వలు సరిగా నిర్మించలేదు. దీంతో పెద్ద ఎత్తున నీరు నిలుస్తోంది.. ఏటా ఎనిమిది నెలలపాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. విధిలేక రైతులు వరద నీటిలోనే వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

మద్దికెర- చిప్పగిరి గ్రామాల మధ్య రైతులు పొలాలకు వెళ్లేందుకు రూ.2 కోట్లు వెచ్చించి అండర్‌పాస్ నిర్మించారు. చిప్పగిరి, కుందనగుర్తి, ఆలూరు, నేమకల్లు తదితర గ్రామాలకు దగ్గరి దారి కావడంతో వెళుతుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది.

**ఎక్కడ ఎలా ఉందంటే**

చిప్పగిరి మండలం గుమ్మనూరు-దేగులహాల్ గ్రామాల మధ్య అండర్ పాస్ (లోలెవల్ వంతెన) నిర్మించారు.. పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ ఉంటోంది..

మద్దికెర వద్ద రెండు అడుగుల ఎత్తులో నిర్మించడంతో నీరు వెళ్లడం లేదు.. మద్దికెర వద్ద రెండుచోట్ల, అగ్రహారం వద్ద 2, యడవలి, పెరవలి, హంప తదితర గ్రామాల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది.

మద్దికెర-చిప్పగిరి ప్రధాన రహదారిలో నిర్మించిన వంతెనలో వర్షం కురిసిన సమయంలో 4 మీటర్ల మేర నీరు నిలుస్తోంది. దీంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లే అవకాశమే లేకుండా పోయింది.

80 కి.మీ. రూ.100 కోట్లు

ఒక్కోదానికి పొడవు, వెడల్పు ఆధారంగా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు వెచ్చించారు. మొత్తం నిర్మాణాలకు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేశారు. మద్దికెర- డోన్ మధ్య ఐవో డబ్ల్యూ, ఐవోడబ్ల్యూ పరిధిలో 25 శాశ్వత అండర్‌పాస్‌లున్నాయి. 80 కి.మీ. మేర రైల్వే ట్రాక్



వెంట నిర్మించిన భూగర్భ వంతెనల్లో నీరు నిలుస్తోంది.

అండర్ పాస్‌లు 6 మీటర్ల ఎత్తు, 5 మీటర్ల వెడల్పు చొప్పున నిర్మించారు. వర్షపు నీరు వెళ్లడానికి వీలుగా సమాంతరంగా కాల్వలు తవ్వాలి. వరద నీరు ప్రధాన కాల్వ వరకు వెళ్లేలా మార్గం సుగమం చేయాలి. చాలాచోట్ల కొంత వరకు తవ్వి వదిలేశారు.. 20-30 మీటర్ల వరకు సమాంతర కాల్వ తవ్వి అక్కడ చిన్నపాటి గుంత తీశారు. నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది.

**వంతెన దాటాలంటే కష్టమే**

కిష్టన్న, రైతు, మద్దికెర

నాకున్న మూడెకరాల పొలంలో వాము పంట సాగు చేశా. 20 రోజులుగా పొలానికి వెళ్లే మార్గంలోని రైల్వే వంతెనలో నీరు నిలుస్తోంది. అండర్‌పాస్‌లో నీరు తగ్గిందని వెళ్తే ద్విచక్ర వాహనం నిలిచి పోయింది. సైలెన్సర్‌లోకి నీరు చేరడంతో బండి స్టార్ట్ కావడం లేదు. దీంతో వెనక్కు తోసుకుంటూ వచ్చా. వేలాది మంది రైతులు ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్నారు.

# వసతి పర్యవే'క్షీణం'

కర్నూలు : డోన్ బాలుర కళాశాల వసతిగృహంలో ఈనెల 7న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో వసతిగృహ అధికారిణి అక్కడ లేరు. ఆమె గతేడాది వరకు ప్రీమెట్రిక్ వసతిగృహానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. అక్కడ రెగ్యులర్ అధికారిని నియమించారు. ప్రస్తుతం చూస్తున్నది ఒక హాస్టల్ బాధ్యతలే అయినాసరే సరిగా పర్యవేక్షణ చేయడం లేదన్న విమర్శలున్నాయి.

బీసీ వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 52 వసతి గృహాల్లో 9,729 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 38 చోట్ల సంక్షేమాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో అధికారి రెండు వసతిగృహాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీన్ని అవకాశంగా తీసుకొని నిధులు బొక్కేస్తున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి**

నిబంధనల ప్రకారం సమీపంలోని వసతిగృహ అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. లేదా సమీపంలోని ఎస్సీ వసతిగృహ అధికారికీ ఇవ్వొచ్చు. ఎవరూ అందుబాటులో లేకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతంలోని వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుంది. సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లో చేరిన వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించకూడదు. వసతిగృహ అధికారులు రెగ్యులర్‌గా పనిచేస్తున్న చోట ఉదయం, ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న హాస్టల్‌లో సాయంత్రం వేళ ఎఫ్‌ఆర్‌ఎస్ వేయాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టించుకోవడం లేదు. 30 నుంచి 40 కి.మీ దూరంలోని వసతిగృహాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో పర్యవేక్షణ భారంగా మారుతోంది. అంతదూరం వెళ్లలేక పనిచేసే సిబ్బందిపైనే నిర్వహణ భారం మోపి చేతులు దులిపేసుకుంటున్నారు. విద్యార్థులకు సరైన మెనూ అమలుకావడం లేదు.

**వసూళ్ల పర్వం**

ఆలూరు కళాశాల వసతిగృహంలో ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 వసూలు చేశారంటూ తహసీల్దారుకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. కర్నూలులోని బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పనిచేస్తున్న రాజేశ్వరి అక్రమాలకు పాల్పడటంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆరు నెలల తర్వాత నందికొట్కూరు బాలికల కళాశాల వసతిగృహ అధికారిణిగా పోస్టింగ్ ఇచ్చారు. కొంత కాలానికే ఆమెకు బ్రాహ్మణకొట్కూరు ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు కట్టబెట్టారు. ఆదోని కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేస్తున్న అజీంకు మంత్రాలయం ప్రీమెట్రిక్ వసతిగృహ ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఆదోని నుంచి మంత్రాలయానికి సుమారు 40 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం వెళ్లి పర్యవేక్షించాలంటే కష్టమైనా అధికారులు దృష్టి సారించడం లేదు.

పత్తికొండ కళాశాల వసతిగృహ అధికారికి మద్దికెర ప్రీమెట్రిక్ వసతిగృహ అధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈయన కర్నూలు కళాశాల వసతిగృహ అధికారిగా పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడి సస్పెండయ్యారు. ఇలాంటి వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వకూడదన్న నిబంధనలు చెబుతున్నాయి.

# ఇక నూతన పంచాయతీలు



చిత్తూరు: పంచాయతీల పునర్ వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.. 30 ఏళ్లుగా ఉన్న పల్లె ప్రజల కల సాకారమయ్యే అవకాశం వచ్చింది.. దీంతో కొత్త పంచాయతీల ఏర్పాటుకు మార్గం సుగమమైంది.. వచ్చే ఏడాది ఏప్రిల్ రెండో తేదీ నాటికి పాలకవర్గాల గడువు తీరనున్న నేపథ్యంలో పాత వాటితో పాటు కొత్తవాటికి ఎన్నికలు నిర్వహించనున్నారు.

**ప్రతిపాదనలు ఇలా..**

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుంటారు. ప్రజల వినతుల స్వీకరణతో పాటు కొత్త వాటికి ప్రతిపాదనలు కోరుతూ జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీవోలకు ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 20వ తేదీ లోగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీ చేశారని డీపీవో సుధాకర్‌రావు తెలిపారు.

జిల్లాలోని పంచాయతీలు: 696

స్పెషల్ గ్రేడ్: 4

గ్రేడ్-1: 61

గ్రేడ్-2: 214

గ్రేడ్-3: 417

ఇవీ మార్గదర్శకాలు..

ప్రస్తుత పాలకవర్గాలు తీర్మానం చేయాలి.

మండల పరిధిలోనే మార్పులు చేస్తారు.

మండలానికి చెందిన శివారు పంచాయతీని మరో మండలంలో కలపడం వేరు చేయడం కుదరదు.

పాలకవర్గాలు లేని పంచాయతీల్లో ప్రత్యేకాధికారి గ్రామసభ ద్వారా తీర్మానిస్తారు.

ఆయా తీర్మానాలను ఉన్నతాధికారులకు అందజేయాలి.

# వేళకు ఎగిరేనా..?




రేణిగుంట : తిరుమల శ్రీవారి దర్శనార్థం విమానాల్లో వచ్చే భక్తులకు ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలతో నిర్ణీత సమయానికి దర్శన స్లాట్లు బుక్ చేసుకున్నవారు సకాలంలో చేరగలమా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చేవారిలో ముందుగానే స్లాట్ బుక్ చేసుకునే వారితో పాటు సిఫార్సు లేఖలు, శ్రీవాణి టికెట్లు పొందిన వారూ ఉంటున్నారు. విమానాల రాకపోకల్లో జాప్యం వారిని ఒత్తిడికి గురిచేస్తోంది. ఇటీవలే డీజీసీఏ పైలెట్లు సహా ఇతర సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విమానాల రాకపోకల సమయాల్లో మార్పులు చేసింది. ఇండిగో సంస్థపై ఈ ప్రభావం పడి సమస్య ఉత్పన్నమైందని నిపుణులు చెబుతున్నారు.

**ఇటీవలి ఘటనలు పరిశీలిస్తే..**


హైదరాబాద్ నుంచి రేణిగుంటకు రోజూ రాకపోకలు సాగించే ఇండిగో విమానం ఉదయం 179 మందితో హైదరాబాద్ వెళ్లే సమయంలో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. ఇంధన లీకేజీతో సర్వీసు రద్దు చేశారు. సాయంత్రం ముంబయి విమానంలో హైదరాబాద్ తరలించారు. ఇందుకోసం ముంబయి సర్వీసు రద్దు చేశారు.

విజయవాడకు వెళ్లే బెంగళూరు - రేణిగుంట ఇండిగో విమానం మంగళవారం సాయంత్రం ఆలస్యంగా నడిచింది.

బుధవారం నుంచి ఏర్పడిన ఇబ్బందులతో ఆ రోజు రాత్రి ఏడు గంటలకు ఇక్కడికి రావాల్సిన విమానం రాత్రి 10 గంటలకు చేరుకుంది.

ఇండిగో సంస్థకు చెందిన విమానాలన్నీ ఆలస్యంగా నడవడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# కాస్త దృష్టి పెడితే.. కా'పాడి'నవారవుతారు



ఎస్‌ఎన్‌పాడు : జిల్లా పాడి రైతుల వెన్నుదన్ను జిల్లా పాల డెయిరీ. అలాంటి డెయిరీ విషయంలో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో మూత పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గాడిలో పెడుతుందని అంతా ఆశతో ఎదురుచూశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కేవలం సమావేశాలు, పరిశీలనలతోనే కాలం వెళ్లదీస్తోంది. వైకాపా ప్రభుత్వం డెయిరీ భారాన్ని మోయలేక 2021లో అమూల్ సంస్థ డెయిరీని పూర్తిగా మూసేసింది. అప్పటి నుంచి డెయిరీ తెరుచుకున్న దాఖలాల్లేవు. ప్రస్తుతం డెయిరీలోని సామగ్రి పూర్తిగా తుప్పుపట్టడంతో పాటు కొన్ని చోరీకి గురయ్యాయి.

జిల్లా పాల డెయిరీని గాడిలో పెట్టాలని జిల్లా ఉన్నతాధికారులు పాడి రైతులు, అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో డెయిరీని తిరిగి గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎన్‌డీడీబీకి కేటాయించాలనే ప్రతిపాదన సైతం తీసుకొచ్చారు. నాబార్డు నుంచి నిధులు కేటాయించాలనేది మరో ప్రతిపాదన. వీటికి సంబంధించి డెయిరీ అధికారుల వద్ద నివేదికలు సైతం ఉన్నతాధికారులకు అందజేశారు. దీనిపై జిల్లా మంత్రులు సైతం చర్చించారు. డెయిరీ సమస్య మాత్రం కొలిక్కి రాలేదు. కొద్దిరోజుల కిందట కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఫెడరేషన్ ఎండీ సైతం డెయిరీ మొత్తం పరిశీలించారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి పంపాలని అధికారులకు ఆదేశించినా ఇంతవరకు ఎలాంటి చర్యల్లేవు.

**రూ.55 కోట్లు అవసరం**

డెయిరీ సందర్శనలో ఫెడరేషన్ ఎండీ తొలుత 50 వేల లీటర్లతో పాల సేకరణ చేపట్టి పాలు, పెరుగు తయారు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. డెయిరీని తిరిగి గాడిలో పెట్టేందుకు అత్యవసరంగా రూ.10 కోట్ల వరకు అవసరం కాగా, రూ.45 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే దెబ్బతిన్న, తుప్పుపట్టిన సామగ్రిని తిరిగి అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు సుమారు రూ.5 కోట్లు, ఇతర నిర్వహణ ఖర్చులకు రూ.5 కోట్ల వరకు కేటాయించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పాల డెయిరీని తెరిపించాలని రైతులు కోరుతున్నారు.

# స్వచ్ఛ సేవలకు.. ఈ-ఆటోలు

కుప్పం : స్వచ్ఛ కుప్పం సాధన దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్త, వ్యర్థాలను సేకరించనున్నారు. దీనిలో భాగంగా ఈ ఆటోలను పంపిణీ చేశారు.

**గత పాలనలో మూలకు..**

పారిశుద్ధ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇళ్ల నుంచి నేరుగా చెత్త, వ్యర్థాలు సేకరించాలని గతంలోనే ప్రభుత్వం ఆలోచన చేసింది. గత తెదేపా కాలంలో ఎనిమిదేళ్ల క్రితం కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాలకు బ్యాటరీ ఆటోలు సమకూర్చారు. సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైకాపా వచ్చాక ఆటోలు మూలకు చేరాయి. కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని పంచాయతీల్లో వాహనాలు విక్రయించేశారు. తర్వాత మూడు చక్రాల సైకిళ్లు అందజేసినా వినియోగించలేదు.

**'కడా' తరఫున అందజేత..**

సీఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలకు ఈ-ఆటోలు 112 సమకూర్చారు. పాత వాహనాలతో పాటు వీటిని వినియోగించనున్నారు. రోజూ సేకరించే చెత్తను కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయనున్నారు. గ్రామాలకు రోజూ ఉదయం వాహనాలు వెళ్లి చెత్త



సేకరిస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

**ఇవీ వివరాలు..**

కుప్పం నియోజకవర్గం: మండలాలు: 4

పంచాయతీలు: 97అందజేసిన

ఈ ఆటోలు: 112 (శాంతిపురం- 23, కుప్పం గ్రామీణ- 29, పురపాలిక- 19, రామకుప్పం- 23, గుడుపల్లె- 18 )

# కమీషన్ల 'కాటా'.. మామూళ్ల వేట

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సరకు తీసుకొచ్చినప్పటి నుంచి ఇంటికెళ్లే వరకు అడుగడుగునా మోసపోతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసి రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు దోపిడీలో పాలుపంచుకుంటున్నారు.

**పీడిస్తున్న హమాలీలు**

ఒక సంచిని వాహనం నుంచి కిందకు దింపినందుకు రైతులు హమాలీ ఛార్జీ రూ.5.04 చెల్లించాలి. లైసెన్స్‌డ్ హమాలీలు వాహనం నుంచి సరకు కిందకు దింపాలి. కానీ మార్కెట్‌లో లైసెన్స్‌డ్ హమాలీలకు బినామీలుగా చలామణి అవుతున కార్మికులు సరకును కిందకు దింపుతున్నారు. ఛార్జీలకు అదనంగా డ్రైవర్ మామూళ్లు, హమాలీలు రూ.300 నుంచి రూ.500 వరకు, అదే లారీలో సరకు తీసుకొస్తే రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు.

**రూ.2 కోట్లకుపైగా వసూలు**

విపణికి నిత్యం చిన్న, పెద్ద వాహనాలు 500 వరకు వస్తుంటాయి. ప్రస్తుతం ఉల్లి వాహనాలే 300 వరకు ఉన్నాయి. మామూళ్ల పేరుతో



రైతుల నుంచి వసూలు చేసే అదనపు మొత్తమే రూ.1.50 లక్షల వరకు ఉంటుంది. సీజన్‌లో 6 నెలల వ్యవధిలోనే రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు రైతుల నుంచి పిండుకుంటున్నారు.

**పచ్చి సరకు పేరుతో..**

క్వింటాకు రూ.2 చొప్పున రైతులు కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. ఉల్లి పంటకు మాత్రం క్వింటా రూ.4 చొప్పున కమీషన్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది.

ఉల్లి పచ్చి సరకని గతంలో మార్కెట్ కమిటీ ఈ మేరకు ఛార్జీలను నిర్ణయించింది. ఈ కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

**తూకాల్లోనూ మోసాలు**

మార్కెట్ యార్డులో తూకాల్లో మోసాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ యంత్రాలతో అనుసంధానం చేయడం లేదు. ఫలితంగా మోసాలు జరుగుతున్నాయి. కొందరు కమీషన్ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో ముందస్తుగానే క్వింటాకు 2 నుంచి 4 కిలోల వరకు మైనస్‌లో పెట్టేస్తున్నారు.

బయట తూకం వేసే క్రమంలో అంతా సరిగానే ఉన్నట్లు కనిపిస్తుండటంతో రైతులు మోసాలను పసిగట్టలేకపోతున్నారు.

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలకు ఈ-పోస్ పరికరాలను అనుసంధానం చేస్తే ఈ-నామ్‌లో కచ్చితమైన తూకం ఉంటుంది. మార్కెట్‌లో మాత్రం ఇది అమలు కావడం లేదు.

**ఈ-పోస్.. ఉష్**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా ఈ-పోస్ యంత్రాలను సమకూర్చుకోవడంపై అధికారులు దృష్టిపెట్టడం లేదు. రూ.2- 3 లక్షలు వెచ్చిస్తే పాడైన ఈ-పోస్ యంత్రాలకు మరమ్మతులు చేయించొచ్చు. లేదా కొత్తవి కొనుగోలు చేయొచ్చు.

ఈ-నామ్ అమలైనప్పటి నుంచి ఇక్కడ ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసిన దాఖలాలు లేవు. ఇవి అందుబాటులో ఉంటే మార్కెట్ కమిటీ అధికారులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, కాటాదారుల దోపిడీకి అవకాశం ఉండదు. ఇవి లేకుంటేనే రోజువారీగా ముడుపులు ముడుతుంటాయి. అందుకే ఈ-పోస్ యంత్రాలతో తూకాలు వేసే పద్ధతిని పక్కన పెట్టేశారు.

# గనుల దారుల్లో ఘోరీలు

డోన్ : ఖనిజ గ్రామాల్లో 'దారి'ణంగా మారాయి. వాహనాలు అధిక బరువుతో ఖనిజాలు తీసుకెళ్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. మోకాలి లోతు గుంతలు, రహదారులపై కడ్డీలు తేలి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. డోన్, బనగానపల్లి నియోజకవర్గాల పరిధిలో గనులెక్కువ. జిల్లా పరిధిలో వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. ప్రత్యేకించి నాపరాళ్లు, ఇనుప ఖనిజం, సిలికా, క్వార్జ్, డోలమైట్ గనులు ఉన్నాయి. ఇక్కడ ముడి ఖనిజాన్ని తీసి పరిశ్రమలకు తరలిస్తారు. పౌడర్, సిమెంటు పరిశ్రమలకు కావాల్సిన ముడిసరకును వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి తీసుకొస్తారు. ఇక్కడ తయారైన సిమెంటు, పౌడర్‌తోపాటు నాపరాయి, పాలిష్ బండలను దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.ప్యాపిలి నుంచి బనగానపల్లి మార్గంలో ఓ సిమెంటు పరిశ్రమకు సంబంధించి నిత్యం వంద వరకు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. 52 కి.మీ. మేర దూరం ఉన్న ఈ రహదారి ప్యాపిలి నుంచి గార్లదిన్నె వరకు చాలాచోట్ల దెబ్బతింది. ఈ రోడ్డుపై 35 నుంచి 40 టన్నుల బరువుతోనే వాహనాలు వెళ్లాలి.. కానీ 55 నుంచి 65 టన్నుల వరకు తీసుకెళ్తున్నారు. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా మారింది.

**నిధులు మళ్లించిన వైకాపా**

గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలు, రోడ్లు తదితర పనులకు వినియోగించుకోవాలి.గత వైకాపా ప్రభుత్వంలో డీఎంఎఫ్ నిధుల వినియోగానికి అవరోధాలు ఎదురయ్యాయి. డబ్బుల వినియోగంపై ఆంక్షలు పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు మంజూరైనా అప్పటి ప్రజాప్రతినిధులు ఇతర ప్రాంతాలకు మళ్లించారు. 'కూటమి' ప్రభుత్వం చక్కదిద్దాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే**కోవెలకుంట్ల-మయలూరు మార్గంలో చెన్నైకు సిమెంట్ లారీలు వెళ్తుంటారు. అధిక సామర్థ్యంతో ముడిసరకును తీసుకెళ్తుండటంతో రహదారి బాగా దెబ్బతింది. ప్యాపిలి-బనగానపల్లి మార్గంలో గార్లదిన్నె వద్ద అధ్వానంగా మారింది. వెంగళాంపల్లె గ్రామ సమీపంలో గుంతలు పడి కంకర తేలింది. వెంకటాపల్లె, ఎన్.రంగాపురం వద్ద రహదారిపై కడ్డీలు తేలాయి.పసుపల గ్రామ సమీపంలోనూ రహదారి పలుచోట్ల గుంతలు పడింది. యాగంటిపల్లె, పాతపాడు సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.బేతంచెర్ల నుంచి సిమెంటునగర్ మీదుగా తమ్మరాజుపల్లెకు వెళ్లే రహదారిలో 6.5 కి.మీల దారి పలుచోట్ల దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# అండగా ఉంటాం.. అడ్డంగా కట్టేయ్!

చిత్తూరు : భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు నిర్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్)కు మార్గదర్శకాలు వెలువడక మునుపే ప్రజాప్రతినిధుల అనుచరుల పైరవీలు, అధికారుల సహకారంతో పట్టణాల్లో అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. బీపీఎస్ అమలుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనుంది. 2025 ఆగస్టు 31కి మునుపు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలకు ఈ పథకం వర్తిస్తుంది. సెప్టెంబరు 19న బీపీఎస్‌కు మంత్రివర్గ ఆమోదం లభించాక పట్టణాల్లో అదనపు అంతస్తుల నిర్మాణం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 300పైగా భవనాలు అనుమతులకు విరుద్ధంగా, అసలు అనుమతులే లేకుండా నిర్మించినట్లు సమాచారం. పట్టణాల శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోంది.

**ఫోన్ చేయిస్తూ.. నిర్మిస్తూ..**

చిత్తూరు నగరపాలక సంస్థ కావడంతో.. ఇక్కడ భవన నిర్మాణ అనుమతులకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములు రూ.లక్షల్లో ఉండటంతో



యజమానులు రాజకీయ నేతలతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. ప్రభుత్వానికి ఫీజులు ఎగ్గొట్టి యథేచ్ఛగా అదనపు అంతస్తుల్ని నిర్మిస్తున్నారు.

**నగరంలో ఎక్కడెక్కడంటే..**

నగరంలో ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా, రీడ్స్‌పేటలో, లక్ష్మీనగర్‌కాలనీలో నిర్మిస్తున్న కొన్ని భవనాల్లో అదనపు అంతస్తులకు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. మురకంబట్టులో రెండు భవనాలు, మిట్టూరులో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతుల్లేవని సమాచారం. ఉడిపి హోటల్ సమీపంలోని ఓ భవనంలో ఓ అంతస్తును అక్రమంగా నిర్మిస్తున్నారు. కాసులు అందితే చాలు.. ఎలాంటి నిర్మాణాలైనా చేసుకోండంటూ నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో ఇద్దరు ఇన్‌ఛార్జి భవన ఇన్‌స్పెక్టర్లు భవన యజమానులకు సూచిస్తున్నట్లు సమాచారం. పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు హైరోడ్డు, గాంధీరోడ్డు విస్తరణ పనుల్లో తలమునకలై ఉండగా.. కిందిస్థాయి సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారు. కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం: శుభప్రద, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ–2, చిత్తూరు

బీపీఎస్ పథకానికి విరుద్ధంగా నిర్మించే అదనపు అంతస్తుల్ని నియంత్రించడానికి చర్యలు చేపడతాం. ఇదే అంశంపై వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

# దారులు పూడ్చేసి.. నిధులు ఊడ్చేసి

నంద్యాల : హంద్రీ నీవా సుజల ప్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) కాలువ నుంచి ఎక్కువ నీటిని తరలించడంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులు రైతుల పాలిట శాపంగా మారింది. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా నీటిని తరలించేందుకుగాను తొమ్మిది ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా, చిత్తూరు జిల్లాకు సైతం నీటిని తరలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3,850 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించి కాలువ విస్తరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మొదట్లో గుత్తేదారుడికి పనులు అప్పగించారు. 1వ కి.మీ. నుంచి 9వ కి.మీ. వరకు పూడిక తొలగించారు. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమైంది.

**తవ్వి.. ఇష్టానుసారంగా పడేసి..**

నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు–వడ్డెమాను మధ్య హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాల్వలో పూడికతీత పనులు ఈ ఏడాది మొదట్లో ప్రారంభించారు. 9 కి.మీ. పొడవునా తీసిన పూడిక మట్టిని కొంత కాల్వ గట్టుపైనే వేశారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని జలవనరుల శాఖకు చెందిన రిజర్వు స్థలంలో వేయాలి. అది దూరంగా ఉండటంతో



కాలువలో నుంచి తీసిన పూడికను ఎక్కడికక్కడ వేసుకుంటూ వెళ్లిపోయారు. రైతులు పొలాలకు వెళ్లే మార్గంలోనూ వేశారు. వాహనాలు, ఇంధనం ఖర్చు కలిసివస్తుందన్న ఉద్దేశంతో గుత్తేదారుడు ఇష్టానుసారంగా పడేశారు. పొలాలకు వెళ్లే మార్గంలో అడ్డుగా వేయడంతో వడ్డెమాను గ్రామానికి చెందిన 100 ఎకరాలకు దారి కరవైంది. ప్రస్తుతం దిగుబడులు తీసుకెళ్లే మార్గం లేక రైతులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**అదనపు వ్యయం**

పొలాలకు వెళ్లే దారులకు అడ్డుగా పూడిక మట్టి వేయడంతో దీనిని తొలగించేందుకు రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనిపై జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమే. కాలువ వెంబడి పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పూడిక మట్టి వేయడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి.

# గుంతల దారి.. పడతారు జారి

నందికొట్కూరు : రహదారుల నిర్మాణాన్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేయించలేదు. ఫలితంగా ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ, పీఆర్ గ్రామీణ రహదారులు రూపు కోల్పోయాయి.మరమ్మతులు చేయక..నందికొట్కూరు–పగిడ్యాల బీటీ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ఒక్క వాహనం వెళ్లాలంటేనే ఇరుకుగా ఉంటుంది. ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందులే. నందికొట్కూరు–బ్రాహ్మణకొట్కూరు కేజీ (కర్నూలు–గుంటూరు) మార్గం మీదుగా ఓర్వకల్లు పారిశ్రామికవాడకు పైపులైను ఏర్పాటుచేస్తున్నారు. పనులు పూర్తి చేసినా రోడ్డుకు మరమ్మతులు చేయకుండా అలానే వదిలేశారు. రూ.2 కోట్లు కేటాయించినా..నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మిడుతూరు నుంచి గార్గేయపురం వెళ్లే రహదారి 15 కి.మీ. ఉంది. ప్రారంభం నుంచి చివరి వరకు అడుగడుగునా గోతులే. ఈ రహదారి మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి.

# తెగుళ్లు, ధరలు.. దానిమ్మతో దిగాలు



తాడిమర్రి : సరిగ్గా నెల రోజుల క్రితం విపణిలో దానిమ్మ మంచి ధరలు పలికాయి. టన్ను రూ.1,35,000 నుంచి 1,50,00 వరకు అమ్ముడయ్యాయి. దీంతో సాగు చేసిన రైతులు ఎంతో సంతోషపడ్డారు. రెండు నెలలపాటు ధరలు స్థిరంగా ఉంటాయని అందరూ ఆశపడ్డారు. వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. వాతావరణంలో మార్పుల కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. ఎంతలా అంటే టన్ను ఏకంగా రూ.70 వేలకు పడిపోయింది. అది కూడా కాయకు ఎటువంటి మచ్చలు లేకపోతే, పెద్ద పరిమాణంలో ఉంటేనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 18 వేల ఎకరాల్లో దానిమ్మ పంట సాగులో ఉంది.

**చీలికలు.. మచ్చలు**

సాధారణంగా దానిమ్మ పంటకు నీటి శాతం తక్కువగా ఉండాలి. ముఖ్యంగా కోతకు వచ్చే సమయంలో నీటిని ఎక్కువగా వినియోగించరు. వాతావరణం పొడిగా, సూర్యరశ్మి ఉంటే...కాయల పరిమాణం బాగా వృద్ధి చెందుతుంది. వారం రోజులుగా ముసురు, చిరుజల్లుల కారణంగా కాయలకు తెగులు వ్యాపిస్తోంది. బ్లైట్ అనే తెగులుతో కాయకు మచ్చపడి సగానికి చీలుతోంది. ఆంత్రాక్నోస్ సోకితే మచ్చలు ఎక్కువగా పడుతున్నాయి. దీన్ని సకాలంలో గమనించకపోతే తోటంతా వ్యాపించి రైతులకు కోలుకోని దెబ్బస్తుంది. మార్కెట్‌లో దొరికే పురుగు మందులను పిచికారీ చేసి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. తెగులు సోకిన కాయలను రైతులు తొలగించేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాయలు నాణ్యంగా లేవని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. గతంలో ఒప్పందం చేసుకున్న వారు అప్పటి ధర చెల్లించలేమంటున్నారని రైతులు వాపోతున్నారు. దిగుబడి ఉంటే, ధరలు ఉండవు... మంచి ధరలున్నప్పుడు దిగుబడి ఉండటం లేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి**

చెన్నై, బెంగళూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున దానిమ్మ ధరలు తగ్గాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కొద్ది రోజుల్లోనే ధరలు పెరుగుతాయని అంటున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బ్లైట్, ఆంత్రాక్నోస్ తెగుళ్ల నివారణకు కార్బన్డజిమ్ ఒక గ్రాము, ఎం45 అనే మందు 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చంద్రశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా ఉద్యాన శాఖాధికారి

# అనుమతి గోరంత.. దోపిడీ కొండంత!



పుట్టపర్తి: ప్రగతి పేరుతో ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా ధ్వంసం చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తూ పరోక్షంగా తోడ్పాటునందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. వందల ఏళ్లనాటి కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు ఇస్తుంది. గుత్తేదారులు నాణ్యమైన రహదారులు నిర్మించాల్సి ఉంటుంది. నిధులు మిగిలించుకునేందుకు కొందరు అక్రమ దారులు ఎంచుకుంటున్నారు.

జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నల్లమాడ వద్ద జరుగుతున్న పనులకు అవసరమైన నాణ్యమైన ఎర్రమట్టి కోసం గుత్తేదారు సంస్థ రెవెన్యూ, గనులశాఖలకు దరఖాస్తు చేసుకుంది. నల్లమాడలో సర్వే నంబరు 1368లో 2.45 ఎకరాల్లో 25వేల మెట్రిక్ టన్నుల వరకు తవ్వుకోవడానికి తాత్కాలిక అనుమతి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం సదరు సంస్థ రాయల్టీ ఛార్జీల కింద రూ.3.25 లక్షలు చెల్లించింది. మట్టిని బెంగళూరు– విజయవాడ ఎకనమిక్ కారిడార్‌లోని వానవోలు నుంచి వక్రకుంట వరకు జరుగుతున్న పనులకు వాడాలని తాత్కాలిక అనుమతి పత్రంలో పేర్కొన్నారు. మట్టిని ప్రస్తుతం నల్లమాడ వద్ద జరుగుతున్న పనులకు వాడుతున్నారు.

**ఒకటే.. తోలుడు**

వాస్తవానికి అనుమతి తీసుకున్న ప్రాంతం చుట్టూ హద్దురాళ్లు పాతాలి. అందులోనే తవ్వకాలు జరపాలి. ప్రస్తుతం ఆ ప్రాంతానికి వెళ్లి చూస్తే కళ్లు బైర్లుకమ్మాల్సిందే. కనీసం 50 ఎకరాలకు పైగానే కొల్లగొట్టేశారు. 3 మీటర్ల లోతుతో ముళ్లకంపలు, ఎర్రమట్టితో కప్పబడిన చిన్న దిబ్బని మాత్రమే తాత్కాలిక అనుమతి పత్రంలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పెద్దకొండ దర్శనమిస్తుంది. పుట్టపర్తి నుంచి నల్లమాడకు వెళ్లే రహదారి పక్కనే ఇంత జరుగుతున్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

**అధికారుల తాత్సారం**

మట్టి తవ్వకానికి అనుమతి ఇచ్చిన ప్రాంతం పక్కనే పుట్టపర్తి వ్యవసాయ మార్కెట్‌యార్డు స్థలం ఉంది. స్థలాన్ని పరిశీలించిన అనంతరం పక్కనే యథేచ్ఛగా జరుగుతున్న దోపిడీ విషయాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పూల శివప్రసాద్ గనులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించలేదు. మరుసటి రోజు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మూడ్రోజులైనా చర్యలు లేవు. మరోవైపు తవ్వకాలు జోరుగా సాగుతూనే ఉన్నాయి.

**తనిఖీలు చేస్తాం** నల్లమాడ వద్ద గుట్టను పరిమితికి మించి తవ్వుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. సంయుక్తంగా తనిఖీలు చేయాలని నిర్ణయించాం. ఎంత మొత్తంలో తవ్వేశారో గుర్తించి అందుకనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం. ఓబుళరెడ్డి, గనులశాఖ ఏడీ, మనోజ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దార్

# నెట్టికంటయ్యా.. మురుగు తొలగేదెన్నడయ్యా!



గుంతకల్లు : రాయలసీమలోనే నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. వ్యాసరాయలు ప్రతిష్ఠించిన క్షేత్రాల్లో అత్యంత ప్రధానమైనది కావడం విశేషం. ఇంతటి ప్రాధాన్యమున్న ఆలయాన్ని దాతల సహకారంతో ప్రగతి పనులు చేపడుతున్నారు. అన్నీ బాగానే ఉన్నా.. కసాపురం గ్రామానికి చెందిన ప్రధాన మురుగు కాలువ కోవెల అభివృద్ధికి అవరోధంగా మారింది. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి క్షేత్ర సందర్శనకు వచ్చే వందలాది మంది భక్తులు మురుగు గుండా వెళ్లాల్సి వస్తోంది.

కసాపురం గ్రామంలో దాదాపు 1500 ఇళ్లు, 3 వేల జనాభా ఉన్నారు. గృహాల నుంచి వచ్చే మురుగు బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో ఆలయ సమీప పరిసరాల్లో మురుగు పారుతోంది. గతంలో చిన్నపాటి కాలువను ఆలయం వెనుకభాగంలో గోడకు ఆనుకుని ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు మురుగుతో ఇబ్బంది పడుతున్నారు.

**రూ.2 కోట్లు దారి మళ్లాయి!**

కసాపురం గ్రామంలో మురుగు సమస్య పరిష్కారానికి నాలుగేళ్ల కిందట ప్రభుత్వం కాలువ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించింది. ఆయా పనులకు అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భూమి పూజ చేశారు. తరువాత ప్రభుత్వం నిధులను దారి మళ్లించడంతో పనులు ప్రారంభం కాలేదు. ఫలితంగా మురుగుతో గ్రామప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నానా అగచాట్లు పడుతున్నారు.

**సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం**

ఆలయ పరిసరాల్లోకి మురుగు రాకుండా దారి మళ్లించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. ఈమేరకు ప్రణాళిక రూపొందిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటాం.

వెంకటేశ్వరుడు, సహాయ కార్యనిర్వహణాధికారి

# పరిహారం ఇవ్వక.. లీజు సొమ్ము అందక

పుట్టపర్తి: తమ ప్రాంతంలో పెద్ద జలాశయం వస్తుందని సంబరపడిపోయారు. తాము కొంత త్యాగంచేస్తే ఇతర రైతులకూ మేలు జరుగుతుందని తలంచారు. తమకున్నది కొంతే అయినా ప్రజాప్రయోజనం ఆశించి భూమిని ఇచ్చేశారు. లీజుపేరుతో తీసుకొన్న పొలంలో అధికారులు కట్ట నిర్మించేశారు. అయినా నేటికీ ప్రాజెక్టు పూర్తవలేదు. దీంతో జిల్లేడుబండ జలాశయ నిర్వాసితులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులు రూ.680 కోట్లతో 2021, డిసెంబరులో ప్రారంభమయ్యాయి. తెలంగాణకు చెందిన గుత్తేదారు సంస్థ పనులను దక్కించుకుంది. ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లితండా, బుక్కపట్నం మండలంలోని గోపాలపురం గ్రామాలకు చెందిన 30ఎకరాల భూములు కట్ట నిర్మించే ప్రాంతంలో ఉన్నాయి. అందులో వేరుసెనగ, చీనీ, మామిడి ఇతరత్రా పంటలు సాగులో ఉన్నాయి. భూములు లీజుకిస్తే ఎకరాకు ఏడాదికి రూ.30వేల చొప్పున చెల్లిస్తామని, ముంపు భూములన్నింటికీ పరిహారం వచ్చినప్పుడు మీకు కూడా ఇస్తామని గుత్తేదారు చెప్పారు. ఈమేరకు రైతులతో అగ్రిమెంటు తీసుకుని భూములను తీసుకున్నారు. పంటపొలాలన్నీ తొలగించి ఆ ప్రాంతమంతా మట్టితో కప్పి 7.92 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించారు.



**కొందరికే...**

అగ్రిమెంటు ప్రకారం మూడేళ్లు రైతుల ఖాతాల్లో లీజు నగదు జమ చేశారు. తర్వాత కొందరికి జమ కాలేదు. జలాశయ ముందు భాగంలో కట్ట నిర్మాణానికి ఖర్చయిన సుమారు రూ.వందకోట్ల వరకు బిల్లులను గుత్తేదారు పూర్తి చేసుకున్నారు. పరిహారంపై వైకాపా ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత ప్రభుత్వం మారడంతో గుత్తేదారు వెనక్కివెళ్లిపోయారు. ఇప్పుడు రైతులకు లీజు డబ్బులు, పరిహారం చెల్లించలేదు. తిరిగి సాగు చేసుకుందామంటే భూములన్నీ కట్టనిర్మాణంలో కలిసిపోయాయి.

ఇటీవల రైతులు.. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించేలా అధికారులను పంపుతామని, ముంపు బాధితులకు న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

**అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం** భూములు కోల్పోయినవారికి లీజు ప్రకారం గుత్తేదారు ఏటా నగదు చెల్లిస్తున్నారు. జలాశయం ముంపు భూములకు పరిహారం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాము. త్వరలోనే పరిహారం అందేలా తగిన చర్యలు తీసుకుంటాం ఖైలేష్, ఏఈ, నీటిపారుదల శాఖ

# మీ డబ్బు.. మీ హక్కు

విశాఖపట్నం: జిల్లాలో వినియోగించని బ్యాంకు ఖాతాల్లో రూ.195 కోట్ల డబ్బు పోగుబడి ఉందంటే నమ్ముతారా? అవును ఇది వాస్తవం. ఆయా బ్యాంకుల అధికారులు దీన్ని ధ్రువీకరించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని ఖాతాల్లో ఉన్న నగదును బ్యాంకులు తిరిగిచ్చేస్తున్నాయి. ఈ మేరకు ఆర్‌బీఐ ఆదేశాలిచ్చింది. ఇలా ఏళ్ల తరబడి నిర్వహించని ఖాతాలను డీఈఏఎఫ్ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్) అని పిలుస్తారు. ఏయే బ్యాంకుల్లో ఎన్ని ఖాతాలు అలాంటివి ఉన్నాయి, వాటిల్లో ఎంత నగదు ఉందో వివరాలు తెప్పించుకుంది. ఇందులో భాగంగా డిసెంబరు నెలాఖరు వరకు జిల్లాలో అన్ని చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆ నగదును వెనక్కి ఇస్తారు.

**ఎవరిని సంప్రదించాలంటే..** ఖాతా ఉన్న బ్యాంకు మరోదాంట్లో విలీనమై ఉంటే ఆ బ్యాంకును సంప్రదించొచ్చు.ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాలి.పరిశీలన అనంతరం బ్యాంకు ప్రతినిధి ధ్రువీకరించిన తర్వాత ఆ మొత్తం అక్కడే పొందొచ్చు.ఖాతాదారు మృతి చెందితే సంబంధిత కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలి

**ఇలా తెలుసుకోవచ్చు..:**

జిల్లాలో డీఈఏఎఫ్ ఖాతాలు 6.22 లక్షలు ఉండగా, వాటిల్లో రూ.195 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని ఎల్‌డీఎం శ్రీనివాస్ తెలిపారు.. నిర్వహణలో లేని ఖాతాలను ఆ బ్యాంకు వెబ్‌సైట్ లింకులోనూ తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఆర్‌బీఐ యూడీజీఏఎం పోర్టల్ %https://udgam.rbi.org.in% లోనూ చూడొచ్చు.ఆ డబ్బు తీసుకోండి..: వినియోగించని బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును సంబంధిత వినియోగదారులు సులభంగా పొందొచ్చు. రిజర్వ్‌బ్యాంకు కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులు ఉపయోగించుకోవాలి. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఆరు లక్షలకుపైగా ఖాతాల్లో డబ్బులు ఉండిపోయాయి. దీనికి సంబంధించి ఇటీవల సిరిపురం ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాం.శ్రీనివాస్, ఎల్‌డీఎం, విశాఖ

# బొమ్మల పరిశ్రమపై కదలిక

నక్కపల్లి: పారిశ్రామికంగా జిల్లాను పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. మంత్రి వంగలపూడి అనిత చొరవతో నక్కపల్లి మండలంలో బొమ్మల తయారీ కంపెనీ స్థాపనకు అడుగులు పడుతున్నాయి.

పరిశ్రమల నిమిత్తం గతంలో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతున్నాయి. వీటికి అనుమతులు వచ్చాయి. బల్క్‌డ్రగ్‌కు ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. స్టీల్ ప్లాంట్‌కు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. రెండో విడతలో మరో మూడు వేల ఎకరాలు ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

'పాల్స్ ప్లష్' బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై కొద్ది నెలల కిందట సీఎం ఆదేశాలతో మంత్రి అనిత సంబంధిత కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారు. ఉపమాక, ఎన్.నర్సాపురం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట తదిరత ప్రాంతాల్లో కేటాయించాలని నిర్ణయించడంతోపాటు ప్రాథమికంగా భూమిని గుర్తించారు. దీనిపై కలెక్టర్ తదితరులతో మంత్రి చర్చించారు.

బొమ్మల పరిశ్రమ ఏర్పాటైతే మహిళలకు వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 25 వేల మందికి అవకాశం ఉంటుందని మంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో బొమ్మల తయారీ పరిశ్రమ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## అందాలు రాశి పోసి చీర కడితే...!

ఊహలు గుసగుసలాడే సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్‌లో పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. అంతకు ముందు హిందీ సినిమాలోనూ కనిపించిన ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. అంతే కాకుండా అక్కినేని ఇంటి మూవీ మనం లోనూ రాశి ఖన్నా నటించింది. కానీ ఆ సినిమాతో రాశి ఖన్నాను జనాలు పెద్దగా గుర్తించలేదు. కానీ రాశి ఖన్నాకు ఊహలు గుసగుసలాడే సినిమాతో ఇండస్ట్రీలో గుర్తింపు దక్కింది. ఆ సినిమా తర్వాత ఆమెకు ఆఫర్లు తలుపు తట్టాయి. ఆకట్టుకునే అందంతో పాటు, నటిగా తనను తాను నిరూపించుకునేందుకు చాలా కష్టపడే మనస్థత్వం కావడంతో రాశి ఖన్నా ఇండస్ట్రీలో చాలా కాలంగా సినిమాలు చేస్తూ వస్తుంది. పదేళ్ల కాలంలో ఈ అమ్మడు చేసిన సినిమాలు చాలానే ఉన్నాయి. స్టార్ హీరోల సినిమాల్లో నటించకుండా



ఇన్నాళ్లు కెరీర్ కొనసాగించడం గొప్ప విషయం.

**రాశి ఖన్నా అందాల ఫోటో షూట్...** సాధారణంగా హీరోయిన్స్ ఎక్కువ సంవత్సరాలు ఉన్నారంటే ఖచ్చితంగా వారి ఫిల్మోగ్రఫీలో స్టార్ హీరోల సినిమాలు ఉంటాయి. కానీ రాశి ఖన్నా ఫిల్మోగ్రఫీలో పెద్ద సినిమాలే ఉండవు. ఎన్టీఆర్ తో కలిసి నటించిన జై లవకుశ సినిమా ఉన్నప్పటికీ అందులో సెకండ్ హీరోయిన్ రోల్ అనుకోవాల్సిందే. అది కూడా చాలా తక్కువ సమయం స్క్రీన్ ప్రజెన్స్ ఉంటుంది. కనుక స్టార్ హీరోలతో మెయిన్ లీడ్ పాత్రలను ఈమె చేసిందే లేదు. అయినా కూడా హీరోయిన్‌గా మంచి గుర్తింపు, గౌరవం దక్కడంతో పాటు, చేసిన మీడియం రేంజ్ సినిమాలు రాశి ఖన్నాకు మంచి పేరును తెచ్చి పెట్టాయి. అందుకే రాశి ఖన్నా ఇప్పటికీ హీరోయిన్‌గా బిజీగా ఉంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు, ప్రేక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాశి ఖన్నా సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన చీర కట్టు ఫోటోలతో రాశి ఖన్నా...** ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 12 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న రాశి ఖన్నా సాధారణంగానే ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ కావడం మనం చూస్తూనే ఉంటాం. రాశి ఖన్నా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు ఆమె అభిమానుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఉంటారు. తాజాగా చీర కట్టు ఫోటోలను షేర్ చేయడం ద్వారా రాశి ఖన్నా మరోసారి చూపు తిప్పనివ్వడం లేదు అంటూ అభిమానులు కంప్లైంట్ చేస్తున్నారు. పేరుకు తగ్గట్లుగానే అందాలు రాశి పోసి క్రియేట్ చేసినట్లుగానే రాశి ఖన్నా చాలా అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. చీర కట్టులో అంతకు మించి అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. బంగారు వర్ణపు చీర కట్టులో రాశి ఖన్నా మెరిసి పోతుంది. ఈ స్థాయి అందం రాశికి మాత్రమే సాధ్యం అన్నట్లుగా కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## 49 ఏళ్ల మీనా రెండవ పెళ్లి గురించి ఏమంటున్నారు?

వెటరన్ నటి అందాల మీనా గురించి చెప్పాల్సిన పనిలేదు. హీరోయిన్ గా ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన నటి. సౌత్ లో అన్ని భాషల్లోనూ సత్తా చాటారు. ఎంతో మంది హీరోలతో కలిసి పనిచేసారు. చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున లాంటి స్టార్ హీరోలతో ఎన్నో సినిమాలు చేసారు. నటిగా కెరీర్ మొదలు పెట్టిన నాటి నుంచి 2025వరకూ పని చేస్తూనే ఉన్నారు. వివాహం చేసుకున్నా? వృత్తిని మాత్రం వదల్లేదు. కుటుంబం..సినిమాలు రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ కెరీర్ ని ముందుకు సాగించారు. భర్త...పాపతో సంతోషంగా సాగిపోతున్న జీవితంలో భర్త మరణంతో అంతా తల్లకిందులైంది. అప్పటి నుంచి పాపే ప్రాణంగా జీవిస్తున్నారు. ఈ దశలో కూడా మీనా సినిమాలకు దూరమవ్వలేదు. బాధనంతా పంటికిందే దిగమింగి అభిమానుల్ని అలరిస్తున్నారు. సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ వచ్చిన అవకాశాలతో బిజీగా ఉన్నారు. అయితే భర్త మరణానంతరం మీనా రెండవ పెళ్లి చేసుకుంటారనే ప్రచారం



ఎప్పటికప్పుడు జరుగుతోంది. వాటిని ఏనాడు మీనా కూడా ఖండించలేదు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగతం ఎలా ఉంది? ఆరోగ్యానికి సంబంధిం చిన విషయాలపై మాత్రమే ఓపెన్ అయ్యారు. ఈ నేపథ్యంలో తాజాగా పెళ్లి ప్రచారం పీక్స్ కు చేరడంతో? వాటిపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేసారు. ప్రస్తుతం పాపతో సంతోషంగా ఉన్నాను. పెళ్లి గురించి రకరకాల వార్తలొస్తున్నాయి. ఏ హీరో విడాకులు తీసుకున్నా? అతడితో నా పెళ్లి అంటూ రాస్తున్నారు. ఇవన్నీ అవాస్తవాలు. వాటిలో ఎలాంటి నిజాలు లేవన్నారు. సెకెండ్ ఇన్నింగ్స్ లో ఇప్పుడిప్పుడే అవకాశాలు పెరుగుతున్నాయ%-%న్నారు. పాప పుట్టిన రెండేళ్లకే మలయాళం సినిమా దృశ్యం కోసం సంప్రదించారు. కానీ అప్పుడు వీలుకాకపోవడంతో నో చెప్పానన్నారు. కానీ కథ నచ్చడంతో కొన్ని రోజుల తర్వాత ఒకే చెప్పానన్నారు. ఇప్పుడు కూడా మంచి కథలు, వాటిలో పాత్ర విషయం పూర్తి సంతృప్తిగా ఉంటేనే నటించడానికి అంగీకరిస్తున్నాను. లేదంటే? నో చెబుతున్నానన్నారు. తాను నటిగా మరిన్ని మెరుగైన పాత్రలు పోషించడానికి మాత్రమే సిద్దంగా ఉన్నానన్నారు. ప్రస్తుతం మీనా మల యాళం వెర్షన్ దృశ్యం 3 లో నటిస్తున్నారు. మోహన్ లాల్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రం ఆన్ సెట్స్ లో ఉంది. అలాగే తమిళ్ లో మూకుత్తి అమ్మన్ 2 తో పాటు, రౌడీ బేబిలోనూ నటిస్తున్నారు. తెలుగు వెర్షన్ దృశ్యంలోనూ మీనా నటించిన సంగతి తెలిసిందే. దృశ్యం 3 లో కూడా ఆమె నటించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం మీనా వయసు 49 ఏళ్లు.




## మంచి సాయంత్రపు కాఫీలాంటి అమ్మాయి..!



సినీ ఇండస్ట్రీలో చిన్న వయసులోనే అడుగుపెట్టిన నటీమణుల్లో కావ్య కళ్యాణ్‌రామ్ ఒకరు. చిన్నారి ఆర్టిస్ట్‌గా ఎన్నో సినిమాల్లో కనిపించిన ఆమెను ప్రేక్షకులు ఇప్పటికీ ఆ ముద్దు పాత్రలతో.. గుర్తు పెట్టుకుంటారు. కాలంతో పాటు ఆమె కూడా మారింది. నటనలో మెరుగులు దిద్దుకుంటూ.. తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల కావ్య తన సోషల్ మీడియా ప్రొఫైల్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోల్లో ఆమె ఎరుపు రంగు చీర..ఆకుపచ్చ బ్లౌజ్‌లో చాలా సంప్రదాయంగా కనిపించింది. ఎలాంటి హంగులు లేకుండా..సహజమైన లుక్ లో ఆమె నిలబడిన తీరు చూస్తే ఎవరికైనా పాత రోజులు గుర్తొస్తాయి. ఇంటి ఆవరణలో..మృదువైన సూర్యకాంతి మధ్య ఆమె నిలబడి ఉన్న ఫోటో సినీ అభిమానులను తెగ ఆకట్టుకుంటుంది. ఈ ఫోటోలకు ఆమె.."సాయంత్రం ఒక ఫిల్టర్ కప్ కాఫీ కోసం సిద్ధంగా ఉన్నాను.." అనే క్యాప్షన్ కూడా పెట్టింది. కావ్య సినీ ప్రయాణం చిన్నారి పాత్రలతోనే మొదలైంది. చాలా మంది స్టార్ హీరోల సినిమాల్లో బాల నటిగా కనిపించింది. ఆ తర్వాత హీరోయిన్‌గా 'మసూద' సినిమా ద్వారా ఎంట్రీ ఇచ్చింది. ఆ తరువాత వచ్చిన 'బలగం' సినిమా ఆమె కెరీర్‌ను పూ ర్తిగా మార్చేసింది. ఆ సినిమాలో కావ్య నటన తెలుగు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. సహజమైన నటనతో ఆమె చాలా మందికి ఇష్టమైన హీరోయిన్‌గా మారిపోయింది. 'బలగం' తర్వాత 'ఉస్తాద్' సినిమాలో ఆమె కనిపించింది. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆ సినిమా తరువాత కావ్య కొత్త సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంతో అభిమానుల్లో అనేక ప్రశ్నలు మొదలయ్యాయి. ఆమె గ్యాప్ తీసుకుందా.. లేక మంచి కథల కోసం ఎదురుచూస్తుందా అనే చర్చలు జరుగుతున్నాయి. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ కావ్య సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటుంది. అప్పుడప్పుడు ఇలాంటి సింపుల్ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను దగ్గరగా ఉంచుకుంటుంది.

## వేటకు సిద్ధమైన 'మన శంకరవరప్రసాద్ గారు'





సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి జోరు పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ స్పీడ్ పెంచిన చిత్ర యూనిట్, లేటెస్ట్ గా ఓవర్సీస్ ప్రేక్షకులకు అదిరిపోయే అప్డేట్ ఇచ్చింది. అమెరికాలో ఈ సినిమా బుకింగ్స్ ను అధికారికంగా ఓపెన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా యుఎస్ ప్రీమియర్స్ జనవరి 11న చాలా గ్రాండ్ గా జరగనున్నాయి. సంక్రాంతి పండుగకు ముందే బాక్సాఫీస్ జాతర మొదలుపెట్టాలని మేకర్స్ డిసైడ్ అయ్యారు. సరిగ్గా పండగ మూడ్ ని సెట్ చేసేలా ఈ ప్రీమియర్స్ ను ప్లాన్ చేశారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ సరిగామ సినిమాస్ ఈ చిత్రాన్ని ఓవర్సీస్ లో భారీ ఎత్తున రిలీజ్ చేస్తోంది. లేటెస్ట్ గా వదిలిన పోస్టర్ లో చిరు లుక్ ఫ్యాన్స్ కు గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఫార్మల్ సూట్ వేసుకుని, చేతిలో పెద్ద గన్ పట్టుకుని ఏదో టార్గెట్ వైపు వెళ్తున్నట్లు ఉన్న చిరంజీవి స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "మన శంకరవరప్రసాద్ గారు.. పండగకి వస్తున్నారు" అంటూ పోస్టర్ పై ఉన్న క్యాప్షన్ సినిమాపై నమ్మకాన్ని మరింత పెంచుతోంది. అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, చిరంజీవి మాస్ ఇమేజ్, కామెడీ టైమింగ్ కలిస్తే అవుట్ పుట్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరు నుంచి వస్తున్న పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ కావడంతో ట్రేడ్ వర్గాల్లో కూడా ఈ సినిమాపై మంచి బజ్ ఉంది. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నారు.

భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఆల్బమ్ ఇప్పటికే మాస్ ఆడియెన్స్ కు రీచ్ అయ్యింది. ఇప్పుడు ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ అవ్వడంతో రికార్డుల వేట మొదలైనట్లే. జనవరి 11న ప్రీమియర్స్ తోనే సినిమా రేంజ్ ఏంటో తెలిసిపోతుంది. మెగాస్టార్ బాక్సాఫీస్ స్టామినాను మరోసారి చూసేందుకు ఫ్యాన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. మొత్తానికి ఈసారి సంక్రాంతి పోరు రసవత్తరంగా మారింది. తనదైన స్టైల్, స్వాగ్ తో చిరు మరోసారి బాక్సాఫీస్ ను షేక్ చేయడానికి రెడీ అయ్యారు. చూడాలి మరి, ఈ 'మన శంకరవరప్రసాద్ గారు' సంక్రాంతి విన్నర్ గా నిలిచి ఎలాంటి రికార్డులు సృష్టిస్తారో.

## బాలీవుడ్ లో ఫుల్ జోష్.. ట్రెండీ లుక్‌లో రకుల్ గ్లామర్ ట్రీట్!

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొంది, ఇప్పుడు బాలీవుడ్?లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు రకుల్ ప్రీత్ సింగ్. ఫిట్‌నెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఈ బ్యూటీ, తన నటనతోనే కాకుండా స్టైలిష్ లుక్స్‌తోనూ ఫ్యాన్స్?ను ఎప్పుడూ ఆకట్టుకుంటారు. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి. ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో రకుల్ ఎంతో ట్రెండీగా కనిపిస్తున్నారు. నలుపు, తెలుపు చారలు ఉన్న స్టైలిష్ క్రాప్ టాప్, దానికి మ్యాచింగ్‌గా వైట్ షార్ట్స్ ధరించి గ్లామరస్‌గా మెరిసిపోతున్నారు. ఆమె ఫిట్‌నెస్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. సింపుల్‌గా కనిపిస్తూనే, ఎంతో గ్లామరస్ గా ఉన్న ఈ లుక్‌కు అభిమానుల నుంచి లైకుల వర్షం కురుస్తోంది. ప్రస్తుతం రకుల్ 'దే దే ప్యార్ దే 2' సినిమా



సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఈ చిత్రంలో తన పాత్ర 'ఆయేషా'కు ప్రేక్షకుల నుంచి వస్తున్న ప్రేమను చూసి ఎంతో సంతోషంగా ఉన్నట్లు క్యాప్షన్‌లో పేర్కొన్నారు. అజయ్ దేవ్‌గణ్, ఆర్. మాధవన్ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడం, వారు తనకు స్పేస్ ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తో తెలుగు తెరకు పరిచయమైన రకుల్, తక్కువ సమయంలోనే స్టార్ హీరోలందరి సరసన నటించి టాప్ హీరోయిన్‌గా ఎదిగారు. ఇప్పుడు బాలీవుడ్?లోనూ వరుస సినిమాలు చేస్తూ బిజీగా మారారు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నారు. పెళ్లి తర్వాత కూడా రకుల్ తన కెరీర్ స్పీడ్ ఏమాత్రం తగ్గించలేదు. సినిమాలతో బిజీగా ఉంటూనే, సోషల్ మీడియాలో తన గ్లామరస్ ఫొటోలు, ఫిట్?నెస్ వీడియోలు షేర్ చేస్తూ ఫ్యాన్స్?కు నిత్యం టచ్?లో ఉంటున్నారు. గ్లామర్‌లోనూ, నటనలోనూ తనదైన ముద్ర వేస్తూ దూసుకుపోతున్నారు. ఇక తెలుగులో ఆమె నటించి చాలా కాలమైంది. మరి రానున్న రోజుల్లో మళ్ళీ బిజీ అవుతుందో లేదో చూడాలి.

## నువ్వు అత్యుత్తమ రాముడివి.. భాగ్యశ్రీ గుట్టు తెలిసిపోయే!

రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్ర కింగ్ తాలూకాతో అలరించబోతున్నారు. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్-స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. వివేక్ - మెర్విన్ స్వరపరిచిన ఈ సినిమా సంగీతం ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది, పాటలు చార్ట్‌బస్టర్‌లుగా మారాయి. ట్రైలర్ సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా మేకర్స్ వైజాగ్ లో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్ లో రామ్ మైండ్ బ్లోయింగ్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ అందరినీ మెస్మరైజ్ చేసింది. కాన్సర్ట్ లో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మాట్లాడుతూ.. నా కెరీర్ లో గర్వపడే సినిమా ఆంధ్ర కింగ్ తాలూకా. ఈ సినిమా ఇంత బ్యూటిఫుల్ గా రావడానికి చాలా మంది కష్టం ఉంది. దర్శకని



ర్మాతలు, సాంకేతిక నిపుణులు చాలా శ్రమించారని, మనసు పెట్టి పని చేసారని రామ్ అన్నారు. ఇక భాగ్యశ్రీ భోర్సేపై రామ్ ప్రశంసల వర్షం కురిపించాడు. తెలుగు ఇండస్ట్రీకి చాలా రోజుల తర్వాత గ్లామర్ తో పాటు మంచి పర్ఫార్మ్ చేసే హీరోయిన్ భాగ్యశ్రీ వచ్చింది. ఇటీవల వచ్చిన సినిమాలో కూడా అతను అద్భుతమైన పర్ఫామెన్స్ ఇచ్చింది.. అని ప్రశంసించాడు. ఇదే వేదికపై హీరోయిన్ భాగ్యశ్రీ తెలుగులో మాట్లాడుతూ అందరి హృదయాలను గెలుచుకుంది. తెలుగు నేర్చుకుని మరీ భాగ్యశ్రీ ఎంతో పోయెటిక్ వర్డింగ్ తో మాట్లాడి కుర్రకారు గుండెల్లో గిలిగింతలు పెట్టింది. ముఖ్యంగా భాగ్య శ్రీ రామ్ పై తన ప్రేమను చాటుకుంది. భాగ్య శ్రీ మాట్లాడుతూ హలో వైజాగ్. ఈవెంట్ కి వచ్చినా అందరికీ థాంక్యూ. నా చిన్ని గుండెలో చాలా ఆశలతో ఇక్కడికి వచ్చాను. మీ అందరి అభిమానానికి ధన్యవాదాలు. రామ్ గారు అభిమానుల్ని ఎంతగానో ప్రేమించే హీరో. ఆయన కింగ్ ఆఫ్ హార్ట్స్. మీ అందరి ప్రేమకు ఆయన అర్హులు. అందరూ కూడా ఈ సినిమాని చూడాలని కోరుతున్నాను అని అన్నారు. రామ్ ని ఉద్దేశించి మాట్లాడుతూ .. నువ్వు అత్యుత్తమ రాముడివి. నీ విజయం లేదా వైఫల్యం ఎలా ఉన్నా, నువ్వు ఉన్నత స్థానంలో ఉన్నా లేకపోయినా మేము నిన్ను ప్రేమిస్తున్నాము! అని కూడా భాగ్యశ్రీ అంది. నిజానికి ఈ అందాల భరిణె మనసులోని మాటలు అభిమానులను ఆశ్చర్యపరిచాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536